


ESTD: 1999

www.voodayam.com

# వుదయం




సంపుటి : 27
సంచిక : 92 | హైదరాబాద్ |04-06-2026 గురువారం

SINCE 25 YEARS CIRCULATED TELUGU DAILY

రూ. 3.00 | పేజీలు : 12 | VOODAYAM Telugu DAily

Simultaneously Published from Hyderabad, Adilabad, Karimnagar, Khammam, Guntur & Warangal

Follow us on




# అగ్నికి ఆహుతి

## ఢిల్లీ లోని ఓ హోటల్‌లో భారీ అగ్నిప్రమాదం

గాయపడినవారిని ఆసుపత్రులకు తరలింపు

లోపల ఉన్నవారు బయటకు వచ్చే మార్గం

లేనటువంటి పరిస్థితులతో అవస్థలు

ఘటనపై ప్రధాని నరేంద్రమోడీ దిగ్భ్రాంతి

ఢిల్లీ అగ్నిప్రమాద ఘటనపై ప్రధాని దిగ్భ్రాంతి వ్యక్తంచేశారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఈ ఘటన బాధితులకు అన్నిరకాల సహాయం చేస్తామని వెల్లడించారు.

**న్యూఢిల్లీ, జూన్ 3 (వుదయం బ్యూరో) :** దేశ రాజధాని ఐన న్యూ ఢిల్లీలో బుధవారం భారీ అగ్నిప్రమాదం జరిగింది. మాలవీయ నగర్ లోని ఫ్లరిష్ స్టే బ్రెడ్ అండ్ బ్రేక్‌ఫాస్ట్ హోటల్‌లో మంటలు చెలరేగిన సంఘటనలో 21 మంది దుర్మరణం చెందారు. మృతుల్లో విదేశీయులు కూడా ఉన్నారు. ప్రమాదం నుంచి పలువురిని కాపాడగా, మరికొంత మంది చిక్కుకొని ఉంటారని తెలుస్తోంది. హౌజ్‌రానీ ప్రాంతంలో ఉదయం 8.50 గంటల సమయంలో హోటల్‌లో మంటలు చెలరేగాయి.

మిగతా 2లో

### పెట్టుబడులకు కేరాఫ్‌గా

# తెలంగాణను తీర్చిదిద్దుతాం

## విదేశీ పెట్టుబడులను ఆకర్షించేందుకు చర్యలు : సిఎం రేవంత్ రెడ్డి

ఎంసీహెచ్‌ఆర్డీలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసిన

దక్షిణాఫ్రికా ఉపాధ్యక్షుడు పాలస్ మషటైల్ బృందం

పెట్టుబడులపై సీఎంతో పాలస్ మషటైల్ బృందం చర్చ

వాణిజ్య, పారిశ్రామిక, పెట్టుబడి సంబంధాలను మరింత

బలోపేతం చేసే అంశాలపై విస్తృతంగా చర్చకు వచ్చిన అంశాలు

పారిశ్రామిక అభివృద్ధి, సాంకేతిక రంగ

పురోగతిపై ఆసక్తి చూపిన దక్షిణాఫ్రికా ఉపాధ్యక్షుడు

తెలంగాణలో పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తి చూపుతున్న దక్షిణాఫ్రికా పారిశ్రామికవేత్తలకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలుగా సహకారం అందిం చేందుకు సిద్ధంగా ఉంది. పెట్టుబడిదారులకు అనుకూలమైన విధానాలు, పారదర్శక పాలన, వేగవంతమైన అనుమతుల వ్యవస్థ తెలంగాణ ప్రత్యేకతలు. దక్షిణాఫ్రికా కంపెనీలు తెలంగాణలో పరిశ్రమలు స్థాపిం చ డం ద్వారా ఇరు ప్రాంతాల ఆర్థికాభివృద్ధికి కొత్త అవకాశాలు ఏర్పడతాయి. – సిఎం రేవంత్ రెడ్డి





**హైదరాబాద్, జూన్ 3 (వుదయం ప్రతినిధి) :** తెలంగాణను పెట్టుబడులకు అత్యంత అనుకూల గమ్యస్థానంగా అభివృద్ధి చేస్తున్నామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. విదేశీ పెట్టుబడులను ఆకర్షించేందుకు తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని పేర్కొన్నారు. బుధవారం నాడు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని దక్షిణాఫ్రికా ఉపాధ్యక్షుడు పాలస్ మషటైల్ బృందం ఎంసీహెచ్‌ఆర్డీలో కలిశారు.

మిగతా 2లో

## నా మాటలు

# అబద్ధాలు కావు



నేను చెప్పినవన్నీ తప్పు అని నిరూపిస్తే రాజకీయాలు వదిలేస్తా

నాలుగు కోట్ల ప్రజలు మా కుటుంబమే అని భావించి పాలించాం

జాతీయవాదం గురించి పవన్ పాఠాలు నేర్చుకోవాల్సిన అవసరం లేదు

పవన్ నుంచి పాఠాలు నేర్చుకోవాల్సిన అవసరం లేదు

అనివార్య పరిస్థితుల్లో తెలంగాణ ఇచ్చిన కాంగ్రెస్

భారత రాష్ట్ర సమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్

తెలంగాణ వ్యతిరేకులు పదవిలో కూర్చోవడమే బాధంగా ఉంది

* దశాబ్ద కాలంలో సుసంపన్నమైన తెలంగాణ ను ఆవిష్కరించాం. రాష్ట్రాన్ని పరిపాలించే నాయకత్వ పటిమ మీకుందా? అని ఆనాడు కొందరు అన్నారు. మాకు కూడా కేసీఆర్ లాంటి పాలకుడు కావాలని అనుకునేలా పదేళ్ల పాలన సాగింది. దేశానికి అన్నం పెట్టే స్థాయికి తెలంగాణ ఎదిగింది. వ్యవసాయానికి ఉచితంగా 24 గంటలు కరెంట్ ఇచ్చిన ఏకైక రాష్ట్రం తెలంగాణ. ఎన్నికల అజెండాలో లేకున్నా రైతుకు పెట్టుబడి సాయం చేసే రైతు బంధు తీసుకొచ్చాం. తలసరి ఆదాయంలో రాష్ట్రాన్ని అగ్రస్థానం లో నిలిపాం. నేను చెప్పినవన్నీ తప్పు అని నిరూపిస్తే.. శాశ్వతంగా రాజకీయాలను వదిలేస్తా. నాలుగు కోట్ల ప్రజలు మా కుటుం బమే అని భావించి పాలించాం. ఇప్పుడు తెలంగాణ వ్యతిరేకులు పదవిలో కూర్చోవడ మే బాధాకరంగా ఉంది. – కెటిఆర్

**హైదరాబాద్, జూన్ 3 (వుదయం ప్రతినిధి) :** తెలంగాణ వచ్చాక పెట్టుబడుల సాధనలో బెంగళూరును అధిగమించినట్లు భారత రాష్ట్ర సమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ తెలిపారు. బుధవారం మీట్ ది ప్రెస్ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కేసీఆర్ పోరాటం వల్లే తెలంగాణ వచ్చిందనేది నిర్వివాదాంశమని స్పష్టం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వమే తెలంగాణ ఇచ్చినప్పటికీ.. ఇవ్వక తప్పని పరిస్థితి సృష్టించింది కేసీఆర్‌యేనని వెల్లడించారు. 2014లో తెలంగాణలో సాగు భూమి విస్తీర్ణం 1.50 కోట్ల ఎకరాలు మాత్రమే. 2023లో బీఆర్‌ఎస్ ప్రభుత్వం దిగిపోయేనాటికి సాగు భూమి విస్తీర్ణం 2.29 కోట్ల ఎకరాలకు చేరింది. దశాబ్ద కాలంలో సుసంపన్నమైన తెలంగాణను ఆవిష్కరించాం. రాష్ట్రాన్ని పరిపాలించే నాయకత్వ పటిమ మీకుందా? అని ఆనాడు కొందరు అన్నారు. మాకు కూడా కేసీఆర్‌లాంటి పాలకుడు కావాలని అనుకునేలా పదేళ్ల పాలన సాగింది. దేశానికి అన్నం పెట్టే స్థాయికి తెలంగాణ ఎదిగింది. వ్యవసాయానికి ఉచితంగా 24 గంటలు కరెంట్ ఇచ్చిన ఏకైక రాష్ట్రం తెలంగాణ. ఎన్నికల అజెండాలో లేకున్నా రైతుకు పెట్టుబడి సాయం చేసే రైతు బంధు తీసుకొ చ్చాం. తలసరి ఆదాయంలో రాష్ట్రాన్ని అగ్రస్థానంలో నిలిపాం. నేను చెప్పినవన్నీ తప్పు అని నిరూపిస్తే.. శాశ్వతంగా రాజకీయాలను వదిలే స్తా. నాలుగు కోట్ల ప్రజలు మా కుటుంబమే అని భావించి పాలించాం. ఇప్పుడు తెలంగాణ వ్యతిరేకులు పదవిలో కూర్చోవడమే బాధాకరంగా ఉంది. కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని రంగాల్లో విఫలమైంది'' అని కేటీఆర్ విమర్శించారు. జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్‌ను తెలంగాణలో ప్రజలే అడ్డుకున్నారని బీఆర్‌ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు. తెలంగాణ ఏర్పడితే అన్నం తినని వ్యక్తి.. రాష్ట్ర అవతరణ రోజు సభ ఎందుకు పెట్టారని ప్రశ్నించారు. తెలంగాణలో జనసేన కొత్తగా పోటీ చేసేదేముందన్నారు. ప్రాంతీయ వాదం.. ఉగ్రవాదం కంటే ప్రమాదకరమని పవన్ అన్నారు. పొట్టి శ్రీరాములు ఆంధ్రరాష్ట్రం కోసం ప్రాణాలు అర్పించారు. దాన్ని తప్పు పడతారా? అని ప్రశ్నించారు. జాతీయవాదం గురించి పవన్ వద్ద పాఠాలు నేర్చుకోవాల్సిన అవసరం లేదన్నారు.

### సెక్రెటేరియట్ వద్ద దంపతుల

# ఆత్మహత్యాయత్నం

మా భూ సమస్యను అధికారులు పట్టించుకోవడం లేదు

కొండా పోచమ్మపల్లి గ్రామానికి చెందిన దంపతుల ఆవేదన

పెట్రోల్ డబ్బాతో సెక్రటేరియట్ వద్దకు చేరుకుని

ఒంటిపై పెట్రోల్ పోసుకున్న భార్యభర్తలు

పెట్రోల్ డబ్బాను లాక్కొని అదుపులోకి తీసుకున్న పోలీసులు



**హైదరాబాద్, జూన్ 3 (ఎఎంఎస్) :** తెలంగాణ సెక్రటేరియట్ వద్ద బుధవారం ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. తమ భూమి సమస్యకు న్యాయం చేయాలని కోరుతూ వచ్చిన ఓ దంపతులు సెక్రటేరియట్ ప్రధాన ద్వారం సమీపంలో ఒంటిపై పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యకు యత్నించడం కలకలం రేపింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, కొండా పోచమ్మపల్లి గ్రామానికి చెందిన పుట్ట కృష్ణయ్య, ఆయన భార్య సైదమ్మ తమ భూమికి సంబంధించిన సమస్యపై న్యాయం కోసం గత మూడు రోజులుగా అధికారుల చుట్టూ తిరుగుతున్నారు. అయితే తమ వినతిని ఎవరూ పట్టించుకోవడం లేదని ఆరోపిస్తూ తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు.ఈ నేపథ్యంలో దంపతులు పెట్రోల్ డబ్బాతో సెక్రటేరియట్ వద్దకు చేరుకుని ఒంటిపై పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యకు యత్నించారు. అక్కడ భద్రతా విధుల్లో ఉన్న ఎస్పీఎఫ్ పోలీసులు వెంటనే అప్రమత్తమయ్యారు. దంపతుల చేతిలో ఉన్న పెట్రోల్ డబ్బాను లాక్కొని వారిని అదుపులోకి తీసుకున్నారు. దీంతో పెను ప్రమాదం తప్పింది. తర్వాత దంపతులను విచారణ నిమిత్తం సైఫాబాద్ పోలీసు స్టేషన్‌కు తరలించారు. వారి భూమి సమస్యకు సంబంధించిన వివరాలను పోలీసులు సేకరిస్తున్నారు.

### తెలంగాణ విత్తన రంగ అనుభవం నైజీరియా

# యువతకు ఉపయోగపడాలి

తెలంగాణలో శిక్షణ పొందిన టరాబా

రాష్ట్ర యువతకు సర్టిఫికెట్ల ప్రదానం

వ్యవసాయం, విత్తన రంగాల్లో తెలంగాణ, టరాబా

రాష్ట్రాల మధ్య భాగస్వామ్యం మరింత బలోపేతం

శామీర్‌పేట్‌లోని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్

ఎంటర్‌ప్రైజ్‌లో అంతర్జాతీయ విత్తన విద్య,

పారిశ్రామిక అభివృద్ధి శిక్షణ కార్యక్రమంలో

మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



**హైదరాబాద్, జూన్ 3 (వుదయం ప్రతినిధి) :** శామీర్‌పేట్‌లోని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ ఎంటర్‌ప్రైజ్ లో నిర్వహించిన "అంతర్జాతీయ విత్తన విద్య, పారిశ్రామిక అభివృద్ధి శిక్షణ కార్యక్రమం" బుధవారం ఘనంగా ముగిసింది. కార్యక్రమానికి మరో మంత్రి వివేక్ తో కలిసి వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్రం దేశంలోనే విత్తన రంగానికి కేంద్రంగా గుర్తింపు పొందిందని, ఆ అనుభవాన్ని నైజీరియాలోని టరాబా రాష్ట్ర యువతతో పంచుకోవడం సంతోషకరమన్నారు. ఈ శిక్షణ ద్వారా యువత విత్తన ఉత్పత్తి, హైబ్రిడ్ సీడ్ టెక్నాలజీ, విత్తన శుద్ధి, ప్రాసెసింగ్, వ్యవసాయ వ్యాపార నిర్వహణ వంటి అంశాల్లో ప్రాయోగిక పరిజ్ఞానం పొందారని తెలిపారు. టరాబా రాష్ట్ర ప్రభుత్వం తమ యువతకు అంతర్జాతీయ స్థాయి శిక్షణ కల్పించేందుకు చూపుతున్న చొరవ అభినందనీయమని మంత్రి పేర్కొన్నారు. తెలంగాణ ప్రభుత్వం కూడా టరాబా రాష్ట్రంతో వ్యవసాయం, విత్తన సాంకేతికత, రైతు శిక్షణ, వ్యవసాయ ఆధారిత పరిశ్రమల అభివృద్ధి రంగాల్లో సహకారాన్ని మరింత విస్తరించేందుకు సిద్ధంగా ఉందన్నారు. తెలంగాణ, టరాబా రాష్ట్రాల మధ్య "సిస్టర్ స్టేట్" భాగస్వామ్యానికి సంబంధించి చర్చలు కొనసాగుతున్నాయని, ఇది ఇరు ప్రాంతాల మధ్య పరస్పర అభివృద్ధికి దోహదపడుతుందనిమంత్రి తెలిపారు. ఈ సందర్భంగా తెలంగా ణ రాష్ట్రం ఈ రెండు సంవత్సరాలలో సాధించిన ప్రగతిని మంత్రి వివరించారు. టరాబా రాష్ట్ర యువత ఇక్కడ నేర్చుకున్న నైపుణ్యాలను తమ ప్రాంత అభివృద్ధికి వినియోగించి వ్యవసాయ రంగంలో కొత్త అవకాశాలను సృష్టించాలని మంత్రి తుమ్మల ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి, సీడ్ కార్పొరేషన్ చైర్మన్ అన్వేష్ రెడ్డి, నైజీరియాలోని టరాబా రాష్ట్ర గవర్నర్ డాక్టర్ అగ్బు కెఫాస్, టరాబా సీడ్స్ లిమిటెడ్, ప్రసాద్ సీడ్స్ ప్రైవేట్ లిమి టెడ్, ఇంటర్నేషనల్ పబ్లిక్ ఎంటర్‌ప్రైజ్ ప్రతినిధులు, శిక్షకులు, అధికారులు పాల్గొన్నారు.




# డీకే

- కర్ణాటక నూతన ముఖ్యమంత్రిగా డీకే శివకుమార్ ప్రమాణస్వీకారం
- సిద్ధరామయ్య కుమారుడు యతీంద్ర, కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే తనయుడు ప్రియాంక్ ఖర్గేలు మంత్రులుగా ప్రమాణ స్వీకారం

**బెంగళూరు, జూన్ 3 :** కర్ణాటక నూతన ముఖ్యమంత్రిగా డీకే శివకుమార్ ప్రమాణస్వీకారం చేశారు. గవర్నర్ థావర్‌చంద్ గహ్లోత్ ఆయనతో ప్రమాణం చేయించారు. బుధవారం లోక్ భవన్ లోని గ్లాస్‌హౌస్‌లో ఈ కార్యక్రమం ఘనం గా జరిగింది. ఈ వేడుకకు కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, అగ్రనాయకుడు రాహుల్ గాంధీ, కర్ణాటక మాజీ ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, తెలంగాణ, కేరళ, హిమాచల్ ప్రదేశ్ సీఎంలు రేవంత్ రెడ్డి, వీడీ సతీశన్, సుఖ్వీందర్ సింగ్ సుఖు, ఇతర ఏఐసీసీ నేతలు హాజరయ్యారు. రాజ్యాంగం మినీబుక్‌ను చేతబట్టి డీకే ప్రమాణ స్వీకారం చేశారు. అంతకుముందు వేదికపై నుంచి ప్రజలకు సాష్టాంగ నమస్కారం చేశారు. ఉప ముఖ్యమంత్రిగా జి.పరమేశ్వర బా ధ్యతలు తీసుకోనుండగా.. సిద్ధరామయ్య కుమా రుడు యతీంద్ర, కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే తనయుడు ప్రియాంక్ ఖర్గే పేర్లు మంత్రులుగా ప్రమాణస్వీకారం చేసేవారి జాబితాలో ఉన్నాయి. వీరితో పాటు కేహెచ్ మునియప్ప, కె.జె.జార్జ్, ఎంబీ పాటిల్, రామలింగా రెడ్డి, సతీశ్ జర్కిహోళి, కృష్ణబైరి గౌడ, యు.టి.ఖాదిర్, ఈశ్వర్ ఖండ్రే, బైరతి సురేశ్, శరణ్ ప్రకాశ్ పాటిల్ సైతం మంత్రులుగా ప్రమాణస్వీకారం చేశారు.

### హెచ్-1బీ వీసా కోసం ఇప్పటివరకు

# 2.86 లక్షల అప్లికేషన్లు

ఫీజు చెల్లించిన దరఖాస్తులు

15 రోజుల్లోనే ప్రాసెస్




**వాషింగ్టన్, జూన్ 3 :** హెచ్–1బీ వీసా ఫీజును అమెరికా భారీగా పెంచినప్పటికీ.. డిమాండ్ మాత్రం తగ్గలేదు. రెండు లక్షలకు పైగా దరఖాస్తుదారులు లక్ష డాలర్లు చెల్లించి ఈ వీసా తీసుకునేందుకు ముందుకువచ్చారని డిపార్ట్‌మెంట్ ఆఫ్ హోమ్‌ల్యాండ్ సె)క్యూరిటీ కార్యదర్శి మార్క్‌వేన్ ముల్లిన్ తెలిపారు. 2026 ఆర్థిక సంవత్సరానికి ఈ దరఖాస్తులు వచ్చాయని చెప్పారు. ఈ ఆర్థిక సంవత్సరంలో హెచ్–1బీ వీసా కోసం ఇప్పటివరకు 2.86 లక్షల అప్లికేషన్లు వచ్చాయి. ఆ దరఖాస్తుదారుల్లో రెండు లక్షలమందికి పైగా లక్ష డాలర్లు చెల్లించారు. ఆ ఫీజు చెల్లించిన దరఖాస్తులు దాదాపు 15 రోజుల్లోనే ప్రాసెస్ అవుతాయి.

మిగతా 2లో

### గోదావరి పుష్కరాలకు

# రూ.100 కోట్లు విడుదల

మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్

జగిత్యాల జిల్లా వెల్గటూర్ మండలంలో ఆర్ అండ్ బీ, పంచాయతీ రాజ్ శాఖల అధికారులతో కలిసి పుష్కరాల ఏర్పాట్లను పరిశీలించిన మంత్రి

వెల్గటూర్ నుంచి రాజక్క పల్లె వరకు

బైపాస్ రోడ్డు నిర్మాణం చేపట్టాలని ఆదేశం

2



# కాంగ్రెస్ చేతల పార్టీ

- బిఆర్ఎస్ చేతకాని పార్టీ
- వచ్చే ఎన్నికల్లోనూ కాంగ్రెస్‌దే అధికారం అని స్పష్టత రావడంతో డ్రామారావుకు
- ఫ్రస్టేషన్ పెరిగిపోయింది : పొంగులేటి
- సవాల్‌ను స్వీకరించే దమ్ములేని కేటీఆర్



**హైదరాబాద్, జూన్ 3 (ఎఎంఎస్) :** అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిపోయి, పార్లమెంట్ ఎన్నికల్లో సున్నాకు పడిపోయి.. సర్పంచ్ ఎన్నికలు, మున్సిపల్ ఎన్నికల్లోనూ చిత్తు చిత్తుగా బీఆర్‌ఎస్ ఓడిపోవడం.. వచ్చే ఎన్నికల్లోనూ కాంగ్రెస్ పార్టీదే అధికారం అని స్పష్టత రావడంతో డ్రామారావుకు ఫ్రస్టేషన్ పెరిగిపోయిందని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. జర్నలిస్ట్ అంత స్పష్టంగా హైదరాబాద్ లో ఇండ్ల నిర్మాణాలపై నేను చేసిన సవాల్ గురించి ప్రశ్న అడిగితే..దానిపై సమాధానం చెప్పలేక, సవాల్ ను స్వీకరించే దమ్ములేని దద్దమ్మ కేటీఆర్,

మిగతా 2లో

# పెట్టుబడులకు కేరాఫ్‌గా తెలంగాణను తీర్చిదిద్దుతాం

మొదటి పేజీ తరువాయి

అధికారిక పర్యటనలో భాగంగా దక్షిణాఫ్రికా బృందం హైదరాబాద్ వచ్చింది. ఈ సమావేశంలో పెట్టుబడులపై సీఎంతో.. పాలస్ మషటైల్ బృందం చర్చించింది. ఈ సమావేశంలో తెలంగాణ ప్రభుత్వం తరఫున మంత్రి శ్రీధర్ బాబు, మంత్రి దామోదర రాజనరసింహ, సీఎస్ రామకృష్ణారావుతో పాటు పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు. సమావేశంలో తెలంగాణ, దక్షిణాఫ్రికా మధ్య వాణిజ్య, పారిశ్రామిక, పెట్టుబడి సంబంధాలను మరింత బలోపేతం చేసే అంశాలపై విస్తృతంగా చర్చించారు. ముఖ్యంగా సమాచార సాంకేతికత, తయారీ, మౌలిక సదుపాయాలు, ఫార్మా, వ్యవసాయం తదితర రంగాల్లో పరస్పర సహకార అవకాశాలపై అభిప్రాయాలు పంచుకున్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణలో పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తి చూపుతున్న దక్షిణాఫ్రికా పారిశ్రామికవేత్తలకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలుగా సహకారం అందించేందుకు సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు.



పెట్టుబడిదారులకు అనుకూలమైన విధానాలు, పారదర్శక పాలన, వేగవంతమైన అనుమతుల వ్యవస్థ తెలంగాణ ప్రత్యేకతలని వివరించారు. దక్షిణాఫ్రికా కంపెనీలు తెలంగాణలో పరిశ్రమలు స్థాపించడం ద్వారా ఇరు ప్రాంతాల ఆర్థికాభివృద్ధికి కొత్త అవకాశాలు ఏర్పడతాయని అభిప్రాయపడ్డారు. దక్షిణాఫ్రికా ఉపాధ్యక్షుడు పాలస్ మషటైల్ కూడా తెలంగాణ పారిశ్రామిక అభివృద్ధి, సాంకేతిక రంగ పురోగతిపై ఆసక్తి వ్యక్తం చేశారు. భవిష్యత్తులో వాణిజ్య, పెట్టుబడి రంగాల్లో మరింత సహకారం కొనసాగించేందుకు ఇరు పక్షాలు సానుకూలంగా స్పందించాయి.

# కృష్ణానది వెస్ట్ బైపాస్ రోడ్డుపై యోగా

**ఏపి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు**

**అమరావతి, జూన్ 3 (వుదయం ప్రతినిధి) :** ఆరోగ్యాంధ్రప్రదేశ్, స్వర్ణాంధ్రప్రదేశ్ సాధించాలంటే యోగాంధ్ర చాలా ముఖ్యమని ఏపీ సీఎం చంద్రబాబు అన్నారు. రాష్ట్రంలో యోగా కార్యక్రమంపై ఆయన మీడియాతో మాట్లాడారు. జీవన విధానంలో యోగాను భాగం చేసేందుకు యోగాంధ్రను ఏటా జరపాలని నిర్ణయించామని సీఎం తెలిపారు. ఈ ఏడాది యోగా దినోత్సవానికి 'యోగా ఫర్ హెల్తీ ఏజ్' థీమ్‌ను పాటిస్తున్నట్లు చెప్పారు. వృద్ధాప్యంలోనూ ఆరోగ్యంగా జీవించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. సంజీవని పథకంలో యోగాను అనుసంధానం చేస్తామని తెలిపారు. ఈ నెల 7 నుంచి 20 వరకు 14 రోజుల పాటు యోగా కార్యక్రమాలను నిర్వహించాలి. ప్రైవేటు, ప్రభుత్వ విద్యాసంస్థలు, కార్యాలయాలు అందరూ భాగస్వామ్యం కావాలి. ప్రతి జిల్లా, మండల కేంద్రం ఇలా ఎన్ని చోట్ల వీలైతే అన్ని చోట్ల యోగా కార్యక్రమాలు నిర్వహించాలి. యోగాంధ్ర 2026లో కనీసం కోటి మంది పాల్గొనేలా లక్ష్యం పెట్టుకోవాలి. 10 లక్షల మంది సర్టిఫైడ్ యోగా సాధకులను తయారు చేయాలి. గతేడాది యోగా కార్యక్రమాలతో అనేక రికార్డులు సాధించాం. ప్రపంచమంతా ఏపీ వైపు చూసేలా చేయగలిగాం.



నిరుడు విశాఖ బీచ్ పక్కన రోడ్డుపై యోగా చేశాం. ఈసారి కృష్ణా నది వెస్ట్ బైపాస్ రోడ్డుపై యోగా చేస్తాం. అమరావతి అందాన్ని ప్రపంచానికి చూపించే అవకాశం కూడా ఉంటుంది'' అని చంద్రబాబు అన్నారు. 21 వ్యాధులకు సంబంధించి యోగాసనాల వీడియోలను ప్రభుత్వ సలహాదారు మంతెన సత్యనారాయణ రాజు రూపొందించారని చంద్రబాబు తెలిపారు. సోషల్ మీడియాలో ఈ వీడియోలు అందుబాటులో ఉంటాయని వెల్లడించారు. 8142404888 కాల్ సెంటర్‌ను సంప్రదించి సమగ్ర సమాచారం తెలుసుకోవచ్చని చెప్పారు.

# 21 మంది అగ్నికి ఆహుతి

మొదటి పేజీ తరువాయి

ఈ సమాచారం అందుకున్న పోలీసులు, అత్యవసర సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకున్నారు. సహాయక చర్యలు ఇంకా కొనసాగుతున్నాయి. గాయపడినవారిని సమీప ఆసుపత్రులకు తరలించారు. ''తొలుత చిన్నగా మొదలైన మంటలు.. తర్వాత వేగంగా వ్యాపించాయి. దాంతో లోపల ఉన్నవారు బయటకు వచ్చే మార్గం లేకుండా పోయింది. పైనున్నవారు కిందికి దూకినా ఎలాంటి దెబ్బలు తగలకుండా ఉండేందుకు స్థానికులు పరుపులు పరిచారు. మూడో అంతస్తు నుంచి ఒక మహిళ చిన్నారితో సహా కిందికి దూకింది'' అని ప్రత్యక్షంగా చూసిన ఒకరు మీడియాకు తెలిపారు. మహిళలు కిందకు దూకుతున్న దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యాయి. ఉదయం తాను ఎలక్ట్రిక్ స్టవ్ ఆన్ చేయడానికి ప్రయత్నించగా.. ఒక్కసారిగా మంటలు చెలరేగాయని ఆ హోటల్‌లో పనిచేసే చెఫ్ కేసర్ సింగ్ వెల్లడించారు. వెంటనే హోటల్ సిబ్బందిని అప్రమత్తం చేసినట్లు తెలిపారు. నేను బయటకు వచ్చి చూస్తే.. హోటల్ మొత్తం మంటల్లో చిక్కుకొని కనిపించింది అని చెప్పారు. ఈ హోటల్‌లో బస చేసిన విదేశీయులు సెంట్రల్ ఆసియా, ఆఫ్రికా నుంచి చికిత్స కోసం వచ్చినట్లు అధికారులు వెల్లడించారు. కేంద్రం ప్రభుత్వం ఆధ్వర్యంలోని బెడ్ అండ్ బ్రేక్‌ఫాస్ట్ స్కీమ్ కింద ఇది నడుస్తోంది. అయితే, ఈ హోటల్‌లో పరిమితికి మించి అతిథులకు వసతి సౌకర్యాలు కల్పించినట్లు ఆరోపణలున్నాయి.

**ప్రధాని నరేంద్ర మోడీ దిగ్భ్రాంతి**

దిల్లీ అగ్నిప్రమాద ఘటనపై ప్రధాని నరేంద్రమోడీ దిగ్భ్రాంతి వ్యక్తంచేశారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఈ ఘటన బాధితులకు అన్నిరకాల సహాయం చేస్తామని వెల్లడించారు. మృతుల కుటుంబాలకు రూ.రెండు లక్షలు, గాయపడిన వారికి చికిత్స నిమిత్తం రూ.50 వేల ఎక్స్‌గ్రేషియ ానను ప్రకటించారు. దిల్లీ ముఖ్యమంత్రి రేఖా గుప్తా కూడా తీవ్ర విచారం వ్యక్తం చేశారు.

# హెచ్-1బీ వీసా కోసం ఇప్పటివరకు 2.86 లక్షల అప్లికేషన్లు

మొదటి పేజీ తరువాయి

ఇతరులవి ప్రాసెసింగ్ కోసం సుమారు 7.5 నెలల సమయం పడుతుంది'' అని ముల్లిన్ వెల్లడించారు. హెచ్-1బీ వీసా దరఖాస్తులపై వార్షిక రుసుంను లక్ష డాలర్లుగా నిర్ణయిస్తూ ఆయన తీసుకున్న నిర్ణయం వల్ల.. అమెరికా వేదికగా పనిచేస్తున్న కంపెనీలు విదేశీ నిపుణులను నియమించుకునేందుకు జారీ చేసే ఒక్కో వీసాకు లక్ష డాలర్లు చెల్లించాలి. దరఖాస్తు చేసుకొనే సమయంలో కట్టాల్సిన వన్‌టైమ్ ఫీజు అది. ఆ దేశంలో ఇప్పటికే చదువుతున్న విదేశీ విద్యార్థులకు ఆ ఫీజు విషయంలో మినహాయింపు ఇచ్చింది. దేశం బయట నుంచి వచ్చే దరఖాస్తులకు మాత్రమే ఈ ఫీజు వర్తిస్తుందని అమెరికా ప్రభుత్వం ఇప్పటికే స్పష్టం చేసింది.

# గోదావరి పుష్కరాలకు రూ.100 కోట్లు విడుదల

**వెల్గటూర్, జూన్ 3 (వుదయం ప్రతినిధి) :** 2027లో నిర్వహించనున్న గోదావరి పుష్కరాలకు రాష్ట్ర ప్రభుత్వం తొలి విడతగా రూ.100 కోట్లు విడుదల చేసిందని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి లక్ష్మణ్ కుమార్ తెలిపారు. బుధవారం జగిత్యాల జిల్లా వెల్గటూర్ మండలంలో ఆర్ అండ్ బీ, పంచాయతీ రాజ్ శాఖల అధికారులతో కలిసి పుష్కరాల ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా వెల్గటూర్ నుంచి రాజక్క పల్లె వరకు బైపాస్ రోడ్డు నిర్మాణం చేపట్టాలని అధికారులకు సూచించారు. వెల్గటూర్‌లో నిర్మిస్తున్న అయ్యప్ప స్వామి దేవాలయం వద్ద పర్యాటకులను ఆకర్షించే విధంగా బోటింగ్ సౌకర్యం కల్పించాలని, కోటిలింగాల నుంచి పాసిగాం వరకు నూతన రోడ్డు నిర్మించాలన్నారు. ఏడాది ముందే పనులు ప్రారంభించి, 2027 మార్చి వరకు పూర్తి చేస్తామని మంత్రి పేర్కొన్నారు. దేశంలోని పలు ప్రాంతాల నుంచి పుష్కరాలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటామన్నారు. ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా అన్ని రకాల సౌకర్యాలు కల్పిస్తున్నామని తెలిపారు.

# అత్యాధునిక వైద్య పరిశోధనల కేంద్రంగా హైదరాబాద్

**అవకాశాలను అందిపుచ్చుకునేలా...**

**సవాళ్లను ఎదుర్కొనేలా "ఎకో సిస్టం" అభివృద్ధి**

**బయో టెక్నాలజీ రంగంలోనూ గ్లోబల్ లీడర్ గా తీర్చిదిద్దుతాం**

**థెరానిమ్ బయోలాజిక్స్' మాన్యుఫ్యాక్చరింగ్ ఫెసిలిటీ ప్రారంభోత్సవంలో మంత్రి శ్రీధర్ బాబు**

**హైదరాబాద్, జూన్ 3 (వుదయం ప్రతినిధి) :** క్యాన్సర్, ఇతర అరుదైన రోగాలను నయం చేసే బయోలాజిక్స్, వ్యాక్సిన్లు, సెల్ అండ్ జీన్ థెరపీ వంటి అత్యంత అధునాతన వైద్య పరిశోధనలకు ప్రధాన కేంద్రంగా హైదరాబాద్ ను తీర్చిదిద్దేందుకు ప్రణాళికాబద్ధంగా కృషి చేస్తున్నామని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. పరిశోధన దశ నుంచి కమర్షియల్ ప్రొడక్షన్ దాకా అవసరమైన అన్ని సదుపాయాలను ఒకే చోట కల్పించేలా అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన "ప్రపంచ స్థాయి ఎకో సిస్టమ్"ను అభివృద్ధి చేసేలా సమగ్ర కాంప్రహెన్సివ్ రోడ్ మ్యాప్ ను సిద్ధం చేస్తున్నామన్నారు. సంగారెడ్డి జిల్లా హత్నూరా మండలం బోర్పట్ల గ్రామంలో రూ.1200 కోట్ల పెట్టుబడితో ఏర్పాటు చేసిన 'థెరానిమ్ బయోలాజిక్స్ మాన్యుఫ్యాక్చరింగ్ ఫెసిలిటీని బుధవారం ఆయన లాంఛనంగా ప్రారంభించారు. ఫార్మా రాజధాని హైదరాబాద్ ను బయో టెక్నాలజీ రంగంలోనూ గ్లోబల్ లీడర్ గా మార్చేందుకు తీసుకుంటున్న చర్యలను ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు వివరించారు. రాబోయే రోజుల్లో బయోటెక్నాలజీ రంగంలో రోబోటిక్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, అడ్వాన్స్‌డ్ జెనెటిక్స్ వంటి సాంకేతికతలు విప్లవాత్మక మార్పులు తీసుకొస్తాయన్నారు. ఫలితంగా వచ్చే అవకాశాలను అందిపుచ్చుకునేలా... తలెత్తే సవాళ్లను అధిగమించేలా... దిగ్గజ కంపెనీల పెట్టుబడులను ఆకర్షించేలా వ్యూహాత్మక అడుగులు వేస్తున్నామన్నారు. లైఫ్ సైన్సెస్ పాలసీ, వన్ బయో హబ్, గ్రీన్ ఫార్మా సిటీ, లైఫ్ సైన్సెస్ హబ్ తదితర విప్లవాత్మక అడుగులు లైఫ్ సైన్సెస్ రంగంలో "మేడ్ ఇన్ తెలంగాణ" బ్రాండ్ ను మరింత విశ్వవ్యాప్తం చేసేందుకు దోహదపడతాయన్నారు. ఓ వైపు లైఫ్ సైన్సెస్ పరిశ్రమలకు అవసరమయ్యే మౌలిక సదుపాయాలు కల్పిస్తూనే... మరోవైపు వారికి కావాల్సిన "రెడీ టూ వర్క్ ఫోర్స్"ను తయారు చేసే బృహత్తర బాధ్యతను తాము తీసుకున్నామన్నారు. ఈ అంశంలో రాష్ట్ర ప్రభుత్వంతో కలిసి పని చేసేందుకు ముందుకు రావాలని దిగ్గజ ఫార్మా కంపెనీలకు పిలుపునిచ్చారు.



# టీఆర్ఎస్ చీఫ్ కల్వకుంట్ల కవితతో బ్రిటిష్ డిప్యూటీ హై కమిషనర్ భేటీ

**హైదరాబాద్, జూన్ 3 (ఎంఎస్) :** తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవితతో బ్రిటిష్ డిప్యూటీ హై కమిషనర్ గారెత్ విన్ ఓవెన్ భేటీ అయ్యారు. బంజారాహిల్స్ లోని తెలంగాణ రక్షణ సేన కార్యాలయంలో హైదరాబాద్ బ్రిటిష్ హైకమిషన్ పొలిటికల్ అండ్ ఎకనామిక్ అడ్వైజర్ నళిని రాఘురామన్ తో కలిసి డిప్యూటీ హై కమిషనర్ గారెత్ విన్ ఓవెన్ మర్యాద పూర్వకంగా కవితను కలిశారు. భారత్ – యునైటెడ్ కింగ్ డమ్ మధ్య ద్వైపాక్షిక సంబంధాలు, ఇతర అంశాలపై చర్చించారు. ఈ సమావేశంలో టీఆర్ఎస్ సీనియర్ నాయకులు పాల్గొన్నారు


# చర్లపల్లి-తిరువణ్ణామలై మధ్య ప్రత్యేక రైళ్లు




**హైదరాబాద్, జూన్ 3 (వుదయం ప్రతినిధి) :** భక్తుల సౌకర్యార్థం చర్లపల్లి–తిరువణ్ణామలై మధ్య ప్రత్యేక రైళ్లు నడపనున్నారు. ఈ మేరకు దక్షిణ రైల్వే ఓ ప్రకటన విడుదల చేసింది. 07001 నంబర్ చర్లపల్లి–తిరువణ్ణామలై ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైలు.. ఈ నెల 4 నుంచి సెప్టెంబరు 24వ తేదీ వరకు (గురువారం) చర్లపల్లిలో సాయంత్రం 5.50 గంటలకు బయల్దేరి మరుసటి రోజు మధ్యాహ్నం 1.30 గంటలకు తిరువణ్ణామలై చేరుకుంటుంది. అదేవిధంగా మరో మార్గంలో 07002 నంబర్ తిరువణ్ణామలై–చర్లపల్లి ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైలు.. ఈ నెల 5వ తేదీ నుంచి సెప్టెంబరు 26వ తేదీ వరకు (శుక్రవారం) తిరువణ్ణామలైలో రాత్రి 11.10 గంటలకు బయల్దేరి మరుసటిరోజు సాయంత్రం 4.30 గంటలకు చర్లపల్లి చేరుకుంటుంది. ఈ రెండు రైళ్లు నల్గొండ, మిర్యాలగూడ, గుంటూరు, తెనాలి, బాపట్ల, చీరాల, ఒంగోలు, నెల్లూరు, రేణిగుంట, తిరుపతి, పాకాల, చిత్తూరు, కాట్పాడి, వేలూరు కంటోన్మెంట్ మీదుగా తిరువణ్ణామలై చేరుకుంటాయి. ఈ రైళ్ల రిజర్వేషన్ బుధవారం నుంచి ప్రారంభమైందని దక్షిణ రైల్వే ప్రకటనలో తెలిపింది.

# పవన్ అమాయకంగా మాట్లాడుతున్నారు

**కూనంనేని సాంబశివరావు**



**హైదరాబాద్, జూన్ 3 (వుదయం ప్రతినిధి) :** తెలుగు రాష్ట్రాల్లో పవన్ కల్యాణ్ అపరిచితుడిగా వ్యవహరిస్తున్నారని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు విమర్శించారు. మంగళవారం నిర్వహించిన పవన్ మీడియా సమావేశంపై ఆయన స్పందించారు. పవన్ అమాయకంగా మాట్లాడుతున్నారనే బాధ కలుగుతుందని పేర్కొన్నారు. నేను, మా నాన్న కమ్యూనిస్టులమని పదేపదే చెప్పావు.. మరి ఆ కమ్యూనిజం ఎక్కడికి పోయింది పవన్?సనాతన ధర్మాన్ని ఎవరు అవమానించారు? ప్రపంచ కార్మికులారా విడిపోండి అని మేము పిలుపునిచ్చామా? మమ్మల్ని ఎందుకు లాగారు?కమ్యూనిజం చచ్చిపోయిందని ఎవరు చెప్పారు? జనసేన కనుమరుగు అవుతుందేమో గానీ, కమ్యూనిజం చచ్చిపోదు. ఏపీ, తెలంగాణ రాద్ధాంతం మీ రాజకీయ ప్రయోజనాల కోసమా? వేరేవారి కోసమా?చెప్పాలి. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం రోజే వచ్చి సవాల్ విసరడం అంటే ప్రాంతీయవాదాన్ని రెచ్చగొట్టడమే''అని కూనంనేని అన్నారు.

# నకిలీ ఐఏఎస్ ముఠా అరెస్ట్

**హైదరాబాద్, జూన్ 3 (ఎంఎస్) :** హైదరాబాద్‌లో నకిలీ ఐఏఎస్ ముఠాను పోలీసులు అరెస్ట్ చేశారు. కానిస్టేబుల్ ద్వారా 6 మంది టీంతో ముఠా ఏర్పడినట్లు పోలీసులు తెలిపారు. ఐఏఎస్ అధికారులమంటూ పూర్ణచంద్రరావు అనే వ్యక్తిని ఈ ముఠా బెదిరించింది. ఫేక్ పోలీస్ కార్‌లో పూర్ణచంద్రరావును సూర్యాపేటకు తీసుకెళ్లి దాదాపు రూ.6.26 లక్షల నగదును వసూలు చేసినట్లు సమాచారం. బాధితుడి ఫిర్యాదుతో కేసు నమోదు చేసిన పోలీసులు.. ఎట్టకేలకు నిందితులను పట్టుకున్నారు.

# 59 మంది ఎమ్మెల్యేల మద్దతుంది

**టీఎంసీ నేత రితబ్రత బెనర్జీ**

**కోల్ కత్తా, జూన్ 3 (వుదయం ప్రతినిధి) :** అంతర్గత విభేదాలతో టీఎంసీ పార్టీ సతమతమవుతోన్న వేళ కీలక పరిణామం చోటుచేసుకుంది. తనకు 59 మంది ఎమ్మెల్యేల మద్దతు ఉందని తృణమూల్ కాంగ్రెస్ నుంచి బహిష్కరణకు గురైన ఎమ్మెల్యే రితబ్రత బెనర్జీ పేర్కొన్నారు. అసెంబ్లీలో పార్టీకి మొత్తం 80 మంది శాసనసభ్యులు ఉండగా.. వారిలో మూడింట రెండొంతుల కంటే ఎక్కువమంది మద్దతు తమకు ఉందని పేర్కొంటూ స్పీకర్‌కు లేఖ సమర్పించారు. టీఎంసీ తిరుగుబాటు వర్గం ఆయనను కొత్త ప్రతిపక్ష నేతగా ప్రతిపాదిస్తున్నట్లు తెలుస్తోంది. టీఎంసీ పార్టీని చీల్చి, గుర్తును కూడా సొంతం చేసుకునేందుకు దాదాపు 50 మందికి పైగా ఎమ్మెల్యేలు ప్రయత్నిస్తున్నట్లు స్వయంగా తృణమూల్ అధికార ప్రతినిధి రిజుదత్తా పేర్కొన్న అనంతరం ఈ ఘటన చోటుచేసుకోవడం గమనార్హం. ఫిరాయింపుల నిరోధక చట్టం నిబంధనల ప్రకారం.. అనర్హత వేటు పడకుండా ఉండేందుకు చీలిక వర్గానికి మూడింట రెండొంతుల శాసనసభ్యుల మద్దతు అవసరం. అంటే తృణమూల్ తిరుగుబాటు వర్గంలో 53 మంది ఎమ్మెల్యేలు ఉండాలి. ప్రస్తుతం రెబల్ వర్గానికి అంతకంటే ఎక్కువ (59) మద్దతు ఉండడంతో వారు టీఎంసీ పేరు, చిహ్నాన్ని సొంతం చేసుకునే అవకాశం ఉంది. తృణమూల్ తమ శాసనసభా పక్ష నేతగా ఇటీవల శోభన్‌దేబ్ ఛటోపాధ్యాయ్‌ని నియమించింది. అయితే ఆ నియామక ఉత్తర్వుల్లో తమ సంతకాలను ఫోర్జరీ చేశారంటూ పార్టీ ఎమ్మెల్యేలు రితబ్రత బెనర్జీ, సందీపన్ సాహా స్పీకర్‌కు ఫిర్యాదు చేయడం కలకలం సృష్టించింది. ఈ పరిణామంతో రితబ్రత, సందీపన్‌లను సోమవారం తృణమూల్ సస్పెండ్ చేసింది. నాటి నుంచి పార్టీలో తిరుగుబాటు వర్గానికి రితబ్రత నాయకత్వం వహిస్తున్నట్లు తెలుస్తోంది. టీఎంసీలో కొనసాగుతోన్న గందరగోళం నేపథ్యంలో ఆ పార్టీకి చెందిన 15 మంది ఎంపీలు తనను సంప్రదించారని బెంగాల్ భాజపా నేత దిబ్యేందు అధికారి ప్రకటించారు. అయితే ప్రస్తుతానికి ఎవరినీ పార్టీలోకి



చోటుచేసుకోవడం గమనార్హం. ఫిరాయింపుల నిరోధక చట్టం నిబంధనల ప్రకారం.. అనర్హత వేటు పడకుండా ఉండేందుకు చీలిక వర్గానికి మూడింట రెండొంతుల శాసనసభ్యుల మద్దతు అవసరం. అంటే తృణమూల్ తిరుగుబాటు వర్గంలో 53 మంది ఎమ్మెల్యేలు ఉండాలి. ప్రస్తుతం రెబల్ వర్గానికి అంతకంటే ఎక్కువ (59) మద్దతు ఉండడంతో వారు టీఎంసీ పేరు, చిహ్నాన్ని సొంతం చేసుకునే అవకాశం ఉంది. తృణమూల్ తమ శాసనసభా పక్ష నేతగా ఇటీవల శోభన్‌దేబ్ ఛటోపాధ్యాయ్‌ని నియమించింది. అయితే ఆ నియామక ఉత్తర్వుల్లో తమ సంతకాలను ఫోర్జరీ చేశారంటూ పార్టీ ఎమ్మెల్యేలు రితబ్రత బెనర్జీ, సందీపన్ సాహా స్పీకర్‌కు ఫిర్యాదు చేయడం కలకలం సృష్టించింది. ఈ పరిణామంతో రితబ్రత, సందీపన్‌లను సోమవారం తృణమూల్ సస్పెండ్ చేసింది. నాటి నుంచి పార్టీలో తిరుగుబాటు వర్గానికి రితబ్రత నాయకత్వం వహిస్తున్నట్లు తెలుస్తోంది.

తీసుకోకూడదని భాజపా అధిష్ఠానం నుంచి ఆదేశాలు అందాయని తెలిపారు. ఈ విషయంపై పార్టీ అధినేత మాత్రమే నిర్ణయం తీసుకుంటారన్నారు. టీఎంసీ పార్టీలో సంక్షోభం మరింత తీవ్రమయ్యే రోజు దగ్గరలోనే ఉందని.. మమతా బెనర్జీ నేతృత్వంలోని పార్టీ పతనం వైపు పయనిస్తోందని అన్నారు.

**59 మంది ఎమ్మెల్యేల మద్దతు: టీఎంసీ నేత రితబ్రత బెనర్జీ**

అంతర్గత విభేదాలతో టీఎంసీ పార్టీ సతమతమవుతోన్న వేళ కీలక పరిణామం చోటుచేసుకుంది. తనకు 59 మంది ఎమ్మెల్యేల మద్దతు ఉందని తృణమూల్ కాంగ్రెస్ నుంచి బహిష్కరణకు గురైన ఎమ్మెల్యే రితబ్రత బెనర్జీ పేర్కొన్నారు. అసెంబ్లీలో పార్టీకి మొత్తం 80 మంది శాసనసభ్యులు ఉండగా.. వారిలో మూడింట రెండొంతుల కంటే ఎక్కువమంది మద్దతు తమకు ఉందని పేర్కొంటూ స్పీకర్‌కు లేఖ సమర్పించారు. టీఎంసీ తిరుగుబాటు వర్గం ఆయనను కొత్త ప్రతిపక్ష నేతగా ప్రతిపాదిస్తున్నట్లు తెలుస్తోంది. టీఎంసీ పార్టీని చీల్చి, గుర్తును కూడా సొంతం చేసుకునేందుకు దాదాపు 50 మందికి పైగా ఎమ్మెల్యేలు ప్రయత్నిస్తున్నట్లు స్వయంగా తృణమూల్ అధికార ప్రతినిధి రిజుదత్తా పేర్కొన్న అనంతరం ఈ ఘటన

**15మంది టీఎంసీ ఎంపీలు సంప్రదించారు: బిజెపి**

టీఎంసీలో కొనసాగుతోన్న గందరగోళం నేపథ్యంలో ఆ పార్టీకి చెందిన 15 మంది ఎంపీలు తనను సంప్రదించారని బెంగాల్ భాజపా నేత దిబ్యేందు అధికారి ప్రకటించారు. అయితే ప్రస్తుతానికి ఎవరినీ పార్టీలోకి తీసుకోకూడదని భాజపా అధిష్ఠానం నుంచి ఆదేశాలు అందాయని తెలిపారు. ఈ విషయంపై పార్టీ అధినేత మాత్రమే నిర్ణయం తీసుకుంటారన్నారు. టీఎంసీ పార్టీలో సంక్షోభం మరింత తీవ్రమయ్యే రోజు దగ్గరలోనే ఉందని.. మమతా బెనర్జీ నేతృత్వంలోని పార్టీ పతనం వైపు పయనిస్తోందని అన్నారు.

# కాంగ్రెస్ చేతల పార్టీ

**బిఆర్ఎస్ చేతకాని పార్టీ**

**వచ్చే ఎన్నికల్లోనూ కాంగ్రెస్ పార్టీదే అధికారం అని స్పష్టత రావడంతో**

**డ్రామారావుకు ఫ్రస్టేషన్ పెరిగిపోయింది**

**సవాల్‌ను స్వీకరించే దమ్ములేని కేటీఆర్**

**పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి**

మొదటి పేజీ తరువాయి

'మూసుకొని ఇంట్లో కూర్చో' అంటూ దొరతనం, అహంకారంతో మాట్లాడుతున్నారని మంత్రి తీవ్రవస్థాయిలో విరుచకపడ్డారు. సీఎం హోదాలో ఉండి ఎమ్మెల్యేగా ఓడిపోయిన కేసీఆర్ , మూసుకొని ఫాంహౌస్ లో ఉన్న విషయం మర్చిపోతే ఎలా డ్రామారావు..? ఎద్దేవా చేశారు. తొలి రెండున్నర సంవత్సరాల్లోనే సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో

అతి తక్కువ సమయంలోనే లక్షలాది మంది పేదవారికి ఇందిరమ్మ ఇండ్లు అందించామని చెప్పడానికి సంతోషిస్తున్నాను అని పేర్కొన్నారు. గ్రామాల్లో పదేండ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం కట్టిన ఇండ్ల కంటే, కేవలం మొదటి రెండున్నర సంవత్సరాలలో కాంగ్రెస్ ప్రభుత్వం మూడు రెట్లు ఎక్కువ సంఖ్యలో ఇందిరమ్మ ఇండ్లు నిర్మించిందని మంత్రి తెలిపారు. ఇందిరమ్మ ఇండ్లు నిరంతర ప్రక్రియ. రెండో దశ తరువాత మూడో దశ, నాలుగో దశలో కూడా లక్షలాది ఇందిరమ్మ ఇండ్లు నిర్మిస్తాం. అర్హులైన ప్రతి పేదవారికి సొంతిల్లు ఉండాలనే లక్ష్యంతో ఈ ప్రజాప్రభుత్వం పనిచేస్తుందన్నారు.

# సిఎస్ పదవిని పొడిగించాలంటూ కేంద్రానికి రాష్ట్ర ప్రభుత్వం లేఖ?

**హైదరాబాద్, జూన్ 3 (వుదయం ప్రతినిధి) :** ఈ నెల చివరన పదవీ విరమణ చేయనున్న రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు పదవీ కాలాన్ని మరోసారి పొడిగించాలంటూ కేంద్రానికి రాష్ట్ర ప్రభుత్వం లేఖ రాసే యోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. ఈ మేరకు సీఎం రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించినట్లు సమాచారం. అయితే ఇప్పటికే రామకృష్ణారావు పదవీ కాలాన్ని కేంద్ర ప్రభుత్వం రెండు సార్లు పొడిగించింది. 1991 బ్యాచ్‌కు చెందిన కే.రామకృష్ణారావు 2025 ఏప్రిల్ 30న చీఫ్ సెక్రెటరీగా బాధ్యతలు చేపట్టగా, అదే ఏడాది ఆగస్టు 31న రిటైర్ కావాల్సింది. కానీ సీఎం రేవంత్‌రెడ్డి విజ్ఞప్తి మేరకు ఆయన సర్వీసును 7 నెలల పాటు కేంద్రం ఎక్స్‌టెన్షన్ చేసింది. దీంతో ఈ ఏడాది మార్చి 31న ఆయన సర్వీస్ ముగుస్తుండగా మరోసారి ఆయన పదవీ కాలాన్ని పొడిగించాలని సీఎం రేవంత్ కేంద్రాన్ని కోరగా, మరో 3 నెలల పాటు ఆయన సర్వీసును ఎక్స్‌టెన్షన్ చేసింది. దీంతో రామకృష్ణారావు పదవీ కాలం ఈ నెల 30న ముగియనుంది. ప్రస్తుత పరిస్థితుల్లో చీఫ్ సెక్రెటరీగా కొత్త అధికారిని నియమించడం వల్ల పలు ఇబ్బందులు వస్తాయని అంచనాకు వచ్చిన రాష్ట్ర ప్రభుత్వం రామకృష్ణారావును మరికొన్ని నెలల పాటు కొనసాగించడానికి మొగ్గుచూపుతున్నట్లు తెలిసింది.

**సీఎస్ పదవికి పోటాపోటీ..** రామకృష్ణారావుకు మరోసారి ఎక్స్‌టెన్షన్ లభించకపోతే ఆ పదవిని దక్కించుకునేందుకు నలుగురు స్పెషల్ సీఎస్‌లు తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. ఆ జాబితాలో కేంద్ర సర్వీసులో ఉన్న సంజయ్ జాజు ముందు వరుసలో ఉన్నట్లు తెలిసింది. చీఫ్ సెక్రెటరీ పదవి ఇవ్వాలని ఆయన కాంగ్రెస్ హైకమాండ్ పెద్దల వద్ద లాబీయింగ్ చేస్తున్నట్లు సమాచారం. మరోవైపు స్టేట్ సర్వీసులో ఉన్న జయేశ్ రంజన్, వికాస్ రాజు, సబ్యసాచి ఘోష్ సైతం సీఎస్ పోస్ట్ కోసం పోటీ పడుతున్నారు. అయితే ఈ నలుగురిలో ఎవరిని ఎంపిక చేయాలనే అంశంపై సీఎం రేవంత్ రెడ్డి పలు కోణాల్లో ఆరా తీస్తున్నట్లు తెలిసింది. కిందిస్థాయి అధికారులతో కో ఆర్డినేషన్, ప్రభుత్వ పథకాల అమలులో చిత్తశుద్ధి ఉన్న ఆఫీసర్ కోసం అన్వేషణ చేస్తున్నట్లు సమాచారం.

# బడుగు బలహీన వర్గాల జీవితాల్లో మార్పు వచ్చింది టిడిపితోనే

**ఎన్టీఆర్ గురించి కొందరు ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారు : టీడీపీ నేతల ధ్వజం**

**హైదరాబాద్, జూన్ 3 (వుదయం ప్రతినిధి) :** ఎన్టీఆర్ వచ్చాక బడుగు బలహీన వర్గాల జీవితాల్లో మార్పు వచ్చిందని టీడీపీ పొలిట్‌బ్యూరో మెంబర్ అర్వింద్ కుమార్ గౌడ్ అన్నారు. బుధవారం ఎన్టీఆర్ భవన్‌లో మీడియాతో మాట్లాడుతూ.. ఎన్టీఆర్ గురించి తెలియక కొందరు ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. ఎన్టీఆర్ సమాధి తొలగిస్తామని.. ఎన్టీఆర్ విగ్రహాలు కూలుస్తామంటున్నారని అన్నారు. తెలంగాణ వాళ్లు కాదని.. అంబేద్కర్, పూలే విగ్రహాలు తీసేస్తారా అని ప్రశ్నించారు. కొత్తగా పుట్టిన పార్టీ వాళ్లు ఇష్టం వచ్చినట్టుగా మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ కోసం చంద్రబాబు నాయుడు ఆనాడు లేఖ ఇచ్చారని గుర్తుచేశారు. టీడీపీ తెచ్చిన సంస్కరణల వల్లే తెలంగాణ ఇప్పుడు నంబర్ వన్‌గా ఉందని అర్వింద్ అన్నారు. కొత్తగా పెట్టిన పార్టీ వాళ్లు.. తాము ముఖ్యమంత్రి అవుతామని విగ్రహాలు తొలగిస్తామని అంటున్నారని వ్యాఖ్యానించారు. ఎవరైనా ఎక్కడైనా మీటింగ్‌లు పెట్టుకోవచ్చని.. పోటీ చేయవచ్చన్నారు. కానీ ఇక్కడ మీటింగ్‌లు పెట్టుకోవద్దని... పెడితే అడ్డుకుంటామని అనడం ఎంతవరకు కరెక్ట్ అని ప్రశ్నించారు. రాష్ట్రాలు వేరైనా తెలుగు వాళ్లంతా ఒక్కటిగా ఉందామని అర్వింద్ కుమార్ గౌడ్ పిలుపునిచ్చారు. తెలంగాణ తమ వల్లనే వచ్చిందన్న కేసీఆర్ పదేళ్లు పాలన చేశారని టీడీపీ నేత నన్నూరి నర్సారెడ్డి అన్నారు. తెలంగాణ ఇచ్చింది తామే అన్న పార్టీ రెండున్నరేళ్ళుగా అధికారంలో ఉందన్నారు. ఈ రెండు పార్టీల పాలనపై చర్చకు సిద్ధమా? అని సవాల్ విసిరారు. 60–70 ఏళ్లు జరగని దోపిడీ కేసీఆర్ పాలనలో జరిగిందని ఆరోపించారు. మూడేళ్ల కాంగ్రెస్ పాలనలో అంతకుమించి దోపిడీ జరిగిందని వ్యాఖ్యానించారు. జనసేన అధినేత పవన్ కల్యాణ్ ఏం తప్పుగా మాట్లాడారని ఆయనపై విమర్శలు చేస్తున్నారని నిలదీశారు. తెలంగాణ అభివృద్ధి కోసం జనసేనతో కలిసి పోటీ చేస్తామని.. మరో పార్టీతో అయినా పోటీ చేస్తామని స్పష్టం చేశారు. తెలంగాణ గడ్డ అభివృద్ధికి బాటలు వేసింది టీడీపీ అని నర్సారెడ్డి అన్నారు. చంద్రబాబును, టీడీపీని అప్రతిష్ఠపాలు చేసే కుట్రలు ఇక్కడ నుంచి జరుగుతున్నాయని ఆరోపించారు. ఎన్టీఆర్ ట్రస్ట్ ద్వారా ఏర్పాటు చేసిన విద్యాసంస్థలు, సేవా కార్యక్రమాలు తెలంగాణ ప్రజలకు మేలు చేస్తున్నాయని తెలిపారు. ప్రశ్నించే తత్వాన్ని ప్రజలకు నేర్పుతున్న పార్టీని ఎందుకు అడ్డుకుంటున్నారన్నారు. తెలంగాణను వ్యతిరేకించిన పార్టీలకు ఇక్కడ మనుగడ ఉందని తెలిపారు.




“ క్యాన్సర్, ఇతర అరుదైన రోగాలను నయం చేసే బయోలాజిక్స్, వ్యాక్సిన్లు, సెల్ అండ్ జీన్ థెరపీ వంటి అత్యంత అధునాతన వైద్య పరిశోధనలకు ప్రధాన కేంద్రంగా హైదరాబాద్ ను తీర్చిదిద్దేందుకు ప్రణాళికాబద్ధంగా కృషి చేస్తున్నాం. పరిశోధన దశ నుంచి కమర్షియల్ ప్రొడక్షన్ దాకా అవసరమైన అన్ని సదుపాయాలను ఒకే చోట కల్పించేలా అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన "ప్రపంచ స్థాయి ఎకో సిస్టమ్"ను అభివృద్ధి చేసేలా సమగ్ర కాంప్రహెన్సివ్ రోడ్ మ్యాప్ ను సిద్ధం చేస్తున్నాం. ఫార్మా రాజధాని హైదరాబాద్ ను బయో టెక్నాలజీ రంగంలోనూ గ్లోబల్ లీడర్ గా మార్చేందుకు తీసుకుంటున్నాం. రాబోయే రోజుల్లో బయోటెక్నాలజీ రంగంలో రోబోటిక్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, అడ్వాన్స్‌డ్ జెనెటిక్స్ వంటి సాంకేతికతలు విప్లవాత్మక మార్పులు తీసుకొస్తాయి. ”

* దుద్దిళ్ల శ్రీధర్ బాబు, తెలంగాణ రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి

## వే'మన'పద్యం

గంగపారునెపుడు గదలని గతితోడ
ముఱికివాగు పారు మ్రోతతోడ
పెద్ద పిన్నతనము పేర్మి యీలాగురా
విశ్వదాభిరామ! వినురవేమ




# వ్యవసాయం ఉద్యమంలా ముందుకు సాగాలి

పరిశ్రమ కంటే వ్యవసాయం ప్రాధాన్యతను, యాంత్రిక ఉత్పత్తి కంటే ఉపాధి ప్రాధాన్యతను వాదిస్తూ, గాంధీ సూత్రాలతో భారత దేశ అభివృద్ధి కోసం చౌదరి చరణ్ సింగ్ ను చరిత్రకారులు, ప్రజలు 'భారతదేశపు రైతుల విజేత' గా గుర్తించారు. వ్యవసాయపరంగా ఆధిపత్యం కలిగిన మీరట్ జిల్లాలోని గ్రామీణ రైతు కుటుంబంలో జన్మించిన ఆయన

**స్వతంత్ర భారతదేశంలో ఏకైక ప్రముఖ రైతు నాయకుడు.**

ఆయన ఉత్తరప్రదేశ్‌లో భూసంస్కరణల ప్రధాన రూపశిల్పి, రాష్ట్రమంతా ఏకరీతిగా వుండేలా భూ కమతాలపై సీలింగ్‌ను తగ్గించే లక్ష్యంతో 1960 భూ హోల్డింగ్ చట్టం తీసుకురావడంలో ముఖ్యమంత్రిగా కీలకపాత్ర పోషించారు. 1952లో వ్యవసాయ శాఖ మంత్రిగా పని చేస్తున్నప్పుడు జమీందారీ వ్యవస్థను రద్దు చేసే ప్రయత్నాలకు ఆయన నాయకత్వం వహించారు. రుణ విముక్తి బిల్లు 1939 సూత్రీకరణ అమలు ఆయన నాయకత్వంలో జరిగింది. వడ్డీ వ్యాపారుల నుంచి రైతాంగానికి ఉపశమనం కలిగించడమే ఈ బిల్లు లక్ష్యం. 1950లలో ఉత్తరప్రదేశ్ లోని అప్పటి ముఖ్యమంత్రి పండిట్ గోవింద్ వల్లబ్ పంత్ పర్యవేక్షణలో భారత దేశంలో ఏ రాష్ట్రంలోనూ జరగని అత్యంత విప్లవాత్మక భూ సంస్కరణల చట్టాలను రూపొందించడంలోను, వాటిని ఆమోదించడంలోనూ చరణ్ సింగ్ మంచి గుర్తింపు పొందాడు. దేశాన్ని అనుక్షణం అప్రమత్తతతో కంటికి రెప్పలా కాపాడే సైనికులకు ఎంత ప్రాముఖ్యత ఉందో పట్టెడన్నం పెట్టే అన్నదాతలకు కూడా అంతే ప్రాముఖ్యత ఉంది. ఈ ప్రాధాన్యతను గుర్తించే దివంగత మలి ప్రధాని జై జవాన్... జై కిసాన్ అని నినదించారు. రైతును దేశానికి వెన్నుముకగా రైతులను అభివర్ణిస్తారు. రైతు అహర్నిశలు శ్రమిస్తే గాని మనకు తినడానికి తిండి దొరకదు. అయితే ఆరు గాలం కష్టపడినా, శ్రమకు ఫలితం లభిస్తుందనే నమ్మకం ఏ



నాడూ ఉండదు. లేదు. రైతులు అటు ప్రకృతి మీద ఆధారపడి జీవనం సాగించడం సర్వత్రా కనిపించేదే. అతివృష్టి, అనావృష్టి అన్నదాతల జీవితాలకు భరోసా లేని పరిస్థితి తెస్తున్నాయి. ఒత్తిళ్లు, నష్టాలు, వ్యవసాయ పనుల చాకిరీకి తట్టుకోలేక చాలామంది రైతులు వ్యవసాయానికి స్వస్తి పలుకు తున్నారు. వేసిన పంటలకు సరిగా దిగుబడి రాక అప్పుల బాధలు భరించలేక, సరైన సమయంలో రుణమాఫీ కాక, దిక్కు తోచని స్థితిలో రైతులు బలవన్మరణాలకు పాల్పడుతున్నారు. కౌలు రైతులకైతే స్వంత భూమి కాక, వ్యవసాయ రుణాలు రాక, ప్రభుత్వ సహాయంకు నోచుకోక, యాజమాని కాకపోవడం వల్ల ప్రైవేటు రుణ సాయం దొరకక ఇబ్బందులకు గురవుతున్నారు. ఎన్నో ఇబ్బందులను ఎదుర్కొంటూ పంటలు పండిస్తే దళారులు రైతుల శ్రమను చౌకగా కొని ఎక్కువ రేట్లకు కొనుగోలు దార్లకు అమ్మి సొమ్ము చేసుకుంటున్నారు. రైతులు కూలీగా, దళారులు సంపన్నులుగా అవుతున్నారు. పంటల విషయంలో రైతులకు సలహాలు సూచనలు ఇవ్వాల్సిన వ్యవసాయ శాఖలో సిబ్బంది కొరత రైతులకు అవగాహన లేమికి కారణం అవుతోంది. కేంద్రం రాష్ట్ర ప్రభుత్వాలు గత కాలంలో లాగా కాకుండా ప్రస్తుతం రైతులకు చేదోడు వాదోడుగా ఉంటున్నాయి. రైతులకు ఆర్థిక సాయం అందిస్తూ, నేరుగా బ్యాంకు ఖాతాల్లోకి డబ్బులు బట్వాడా చేస్తున్నాయి. అయితే నకిలీ విత్తనాలు రాకుండా, గిట్టుబాటు ధర ఇవ్వాల్సిన బాధ్యత పూర్తిగా ప్రభుత్వాలదే. సంప్రదాయ పంటలతో పాటు వాణిజ్య పంటలపై రైతులకు అవగాహన కల్పించాలి. రైతులు దళారీల బారిన పడకుండా చూడాలి. రైతును వివిధ రకాలుగా మోసం చేసే వారిపై కఠిన చర్యలు గైకొనాలి. ప్రభుత్వ చేయూత, ఆర్థిక సాయం, సబ్సిడీలు, రుణ మాఫీలు, మార్కెట్ సౌకర్యాలు అందుబాటులో ఉండి, గతంలో సాగునీటికి పడిన ఇబ్బందుల పరిస్థితి కొంత మెరుగుపడి, సేద్యానికి అవసరమయ్యే సాగు నీరు అధిక శాతం సరఫరా అవుతున్న వేళ...వ్యవసాయం ఉద్యమం రీతిలో ముందుకు సాగాల్సిన అవసరం అనివార్యంగా ఉంది. చౌదరి చరణ్ సింగ్ చేసిన అనేక ఉద్యమాల వల్ల జమీందారీ చట్టం రద్దై, కౌలుదారీ చట్టం అమలులోకి వచ్చింది. రైతులకు బ్యాంక్ ఋణాలు అందించే విధానము ప్రవేశ పెట్టబడింది. రైతుల గురించి, వ్యవసాయరంగం గురించి అంతగా ఆలోచించి, వారి సమస్యల పరిష్కారానికి కృషిచేసిన చరణ్ సింగ్ సేవలకు గుర్తుగా ప్రభుత్వము చరణ్ సింగ్ జన్మదినోత్సవాన్ని జాతీయ రైతు దినోత్సవంగా ప్రకటించింది. చరణ్ సింగ్ మూడవ వర్ధంతి (1990, మే 29) సందర్భంగా భారత ప్రభుత్వం చరణ్ సింగ్ చిత్రంతో తపాలా బిళ్లను విడుదల చేసింది.రైతులు మరియు గ్రామీణాభివృద్ధికి ఆయన జీవితాంతం చేసిన కృషికి గుర్తింపుగా, న్యూఢిల్లీలోని రాజ్ ఘాట్ స్మారక సముదాయంలో కిసాన్ ఘాట్ ("రైతుల వేదిక") అని పిలువబడే ఒక స్మారక చిహ్నాన్ని నిర్మించారు .



సంగనబట్ల
9440595494

# యుద్ధాలు, సంక్షోభాల్లో అమాయక పిల్లలు బలవుతున్నారా?

యుద్ధాలు, సంక్షోభాల విష వలయంలో ప్రపంచ మానవాళి చిక్కుకొని సతమతం అవుతున్నది. యుద్ధాలతో అందమైన సహజ ప్రకృతి క్షణాల్లో శ్మశాన వాటికలుగా మారుతున్నాయి. యుద్ధాలు, సంక్షోభాలతో ప్రపంచ మానవాళి గాయపడడం, ప్రాణాలు కోల్పోవడం, ఆస్తి నష్టాలు, ఆర్థికంగా చితికిపోవడం, పర్యావరణ కాలుష్య కోరల్లో చిక్కుకొని పోవడం, అమాయక పిల్లలు సహితం ప్రాణాలు కోల్పోవడం లేదా గాయపడడం, పాఠశాలలు మూత పడడం, ఆరోగ్య సంరక్షణకు విఘాతం కలగం జరుగుతోంది. 2023లో ప్రపంచ నలుమూలల జరిగిన లాండ్‌మైన్స్, విస్పోట ఆయుధాలు పేలడంతో 11,649 మంది పిల్లలు మాత్రమే చనిపోవడం లేదా అంగవైకల్యాన్ని పొందడం జరిగింది. కాంగో, సోమాలియా, నైజీరియా లాంటి దేశాల్లో 8,655 మంది పిల్లలు సంక్షోభ వ్యవస్థలో వినియోగించబడడం, 4,356 మంది పిల్లలు బలవంతంగా అపహరించబడడం జరిగింది. అఫ్ఘానిస్థాన్, మియన్మార్, సూడాన్ లాంటి దేశాల సంక్షోభాల్లో 1,470 మంది పిల్లలు లౌంగిక వేధింపులకు గురి కావడం, 5,205 మంది మానవీయ సేవలకు దూరం కావడం జరిగింది. 2021 – 23 మధ్య వివిధ సంక్షోభాల్లో 1,650 పాఠశాలలు/ఆరోగ్య కేంద్రాలు ధ్వంసం కావడం జరిగి పిల్లలు చదువులకు దూరం కావడంతో పాటు అనారోగ్యాలను మోయడం జరిగింది. 28 ఫిబ్రవరి 2026 రోజు ప్రారంభమైన అమెరికా/ఇజ్రాయిల్, ఇరాన్ యుద్ధంలో ఇప్పటివరకు 200లకు పైగా పిల్లలు ప్రాణాలు కోల్పోగా, వేల మంది చిన్నారులు గాయపడడం జరిగింది.

### దురాక్రమణకు గురైన అమాయక పిల్లల అంతర్జాతీయ దినం

1982లో లెబనాన్ – పాలస్తీనా యుద్ధంలో అమఆయక పిల్లలు ఆహుతి కావడాన్ని తీవ్రంగా భావించిన ఐరాస ప్రతి ఏట 04 జూన్‌న “దురాక్రమణకు గురైన అమాయక పిల్లల అంతర్జాతీయ దినం” లేదా “ఇంటర్నేషనల్ జే ఆఫ్ ఇన్నోసెంట్ చిల్డ్రన్ విక్టిమ్స్ ఆఫ్ అగ్రెషన్” పాటించాలని సభ్య దేశాలకు సూచించడం జరిగింది. యుద్ధాలు, సంక్షోభాలు జరిగినపుడు అమాయక పిల్లలు శారీరక, మానసిక, భావోద్వేగ దురలవాట్ల గుప్పిట్లో చిక్కుతున్నారు. తాజా వివరాల ప్రకారం ప్రపంచ వ్యాప్తంగా 536 మిలియన్ల పిల్లలు సంక్యోభ ప్రదేశాల్లో దుర్భర జీవితం గడపడం లేదా ప్రాణాలు కోల్పోయే అంచున నిలబడడం జరుగుతున్నది. దాదాపు 50 మిలియన్ల



పిల్లలు ఇండ్లను కోల్పోయి శిబిరాల్లో గడుపుతుండడం, 200 మిలియన్ల పిల్లలు లౌంగిక హింకకు లోనవుతున్నారు. పాకిస్థాన్, ఈజిప్ట్, మొజాంబిక్, వియత్నామ్, అర్జెంటీనా, రష్యా, నైజీరియా, ఇండోనేషియా లాంటి దేశాల్లో పిల్లల భవిష్యత్తు అగమ్యగోచర దుస్థితికి చేరింది. దురాక్రమణకు గురైన అమాయక పిల్లల అంతర్జాతీయ దినం సందర్భంగా శారీరక, మానసిక, భావోద్వేగ వేధింపుల బాధిత పిల్లల బాధను అర్థం చేసుకోవడం మనందరి కర్తవ్యం అని తెలుసుకోవాలి.

### యుద్ధ మంటల్లో అమాయక పిల్లల భవిష్యత్తు బుగ్గల పాలు

నేడు ఉక్రెయిన్ – రష్యా, ఇజ్రాయిల్ – పాలస్తీనా మధ్య భీకర పోరు జరుగుతోంది. 24 ఫిబ్రవరి 2022న ప్రారంభమైన ఉక్రెయిన్‌పై రష్యా దాడి ఏళ్ల తరబడి కొనసాగుతూ నేటికీ భీకరం స్థాయిలో కొనసాగుతున్నది. ఈ యుద్ధంలో రష్యాలో 2,23,000 మంది గాయపడడంతో పాటు అందులో 43,000 మంది ప్రాణాలు కోల్పోయారు. ఉక్రెయిన్ పక్షాన 1,31,000 గాయపడడంతో పాటు అందులో 17,500 మంది మరణించడం జరిగింది. ఈ యుద్ధంలో 2,520 మంది పిల్లలు గాయపడడంతో పాటు అందులో 669 మంది అమాయక పిల్లలు మరణించారు. దీనికి తోడుగా ఉక్రెయిన్‌లో 1,600 పాఠశాలలు, 786 వైద్య కేంద్రాలు ధ్వంసం అయ్యాయి. దాదాపు 44 శాతం మంది పిల్లలు చదువులకు దూరంగా, ఆకలి చావుల మధ్య తాత్కాలిక శరణార్థి శిబిరాల్లో కాలం గడుపుతున్నారు. గాజాపై ఇజ్రాయిల్ దాడుల్లో దాదాపు 50,000 మంది పిల్లలు గాయపడడం లేదా మరణించడం జరిగింది. నేడు ఉక్రెయిన్, పాలస్తీనాల్లో ప్రజలు, ముఖ్యంగా పిల్లలు చావు నోట్‌లో తలపెట్టి కాలం గడపడం చూస్తున్నాం. యుద్ధాల్లో మానవీయత మంట గలుస్తోంది. యుద్ధ ప్రదేశాలు, సంక్షోభ ప్రాంతాల్లో మానవ హక్కులు మంటగలవడంతో పాటు పిల్లల నిండు నూరేళ్ల జీవితాలు చిన్నతనంలోనే చితికిపోతున్నాయి. పాఠశాలలు, ఆరోగ్య కేంద్రాలు ధ్వంసం కావడంతో పిల్లల చదువులకు విఘాతం కలగడం, ఆరోగ్య కేంద్రాలు కొరవడడంతో రోగాల పాలు కావడం జరుగుతోంది. ఈ ప్రదేశాల పిల్లలను కాపాడడం, విద్య అవకాశాలు కొనసాగించడం, మరణాలకు అడ్డుకట్ట వేయ డం, అంగవైకల్యం పొందడాన్ని నిరోధించడం, లౌంగిక హింసకు దూరంగా తగు చర్యలు తీసుకోవడం, అపహరించడాన్ని నిరోధించడం లాంటి చర్యలను తీసుకోవాలి, లేత పిల్లల భవిష్యత్తుకు ఉజ్వల బాటలు వేయాలి.



బుర్ర మధుసూదన్ రెడ్డి
9949700037

# అమాయకుడి ఆవేదన

ఆమె చూపుల్లో చిగురించిన వెలుగును
ప్రేమగా భావించాను...!!
ఆమె మాటల్లో జారిన మాధుర్యాన్ని
ఆత్మీయతగా ఊహించాను...!!
ఓర్పు నేర్పే గురువులా!
నైపుణ్యం చూపే దారిలా!!
నా జీవితం నడిపిస్తుందని!
నమ్మకంతో చేరువయ్యాను!!
కానీ——
ఆ చూపుల వెనక!
వెన్నుపోటు దాగి ఉందని!!
నా హృదయం చదవలేకపోయింది...
ఆ మాటల వెనక!
ఆక్రోశపు అగ్ని మండుతుందని!!
నా అమాయకత్వం గ్రహించలేకపో
యింది...
తడి గుడ్డతో గొంతు కోసే!
నిశ్శబ్ద క్రూరత్వం!!
నవ్వుల ముసుగులో నడుస్తుందని!
తెలుసుకునేలోపే
నా విశ్వాసం రక్తమై కారిపోయింది!!
చివరికి——
నన్ను మోసం చేసిన చేతులు కాదు!
నా మంచితనమే కారణమని చెప్పారు!!
నా అమాయకత్వాన్ని!

“కర్మ సిద్ధాంతం” అనే మాటకు కట్టిపడే
శార!!
కానీ నిజం ఏంటంటే——
మోసం చేసినవారికంటే?
నమ్మకం పెట్టుకున్న హృదయం!
ఎక్కువగా గాయపడుతుంది!!
అయినా...
గాయాల బూడిదలోనుంచి!
మళ్లీ లేస్తుంది మనసు!!
ఎందుకంటే
అమాయకత్వం ఓటమి కాదు!
అది ఇంకా మనిషితనం మిగిలి
ఉందనే సాక్ష్యం!!



డా. పూసపాటి వేదాద్రి
9912197694

# నేలపై పుట్టిన జీవుల్లో ఓ జీవిని

ఈ నేలపై పుట్టిన జీవుల్లో ఓ జీవిని
ప్రకృతిని అందాలను
అశ్వదించే మేధాని
సీతకోక దశను చూసాను
వాటి రెక్కల రంగులకి మురిసాను
పుట్టుక గిట్టుటకు మధ్య
ఎన్నో మనసుల చిత్రాల్ని చూసిన
వాడిని
నా నయనాలకు తోడుగా
ద్రుష్టి సారించాను
అప్పుడు నేను వ్యవస్థను
చదవడం నేర్చుకున్న
నా అభిరుచికి తగినట్లుగా
మనస్సుకదిపి లీనమయ్యిన వాడ్ని
నేను కలం విధిల్చి అక్షరం మొదలె
ట్టాను
పదాలు పరిచయం చేసుకుంటూ
వచ్చాయి
అప్పుడు నేను నా కవిత పుత్రికల్ని
నా మేధా దారుల్లో వెదుకుతున్నా
నా అక్షరాల్లో పద పరిమళాలు వేదు
కుతున్నా
కానీ!
తప్పులు దొర్లుతూనే వున్నాయి
వాటికీ రక్షగా సరిచేసి నిలిచా
ఒప్పు వాక్యాలు దరి చేరుతూ
మనస్సు ఆహ్లాద వీచుకలు

విస్తుంది
నా జీవిత సంపుటుల మధ్య
తుమ్మ ముళ్ళు లాంటి పద
పదాలు గుచ్చుకుంటాయి
అయినా!
నా చేతలు జ్ఞాపకాల
నీడలో నిలుస్తుంది
ఇక వ్యవస్థ
సమాజంలోని దుర్భరాన్ని రగిలించి
వాటిపై రంగులు అద్దుతున్నప్పుడు
జనారణ్యం లో నక్క జిత్తుల
నాయాళ్ల గురించి
రంగులు మార్చే ఊసరవెల్లి గురించి
నా పుటలపై అక్షర కణికల
సెగలు పుట్టించే
నా ఆశయాల్ని పిడికిళ్లలో చూపి
రేపటి ఉషోదయాన్ని పాళి తో
అక్షర నేత్రాలతోకనువిందు గావించా
ఇలలో పుట్టిన జ్ఞాన జీవుల్లో
దశలు మార్చే
సీతాకోకలు చూపే


తుమ్మా రాజా
కోదాడ
8099918883



# త్యాగాలు 'అనంతం'.. ఐక్యత 'శూన్యం'

తెలుగునాట విప్లవోద్యమ చరిత్రలో గత ఏడెనిమిది నెలలుగా జరుగుతున్న పరిణామాలు కేవలం ముఖ్యాంశాలు కావు. అవి ఐదు దశాబ్దాల సుదీర్ఘ సాయుధ పోరాట రూపాంతరానికి సజీవ సాక్ష్యాలు. మావోయిస్టు అగ్రనేతలు సోను, దేవ్జీ, సంగ్రాం, ఆశన్న, చంద్రన్న వంటి వారు వందలాది మంది దళ సభ్యులతో కలిసి అజ్ఞాతాన్ని వీడి బహిరంగ ప్రజా జీవితంలోకి అడుగుపెట్టడం కేవలం ఒక తాత్కాలిక రాజకీయ చలనం కాదు; ఇది ఒక సుదీర్ఘ పోరాట తాత్విక మలుపు. ఈ పరిణామాల నేపథ్యంలో, సీనియర్ వామపక్ష నేత జి. రాములు రాసిన బహిరంగ లేఖను విశ్లేషిస్తూ మే 30, 2026న సిరికొండ రవీంద్రనాథ్ రాసిన "వామపక్షాల ఐక్యత అవశ్యం" అనే వ్యాసం ప్రస్తుత రాజకీయ సమీకరణాలపై ఒక చర్చను రేకెత్తించింది. తుపాకీ పట్టిన చేతులు జనం మధ్యకు రావడం అంటే విప్లవ ముగింపు కాదు, సరికొత్త ప్రజాస్వామ్య వ్యూహానికి ఆరంభం అనే సత్యాన్ని ఈ పరిణామాలు స్పష్టం చేస్తున్నాయి. సమాజ గమనాన్ని శాస్త్రీయంగా విశ్లేషిస్తే, ఏ సిద్ధాంతమైనా కాలంతో పాటు మారకపోతే అది జనం నుంచి వేరుపడిపోతుందనేది చారిత్రక సత్యం. కార్ల్ మార్క్స్ ప్రతిపాదించిన గతితార్కిక భౌతికవాదం ప్రకారం, సమాజంలోని భౌతిక పరిస్థితులు మారినప్పుడు పోరాట రూపాలు కూడా మారాలి. 1970, 80ల నాటి గ్రామీణ భూస్వామ్య నిర్బంధ కాలపు తెలంగాణ వేరు, నేటి డిజిటల్, సాంకేతికయుగపు ఆధునిక దోపిడీ కాలపు తెలంగాణ వేరు. నేడు గ్లోబలైజేషన్, టెక్నాలజీ క్షేత్రస్థాయికి విస్తరించి, సమాజ నిర్మాణంలో మార్పులు వచ్చాయి. యువత తమ మనుగడను కొత్త కోణంలో వెతుక్కుంటున్న ఈ కాలంలో, సాయుధ పంథా కంటే చట్టబద్ధమైన ప్రజా పోరాటాలే అత్యంత కీలకం. నిజానికి, దండకారణ్యంలో 'ఆపరేషన్ కగార్' తీవ్రస్థాయిలో సాగుతున్న తరుణంలోనే, "మావోయిస్టులు తమ మార్గం మార్చుకొని ప్రజా ప్రయోజనాలకు ఉపయోగపడేలా సాయుధ మార్గం వీడి జనారణ్యంలోకి రావాలి" అని ఫిబ్యవరి 18, 12025 లోనే నేను వ్యాసం రాశాను. శాంతి చర్చలను కాంక్షిస్తూ శాంతికాముకుల విశ్లేషణతో 'ఆపరేషన్ కగార్' పుస్తకాన్ని కూడా తీసుకురావటం జరిగింది. అందులోనూ జి. రాములు చాలా విలువైన విశ్లేషణ వ్యాసాలు పొందుపరిచి ఉన్నాయి. ఈ నేపథ్యంలోనే విప్లవ శక్తులు సాయుధ పంథాను మార్చుకుని ప్రజా క్షేత్రంలోకి అడుగుపెట్టడం శుభపరిణామంగానే చూడాలి. ఇది ఎవరికి నచ్చినా నచ్చకపోయినా కొందరు భిన్నభిప్రాయాలు కలిగిశున్నప్పటికీ ఈ చారిత్రక పరిణామ క్రమాన్ని స్వాగతించాల్సిన అవసరం ఉంది. అయితే అరణ్యం దాటి జనం మధ్యకు వచ్చిన ఈ మహోద్యమ శక్తుల ముందు ఇప్పుడు ఒక పెద్ద తాత్విక వైరుధ్యం నిలిచింది. జి. రాములు తన లేఖలో ఎత్తిచూపినట్లు కమ్యూనిస్టులు ప్రజల కోసం ప్రాణాలనైనా త్యాగం చేయగలరు కానీ, తమ 'ఇగో' (అహంభావం)లను మాత్రం ఎందుకు త్యాగం చేయలేకపోతున్నారు..? బహిరంగ జీవితంలోకి వచ్చిన నేతల మధ్య చిన్న చిన్న అపార్థాలు, భిన్నాభిప్రాయాలు ఉన్నట్లు వచ్చినా, వస్తున్న వార్తలు శ్రేణులను, ప్రజలను ఆందోళనకు, గందరగోళానికి గురిచేస్తున్నాయి. ద్వంద్వాల పోరాటంలో అంతర్గత వైరుధ్యాలు ఎప్పుడూ శత్రువుకే లాభం చేకూరుస్తాయి. పరిపక్వత లేని విమర్శకులు, శత్రు శక్తులు ఈ విభేదాలను భూతద్దంలో చూపిస్తూ, వారి అసమాన త్యాగాలను మసిపూసి మారేడు కాయ చేయాలని చూస్తాయి, చూస్తున్నాయి. ప్రపంచవ్యాప్తంగా అనేక ఉద్యమాలను పరిశీలిస్తే 'ఈగో' లను పక్కన పెట్టి ప్రజల్లో నిలబడినప్పుడే ఉద్యమాలకు మనుగడ సాధ్యమని స్పష్టమవుతోంది. ఐక్యత లేని చోట త్యాగాలు ఎంత అనంతంగా ఉన్నా, ఫలితం మాత్రం శూన్యమే అవుతుంది. బహిరంగ జీవితంలోకి వచ్చిన మావోయిస్టుల ముందు కేవలం సిద్ధాంతాలు లేవు. అనేక భౌతిక సవాళ్లు ఉన్నాయి. జైళ్లలో ఉన్న వందలాది మంది సహచరుల విడుదల, చట్టపరమైన పోరాటం ఒకవైపైతే.. దశాబ్దాల పాటు అడవికే పరిమితమైన వారికి పునరావాసం, ఆర్థిక, కుటుంబ రక్షణ కల్పించడం మరోవైపు సవాలుగా ఉంది. అలాగే వారు ఒకచోట సమావేశం కూడా కాలేని పరిస్థితి లేకపోలేదు. ఈ ఆంక్షలు, నిర్బంధాలు కొనసాగుతున్నాయని సెంట్రల్ కమిటీ సభ్యుడు ఆశన్న (తక్కెళ్లపల్లి వాసుదేవరావు) పేర్కొన్న విషయం తెలాసిందే. ఈ సవాళ్లను ఒంటరిగా ఎదుర్కోవడం ఏ ఒక్క శ్రేణికి సాధ్యం కాదు. బయటకు వచ్చిన వారంతా ఒకే శక్తిగా నిలబడితేనే చట్టబద్ధమైన రక్షణ, ప్రజాదరణ లభిస్తాయి. పోలిట్ బ్యూరో సభ్యుడు దేవ్జీ (తిప్పిరి తిరుపతి) అన్నట్లు, అవసరమైతే ప్రజాస్వామ్య పద్ధతిలో "మావోయిస్టు" పేరుతోనే ఎన్నికల బరిలోకి వెళ్లడం లేదా ఒక విస్తృతమైన ఉమ్మడి వేదికను నిర్మించడం సమాజంలో వారి ఉనికిని శాసించేలా చేస్తుంది. ఈ చారిత్రక తరు ణంలో, రాములు లేఖపై స్పందిస్తూ ప్రధాన వామపక్షాలైన సీపీఐ, సీపీఎం నేతలు గుజ్జుల ఈశ్వరయ్య, జగ్గులు జాన్ వెస్లీలు "మావోయిస్టులతో కలిసి పనిచేయడానికి సిద్ధం" అని ప్రకటించడం ఒక సానుకూల పరిణా మం. బూర్జువా పార్టీల వైపు వెళ్లకుండా, దశాబ్దాల విప్లవ త్యాగాలు వృధా కాకుండా ఉండాలంటే వామపక్షాల ఐక్యత ఏకైక మార్గం. ఇప్పటికైనా వామపక్ష నాయకత్వాలు పాత సిద్ధాంత విభేదాలను, ఇగోలను పక్కనపెట్టి ఒక "కనీస ఉమ్మడి ప్రణాళిక తోనైనా ముందుకు రావాలి. భారత రాజ్యాం గాన్నే మార్చాలనే శక్తులు, హక్కులను కాలరాసే ధోరణులు పొంచి ఉన్న ఈ తరుణంలో పాత విభేదాలను వీడి ఎర్రజెండాలన్నీ ఒకే తాటిపైకి వస్తేనే, దేశ రాజకీయాల్లో ఒక బలమైన ప్రత్యామ్నాయ శక్తి ఆవిర్భవిస్తుంది.

రాజేందర్ దామెర
(దారా)
సీనియర్ జర్నలిస్ట్



# సమాచార యుగంలో డేటా కీలకం

డిజిటల్ సమాచార యుగంలో డేటా నిర్వహణ అత్యంత కీలకమైన అంశంగా మారింది. ముఖ్యంగా లైబ్రరీలు, పరిశోధనా సంస్థలు, విశ్వవిద్యాలయాలు, డిజిటల్ ఆర్కైవ్ కేంద్రాలు ప్రతిరోజూ వేలాది డేటా రికార్డులతో పని చేస్తున్నాయి. ఈ డేటాలో తప్పులు, డూప్లికేట్ రికార్డులు, అసంపూర్ణ సమాచారం, వేర్వేరు ఫార్మాట్లు ఉండటం సాధారణం. అలాంటి సమస్యలను పరిష్కరించడానికి ఉపయోగించే శక్తివంతమైన ఓపెన్ సోర్స్ సాధనం “ఓపెన్ రిఫైన్”. ఓపెన్ రిఫైన్‌ను గతంలో “గూగుల్ రిఫైన్” అని పిలిచేవారు. తర్వాత ఇది ఓపెన్ సోర్స్ ప్రాజెక్టుగా మారి “ఓపెన్ రిఫైన్”గా అభివృద్ధి చెందింది. ఇది ముఖ్యంగా డేటా క్లీనింగ్, డేటా ట్రాన్స్‌ఫర్మేషన్, డేటా రీకన్సిలియేషన్ వంటి పనులకు ఉపయోగపడుతుంది. లైబ్రరీ సైన్స్‌లో ఇది అత్యంత ఉపయోగకరమైన సాధనంగా గుర్తింపు పొందింది. లైబ్రరీల్లో ఒకే రచయిత పేరు అనేక విధాలుగా నమోదు కావచ్చు. ఉదాహరణకు “ఆర్ కె నారాయణ్”, “ఆర్.కె.నారాయణ్”, “ఆర్ కె. నారాయణ్” వంటి రూపాల్లో ఉండవచ్చు. ఇవి శోధనలో గందరగోళాన్ని సృష్టిస్తాయి. ఓపెన్ రిఫైన్ ద్వారా అలాంటి రికార్డులను ఒకే ప్రమాణ రూపంలోకి మార్చవచ్చు. ఓపెన్ రిఫైన్‌ను అధికారిక వెబ్‌సైట్ నుంచి ఉచితంగా డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. ఇది విండోస్, లినక్స్, మాక్ వంటి అన్ని ఆపరేటింగ్ సిస్టమ్‌లలో పనిచేస్తుంది. ఇన్‌స్టాలేషన్ ప్రక్రియ కూడా చాలా సులభంగా ఉంటుంది. ముందుగా జావా ఇన్‌స్టాల్ అయి ఉండాలి. తర్వాత ఓపెన్ రిఫైన్ ఫైల్‌ను డౌన్‌లోడ్ చేసి అన్‌జిప్ చేసి, ప్రోగ్రామ్‌ను ప్రారంభిస్తే ఇది బ్రౌజర్‌లో లోకల్ సర్వర్ రూపంలో తెరుచుకుంటుంది. ఇది పూర్తిగా వెబ్ ఆధారిత ఇంటర్‌ఫేస్‌ను ఉపయోగిస్తుంది. కానీ డేటా మొత్తం వినియోగదారుడి కంప్యూటర్‌లోనే ఉంటుంది. అందువల్ల గోప్యత పరంగా ఇది చాలా భద్రమైనది. ఇంటర్నెట్ కనెక్షన్ లేకున్నా కూడా దీనిని ఉపయోగించవచ్చు. ఓపెన్ రిఫైన్‌లో సిఎస్‌వి, ఎక్సెల్, జేసన్, ఎక్స్‌ఎంఎల్ వంటి అనేక ఫార్మాట్లలో డేటాను దిగుమతి చేసుకోవచ్చు. ఒకసారి డేటా లోడ్ అయిన తర్వాత దానిని శుభ్రపరచడానికి అనేక సాధనాలు అందుబాటులో ఉంటాయి. ఇందులో “ఫేసెటింగ్” అనే సౌకర్యం చాలా ముఖ్యమైనది. దీని ద్వారా ఒక కాలమ్‌లో ఉన్న విలువలను సమూహాలుగా చూడవచ్చు. ఉదాహరణకు ఒక లైబ్రరీ డేటాబేస్‌లో “పబ్లిషర్” కాలమ్‌లో ఎన్ని రకాల ప్రచురణకర్తలు ఉన్నారో సులభంగా తెలుసుకోవచ్చు. “క్లస్టరింగ్” అనే మరో సౌకర్యం ద్వారా ఒకే విధంగా కనిపించే పదాలను గుర్తించి ఒకే రూపంలోకి మార్చవచ్చు. ఉదాహరణకు “యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్” మరియు “హైదరాబాద్ యూనివర్సిటీ” అనే పదాలను ఒకే రూపంగా మార్చవచ్చు. ఇది ముఖ్యంగా బిబ్లియోగ్రాఫిక్ డేటా నిర్వహణలో చాలా ఉపయోగపడుతుంది. ఓపెన్ రిఫైన్‌లో “జనరల్ రిఫైన్ ఎక్స్‌ప్రెషన్ లాంగ్వేజ్” అనే భాష ఉంటుంది. దీనిని సంక్షిప్తంగా “జి ఆర్ ఈ ఎల్” అని పిలుస్తారు. దీని ద్వారా డేటాను



ఆటోమేటిక్‌గా మార్చవచ్చు. ఉదాహరణకు తేదీలను ఒకే ఫార్మాట్‌లోకి మార్చడం, అక్షరాలను చిన్నవిగా లేదా పెద్దవిగా మార్చడం, ఖాళీ విలువలను గుర్తించడం వంటి పనులు చేయవచ్చు. లైబ్రరీల్లో మెటాడేటా నాణ్యత చాలా ముఖ్యమైనది. ఒక పుస్తకానికి సంబంధించిన రచయిత పేరు, ప్రచురణ సంవత్సరం, అంశం, ఐఎస్‌బిఎన్ సంఖ్య వంటి వివరాలు సరైన రూపంలో లేకపోతే శోధనలో సమస్యలు వస్తాయి. ఓపెన్ రిఫైన్ ద్వారా ఈ మెటాడేటాను సరిచేయవచ్చు. ఇది “వికీడేటా” వంటి బాహ్య డేటాబేస్‌లతో కూడా అనుసంధానం చేయవచ్చు. ఉదాహరణకు ఒక రచయిత గురించి అదనపు సమాచారం వికీడేటా నుంచి తీసుకొని లైబ్రరీ రికార్డులకు జోడించవచ్చు. దీనిని “డేటా రీకన్సిలియేషన్” అంటారు. పరిశోధన డేటా నిర్వహణలో కూడా ఓపెన్ రిఫైన్ విస్తృతంగా ఉపయోగిస్తున్నారు. పెద్ద పరిమాణంలో ఉన్న పరిశోధన డేటాను శుభ్రపరచడం, విశ్లేషణకు సిద్ధం చేయడం, తప్పులను గుర్తించడం వంటి పనులు వేగంగా చేయవచ్చు. భారతదేశంలో కూడా డిజిటల్ లైబ్రరీల అభివృద్ధితో ఓపెన్ రిఫైన్ వినియోగం పెరుగుతోంది. విశ్వవిద్యాలయాలు, పరిశోధన కేంద్రాలు, డిజిటల్ ఆర్కైవ్ ప్రాజెక్టులు దీనిని ఉపయోగిస్తున్నాయి. ముఖ్యంగా “నేషనల్ డిజిటల్ లైబ్రరీ” వంటి ప్రాజెక్టుల్లో డేటా నాణ్యతను మెరుగుపరచడానికి ఇలాంటి సాధనాలు అవసరం అవుతున్నాయి. అయితే కొన్ని సవాళ్లు కూడా ఉన్నాయి. సాంకేతిక పరిజ్ఞానం లేకపోతే కొత్త వినియోగదారులకు మొదట్లో కొంత క్లిష్టంగా అనిపించవచ్చు. అలాగే భారీ పరిమాణంలో డేటా ఉంటే అధిక కంప్యూటర్ మెమరీ అవసరం అవుతుంది. కానీ సరైన శిక్షణ ఉంటే ఈ సమస్యలను అధిగమించవచ్చు. ఓపెన్ రిఫైన్ వల్ల సమయం ఆదా అవుతుంది. డేటా నాణ్యత పెరుగుతుంది. మానవ తప్పిదాలు తగ్గుతాయి. పరిశోధన విశ్వసనీయత పెరుగుతుంది. లైబ్రరీల్లో శోధన సామర్థ్యం కూడా మెరుగుపడుతుంది. భవిష్యత్తులో కృత్రిమ మేధస్సు ఆధారిత డేటా నిర్వహణ వ్యవస్థల్లో కూడా ఓపెన్ రిఫైన్ వంటి సాధనాలకు ప్రాధాన్యం పెరిగే అవకాశం ఉంది. ముఖ్యంగా డిజిటల్ హ్యూమానిటీస్, డిజిటల్ ఆర్కైవింగ్, రీసెర్చ్ డేటా మేనేజ్‌మెంట్ రంగాల్లో ఇది మరింత కీలకంగా మారుతుంది. మొత్తానికి ఓపెన్ రిఫైన్ అనేది ఆధునిక లైబ్రరీ సైన్స్‌లో అత్యంత ఉపయోగకరమైన డేటా క్లీనింగ్ మరియు డేటా ట్రాన్స్‌ఫర్మేషన్ సాధనం. డేటా నాణ్యతను మెరుగుపరచడంలో, పరిశోధన విశ్వసనీయతను పెంచడంలో, డిజిటల్ సమాచార నిర్వహణను సమర్థవంతంగా చేయడంలో ఇది కీలక పాత్ర పోషిస్తోంది.



డాక్టర్ కోలాహలం రామ్ కిశోర్



# జాతీయం-అంతర్జాతీయం



## మమత బెనర్జీ నిర్ణయంతో తృణమూల్ షేకప్



**కోల్‌కతా:** పశ్చిమ బెంగాల్ మాజీ అధికార పార్టీ, అఖిల భారత తృణమూల్ కాంగ్రెస్లో పొలిటికల్ హైడ్రామా పీక్స్‌కు చేరింది. పార్టీలో తీవ్రస్థాయిలో తిరుగుబాటు వ్యూహాలు నడుస్తున్న తరుణంలో అధినేత్రి మమతా బెనర్జీ బుధవారం అత్యంత కీలకమైన, సంచలన నిర్ణయం తీసుకున్నారు. పార్టీకి చెందిన అన్ని స్థాయిల కమిటీలతో పాటు, అనుబంధ సంస్థల కమిటీలన్నింటినీ తక్షణమే రద్దు చేస్తున్నట్లు అధిష్ఠానం ప్రకటించింది. ఈ నిర్ణయం పార్టీ శ్రేణుల్లో తీవ్ర అంతర్గత గందరగోళానికి దారి తీయగా, బెంగాల్ రాజకీయాల్లో ఒక్కసారిగా చర్చనీయాంశంగా మారింది. ఈ మేరకు పార్టీ తన అధికారిక 'ఎక్స్' (ట్విట్టర్) ఖాతాలో ఒక ప్రకటన విడుదల చేసింది.

రెబల్స్ వ్యూహానికి 'దీదీ' కౌంటర్?

టీఎంసీ గుర్తుపై గెలిచిన 58 మందికి పైగా ఎమ్మెల్యేలు అధిష్టానంపై తిరుగుబాటు జెండా ఎగురవేసి, నూతన ఎమ్మెల్యే రితబ్రత బెనర్జీని బెంగాల్ అసెంబ్లీలో ప్రతిపక్ష నాయకుడిగా ఎన్నుకున్న గంటల వ్యవధిలోనే మమతా బెనర్జీ ఈ నిర్ణయం తీసుకోవడం గమనార్హం. అంతకుముందు పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నారనే ఆరోపణలతో రితబ్రత బెనర్జీ, మరో ఎమ్మెల్యే సందీపన్ సాహాలపై టీఎంసీ బహిష్కరణ వేటు వేసింది. బహిష్కరణకు గురైన రితబ్రత బెనర్జీ.. అంతకుముందు వరకు పార్టీ కార్మిక సంఘం విభాగానికి అధిపతిగా బాధ్యతలు నిర్వహించడం గమనార్హం.

ఓటమితో మొదలైన కుంగుబాటు..

గత 15 సంవత్సరాలుగా పశ్చిమ బెంగాల్‌ను ఏకఛత్రాధిపత్యంగా పాలించిన తృణమూల్ కాంగ్రెస్, మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో కేవలం 80 స్థానాలకే పరిమితమై ఘోర పరాజయాన్ని చవిచూసింది. అధికారం కోల్పోయిన నెల రోజుల వ్యవధిలోనే పార్టీలో విభేదాలు రచ్చకెక్కాయి. పార్టీ ముఖ్య నేతలు కీలక అంతర్గత సమావేశాలకు దూరంగా ఉంటుండగా.. మరోవైపు జిల్లా పరిషత్‌లు, మున్సిపల్ కార్పొరేషన్లు, మున్సిపాలిటీల్లోని ప్రజాప్రతినిధులు సామూహికంగా రాజీనామాలు చేయడం లేదా పాత క్రిమినల్ కేసుల్లో అరెస్ట్ కావడం వంటి పరిణామాలు పార్టీని కోలుకోలేని దెబ్బతీశాయి.

కొత్త రూపు ఇచ్చేందుకే ఆత్మపరిశీలన: టీఎంసీ

ప్రస్తుత సంక్షోభ పరిణామాల నేపథ్యంలో పార్టీ ఆత్మపరిశీలన చేసుకుంటోందని, సంస్థను సరికొత్తగా నిర్మించడానికే ఈ నిర్ణయం తీసుకున్నట్లు తృణమూల్ కాంగ్రెస్ స్పష్టం చేసింది. ప్రతి స్థాయిలోనూ సమగ్ర పనితీరు సమీక్ష, సంస్థాగత అంచనా ప్రక్రియను చేపడతామని తెలిపింది. ఈ సమీక్షల అనంతరం అన్ని అనుబంధ సంస్థల నిర్మాణాన్ని పునర్వ్యవస్థీకరించి, త్వరలోనే నూతన కమిటీలను ప్రకటిస్తామని వెల్లడించింది. భవిష్యత్ సవాళ్లను నూతన ఉత్సాహంతో ఎదుర్కొనేందుకు, పార్టీని బలోపేతం చేసేందుకే ఈ కఠిన నిర్ణయాలు తీసుకున్నట్లు అధిష్ఠానం ప్రకటించింది.

## విజయ్‌పై 'అప్పర్ హ్యాండ్' సాధించిన హస్తం పార్టీ!



**చెన్నై:** తమిళనాడు రాజకీయాల్లో అధికార 'తమిళగ వెట్రి కళగం' (TVK) పార్టీ ఒక కీలకమైన మరియు ఊహాజనిత నిర్ణయాన్ని తీసుకుంది. ముఖ్యమంత్రి విజయ్ సారథ్యంలో నడుస్తున్న టీవీకే.. తమ ఖాతాలో పడాల్సిన ఏకైక రాజ్యసభ స్థానాన్ని మిత్రపక్షమైన కాంగ్రెస్‌కు కేటాయిస్తూ సంచలన నిర్ణయం తీసుకుంది. మిత్ర ధర్మాన్ని కాపాడేందుకే ఈ త్యాగానికి సిద్ధమయ్యామని టీవీకే కొద్దిసేపటి క్రితమే అధికారిక ప్రకటన విడుదల చేసింది. అయితే, ఈ నిర్ణయంతో తొలిసారిగా పార్లమెంట్‌లో అడుగుపెట్టే సువర్ణావకాశాన్ని విజయ్ పార్టీ చేజేతులా వదులుకుందనే చర్చ రాజకీయ వర్గాల్లో మొదలైంది.

ప్రవీణ్ చక్రవర్తికి దక్కనున్న సీటు?

టీవీకే త్యాగం చేసిన ఈ రాజ్యసభ స్థానం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు ప్రవీణ్ చక్రవర్తికి దక్కే అవకాశం ఉన్నట్లు గట్టి ఊహాగానాలు వినిపిస్తున్నాయి. గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో టీవీకేకాంగ్రెస్ పొత్తు కుదరడంలో ప్రవీణ్ చక్రవర్తి కీలక పాత్ర పోషించారు. మాస్ హీరోగా విజయ్‌కి పెద్ద అభిమాని అయిన ఆయన.. ఎన్నికల సీట్ల పంపకాల చర్చల సమయంలో విజయ్‌ను నేరుగా ఆయన నివాసంలోనే కలిశారు. అప్పట్లో కాంగ్రెస్ పార్టీ డీఎంకేతో పొత్తులో ఉన్నప్పటికీ, ప్రవీణ్ చక్రవర్తి చేసిన ఈ ప్రయత్నాలు తమిళ రాజకీయాల్లో పెను సంచలనంగా మారాయి.

కాంగ్రెస్‌కు డబుల్ బోనస్!

గత డీఎంకే ప్రభుత్వంతో ఉన్న ఒప్పందం ప్రకారం కాంగ్రెస్ ఇప్పటికే ఒక రాజ్యసభ సీటును దక్కించుకుంది. ఆ తర్వాత డీఎంకేతో బంధాన్ని తెంచుకుని, టీవీకేతో చేతులు కలిపే ప్రతిపాదనలు వచ్చినప్పుడు కూడా కాంగ్రెస్ తన వ్యూహాత్మక చతురతను ప్రదర్శించింది. సీట్ల చర్చల్లో డీఎంకేపై ఒత్తిడి తెచ్చి.. వారి నుండి 28 అసెంబ్లీ సీట్లతో పాటు ఒక రాజ్యసభ సీటును లాభంగా పొందింది. ఇప్పుడు తాజాగా టీవీకేతో ముందుగా కుదిరిన అంతర్గత ఒప్పందం ప్రకారం.. మరో రాజ్యసభ స్థానాన్ని కూడా దక్కించుకుని కాంగ్రెస్ 'డబుల్ బోనస్' కొట్టింది.


ఖాళీ ఎలా ఏర్పడిందంటే..?

ఏఐఏడీఎంకే (AIADMK)కు చెందిన సీనియర్ నేత సీవీ షణ్ముగం తన రాజ్యసభ సభ్యత్వానికి రాజీనామా చేయడం వల్ల ఈ ఖాళీ ఏర్పడింది. గత అసెంబ్లీ ఎన్నికల్లో ఆయన మైలం నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా విజయం సాధించడంతో, పార్లమెంట్ ఎగువ సభ సభ్యత్వాన్ని వదులుకున్నారు. ప్రస్తుతం అసెంబ్లీలో 107 మంది సొంత ఎమ్మెల్యేల బలంతో పాటు, మిత్రపక్షాల మద్దతు ఉన్న అధికార టీవీకే ఈ స్థానాన్ని ఏకపక్షంగా గెలుచుకునే అవకాశం ఉంది. అయినప్పటికీ, విజయ్ మాత్రం కాంగ్రెస్ బంధానికే పెద్దపీట వేస్తూ సీటును వదులుకున్నారు.

కింగ్ మేకర్‌గా కాంగ్రెస్..

తమిళనాడు ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ పోటీ చేసిన 28 స్థానాల్లో కేవలం 5 సీట్లు మాత్రమే గెలుచుకుంది. అయితే, రాష్ట్రంలో హంగ్ అసెంబ్లీ ఏర్పడటంతో ఈ 5 స్థానాలు అత్యంత కీలకంగా మారాయి. ప్రభుత్వ ఏర్పాటులో కాంగ్రెస్ 'కింగ్ మేకర్' పాత్ర పోషించడంతో.. టీవీకే ప్రభుత్వంలో కాంగ్రెస్ ఎమ్మెల్యేలు పీ. విశ్వనాథన్, ఎస్. రాజేష్ కుమార్‌లకు మంత్రి పదవులు కూడా దక్కాయి. ఇప్పుడు తాజాగా లభించిన రాజ్యసభ సీటుతో తమిళనాడులో హస్తం పార్టీ రాజకీయంగా మరింత లాభపడినట్లయింది.

# భారత్ సహా 60 దేశాలపై అమెరికా అదనపు సుంకాల అస్త్రం!




**న్యూఢిల్లీ/వాషింగ్టన్:** అంతర్జాతీయ వాణిజ్యంలో అమెరికా మరో సంచలన నిర్ణయానికి తెరలేపింది. భారత్ సహా ప్రపంచంలోని 60 దేశాల నుంచి వచ్చే దిగుమతులపై 10 నుంచి 12.5 శాతం వరకు అదనపు సుంకాలను విధించాలని అమెరికా వాణిజ్య ప్రతినిధుల విభాగం (యూఎస్‌టీఆర్) ప్రతిపాదించింది. ఈ మేరకు 1974 వాణిజ్య చట్టంలోని 'సెక్షన్ 301' కింద చేపట్టిన దర్యాప్తు నివేదికను మంగళవారం విడుదల చేసింది. అమెరికాకు ఉన్న మొత్తం దిగుమతుల్లో దాదాపు 99.40 శాతం వాటా ఈ 60 దేశాలదే కావడం గమనార్హం.

సుంకాల విధింపునకు కారణం ఇదే..

వస్తువుల ఉత్పత్తిలో 'ఫోర్స్‌డ్ లేబర్' (బలవంతపు శ్రమ/వెట్టిచాకిరి) నిర్మూలనకు సంబంధించిన అంతర్జాతీయ ఆంక్షలను సమర్థవంతంగా అమలు చేయడంలో ఈ 60 దేశాలు విఫలమయ్యాయని అమెరికా ఆరోపించింది. ఈ విధానాల వల్ల అమెరికా కార్మికులు అంతర్జాతీయ మార్కెట్లో అసమాన పోటీని ఎదుర్కోవాల్సి వస్తోందని యూఎస్ వాణిజ్య ప్రతినిధి జేమీసన్ గ్రీర్ పేర్కొన్నారు. అయితే, ఈ కొత్త సుంకాలు వెంటనే అమల్లోకి రావని, ప్రజాభిప్రాయ సేకరణ, సమీక్షల అనంతరం తుది నిర్ణయం ఉంటుందని యూఎస్‌టీఆర్ స్పష్టం చేసింది.

ఏ దేశంపై ఎంత సుంకం?

యూఎస్‌టీఆర్ వర్గీకరణ ప్రకారం సుంకాల విధింపు ఇలా ఉండనుంది:

10 శాతం సుంకం: కెనడా, బ్రిటన్, ఈయూ దేశాలు, మెక్సికో, పాకిస్తాన్, ఇండోనేషియా, బంగ్లాదేశ్, అర్జెంటీనా, మలేషియా, తైవాన్ తదితర దేశాలు.

12.5 శాతం సుంకం: భారత్, చైనాలతో పాటు మిగిలిన 45 దేశాలు.

చేనేత రంగానికి ఊరట: సెక్షన్ 301 కింద అప్పీరల్, టెక్స్‌టైల్ (దుస్తులు, చేనేత వస్త్రాలు) ఉత్పత్తులకు ప్రత్యేక మినహాయింపులు ప్రతిపాదించారు. వీటిని తక్కువ టారిఫ్ రేటుతోనే అమెరికాలోకి అనుమతించనున్నారు.

ట్రంప్ 'రెసిప్రొకల్ టారిఫ్స్' పునరుద్ధరణే లక్ష్యమా?

గతంలో అమెరికా అధ్యక్షుడు డోనల్డ్ ట్రంప్ ప్రకటించిన 'పరస్పర సుంకాల' (రెసిప్రొకల్ టారిఫ్స్) విధానాన్ని సుప్రీంకోర్టు కొట్టివేసిన నేపథ్యంలో, ఇప్పుడు 'ఫోర్స్‌డ్ లేబర్' నెపంతో ఈ అదనపు సుంకాలను జీవం పోసే ప్రయత్నం జరుగుతోందని బ్లూమ్‌బర్గ్ విశ్లేషించింది.

స్పందించిన భారత ప్రభుత్వం

ఈ పరిణామంపై భారత వాణిజ్య, పరిశ్రమల శాఖ స్పందించింది. యూఎస్‌టీఆర్ దర్యాప్తు నివేదికను తాము గమనిస్తున్నామని తెలిపింది. సెక్షన్ 232 కింద ఇప్పటికే సుంకాలు చెల్లిస్తున్న ఉత్పత్తులతో పాటు, నిర్దిష్ట టెక్స్‌టైల్ వస్తువులకు ఈ ప్రతిపాదిత సుంకాల నుండి మినహాయింపు ఉందని పేర్కొంది. ఈ సుంకాల ప్రక్రియకు సంబంధించి అమెరికా అధికార యంత్రాంగంతో భారత్ నిరంతరం సంప్రదింపులు జరుపుతోందని స్పష్టం చేసింది.

## ప్రేమకు 'యస్'.. ఆర్మీకి 'నో'

### ప్రపోజ్ చేసిన కెప్టెన్‌కు షోకాజ్ నోటీసులు?





**నాసిక్:** శిక్షణ పూర్తి చేసుకున్న ఆనందంలో.. ఆర్మీ నిబంధనలను విస్మరించి, అధికారిక వేడుకలో తన స్నేహితురాలికి ప్రపోజ్ చేసిన ఒక యువ ఆర్మీ కెప్టెన్ ఇప్పుడు క్రమశిక్షణా చర్యలను ఎదుర్కొనే పరిస్థితి తెచ్చుకున్నారు. నాసిక్‌లోని కంబాట్ ఆర్మీ ఏవియేషన్ ట్రైనింగ్ స్కూల్‌లో మంగళవారం జరిగిన ఈ ఘటనకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అవుతోంది.

అసలేం జరిగిందంటే..?

కంబాట్ ఆర్మీ ఏవియేషన్ ట్రైనింగ్ స్కూల్ లో శిక్షణ పూర్తి చేసుకున్న కెప్టెన్ భరత్ భరద్వాజ్ గ్రాడ్యుయేషన్ డే (పాసింగ్ అవుట్ పరేడ్) వేడుకల్లో పాల్గొన్నారు. ఈ మైలురాయిని వీక్షించేందుకు ఆయన కుటుంబ సభ్యులతో పాటు స్నేహితురాలు కూడా వచ్చారు. ఈ క్రమంలో, అక్కడ నిలిపి ఉంచిన ఒక ఆర్మీ హెలికాప్టర్ ముందు కెప్టెన్ భరత్ మోకాళ్లపై కూర్చుని, రింగ్ తీసి తన స్నేహితురాలికి లవ్ ప్రపోజ్ చేశారు. ఆమె కూడా ఆనందంతో గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో, అక్కడున్న వారంతా చప్పట్లతో వారికి అభినందనలు తెలిపారు. ఈ దృశ్యాలను ఎవరో వీడియో తీసి సోషల్ మీడియాలో పెట్టడంతో అది కాస్తా వైరల్‌గా మారింది.

అధికారులు ఎందుకు సీరియస్ అయ్యారు?

ప్రేమ వ్యవహారంలో ఆ యువతి 'యస్' చెప్పినప్పటికీ, ఆర్మీ ఉన్నతాధికారులు మాత్రం ఈ చర్యపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ప్రొటోకాల్ ఉల్లంఘన: 'పాసింగ్ అవుట్ పరేడ్' అనేది అత్యంత ప్రతిష్ఠాత్మకమైన, క్రమశిక్షణతో కూడిన అధికారిక సైనిక కార్యక్రమమని అధికారులు స్పష్టం చేశారు.

నిబంధనల అతిక్రమణ: ఇటువంటి అధికారిక వేదికలను, సైనిక ఆస్తులను (హెలికాప్టర్లను) వ్యక్తిగత వేడుకలకు వాడుకోవడం డిఫెన్స్ టెక్నికల్ పబ్లిసిటీ రూల్స్ తో పాటు, అంతర్గత సైనిక వేడుకల ప్రొటోకాల్‌ను ఉల్లంఘించడమేనని తేల్చి చెప్పారు.

ఈ విషయాన్ని తీవ్రమైన క్రమశిక్షణా రాహిత్యంగా పరిగణిస్తున్న సైనిక వర్గాలు.. కెప్టెన్ భరత్ భరద్వాజ్‌కు షోకాజ్ నోటీసులు జారీ చేసి, తగిన చర్యలు తీసుకునేందుకు సిద్ధమవుతున్నట్లు సమాచారం.

## తృణమూల్‌లో పెను సంచలనం



**కోల్‌కతా:** పశ్చిమ బెంగాల్ రాజకీయాల్లో మరో ఆసక్తికరమైన ఘట్టం చోటుచేసుకుంది. అధికార తృణమూల్ కాంగ్రెస్ (TMC) పార్టీకి చెందిన రెబల్ ఎమ్మెల్యే రితబ్రత బెనర్జీ శాసనసభలో ప్రతిపక్ష నాయకుడిగా అవతరించారు. తనను విపక్ష నేతగా అసెంబ్లీ స్పీకర్ నియమించినట్లు ఆయన స్వయంగా ప్రకటించారు. పార్టీలో తిరుగుబాటు ఎగురవేసిన తమ శిబిరాన్ని అధికారిక శాసనసభా పక్షంగా గుర్తించాలంటూ తాము చేసిన విజ్ఞప్తికి స్పీకర్ సానుకూలంగా స్పందించి, ఆమోదం తెలిపారని ఆయన వెల్లడించారు.

మమతా బెనర్జీయే మా ముఖ్య సలహాదారు!


స్పీకర్‌తో భేటీ ముగిసిన అనంతరం రితబ్రత బెనర్జీ మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన ఒక ఊహించని ప్రకటన చేసి అందరినీ ఆశ్చర్యపరిచారు. తమ తిరుగుబాటు వర్గానికి ముఖ్య సలహాదారుగా వ్యవహరించాల్సిందిగా పార్టీ అధినేత్రి, ముఖ్యమంత్రి మమతా బెనర్జీని కోరడం గమనార్హం. ప్రస్తుతం తృణమూల్ కాంగ్రెస్ గుర్తుపై గెలిచిన 58 మంది ఎమ్మెల్యేలతో పాటు, ఇతర రాష్ట్రానికి చెందిన మరో ఇద్దరు ఎమ్మెల్యేలు కూడా తమకు మద్దతుగా నిలిచారని రితబ్రత ప్రకటించారు. రాబోయే రోజుల్లో మరికొందరు ఎమ్మెల్యేలు తమతో చేరనున్నారని, దీంతో తమ బలం మరింత పుంజుకుంటుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

పార్టీని సొంతం చేసుకునే వ్యూహం?

పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నారనే ఆరోపణలపై రితబ్రత బెనర్జీతో పాటు పలువురు నేతలను తృణమూల్ కాంగ్రెస్ అధిష్ఠానం ఇటీవలే బహిష్కరించిన సంగతి తెలిసిందే. పార్టీ తమపై చర్యలు తీసుకున్నప్పటికీ.. సాంకేతికంగా మెజారిటీ ఎమ్మెల్యేల మద్దతును కూడగట్టుకున్న తిరుగుబాటు వర్గం, ఇప్పుడు నేరుగా స్పీకర్‌ను కలిసి అధికారిక గుర్తింపు సాధించింది. తద్వారా అసలు పార్టీనే తమ సొంతం చేసుకునే దిశగా రెబల్స్ వ్యూహాత్మకంగా అడుగులు వేస్తున్నట్లు రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

## ఆన్‌లైన్ బెట్టింగ్‌లకు రాజ్యాంగ రక్షణ లేదు

### సుప్రీంకోర్టు సంచలన తీర్పు



**న్యూఢిల్లీ:** దేశంలో పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్న ఆన్‌లైన్ బెట్టింగ్, గేమింగ్ యాప్‌లకు సుప్రీంకోర్టు గట్టి షాక్ ఇచ్చింది. ఆన్‌లైన్ బెట్టింగ్ అనేది నైపుణ్యంతో కూడిన ఆట (గేమ్ ఆఫ్ స్కిల్) అయినప్పటికీ, దానికి ఎలాంటి రాజ్యాంగ రక్షణ లభించబోదని దేశ అత్యున్నత న్యాయస్థానం తేల్చి చెప్పింది. ఈ మేరకు వివిధ క్రీడలపై ఆన్‌లైన్ బెట్టింగ్‌లను నిషేధిస్తూ తమిళనాడు, కర్ణాటక ప్రభుత్వాలు గతంలో తీసుకొచ్చిన చట్టాల రాజ్యాంగబద్ధతను సుప్రీంకోర్టు పూర్తిస్థాయిలో సమర్థించింది.

రాష్ట్రాలకే పూర్తి అధికారం

ఆన్‌లైన్ బెట్టింగ్, గేమింగ్ వంటి అంశాలపై సొంతంగా చట్టాలు రూపొందించేందుకు, అవసరమైతే వాటిని పూర్తిగా నిషేధించేందుకు రాష్ట్ర ప్రభుత్వాలకు పూర్తి అధికారాలు ఉన్నాయని జస్టిస్ పార్ధివాలా, జస్టిస్ ఆర్. మహదేవన్‌లతో కూడిన ధర్మాసనం స్పష్టం చేసింది. సమాజ హితం, ప్రజా శ్రేయస్సు, శాంతిభద్రతలను కాపాడటం వంటి కీలక అంశాలను పరిగణనలోకి తీసుకుని, ఆన్‌లైన్ గేమింగ్ ప్లాట్‌ఫామ్‌లపై నిషేధం విధించడాన్ని తాము పూర్తిగా సమర్థిస్తున్నట్లు న్యాయస్థానం ఈ సందర్భంగా ప్రకటించింది.

దేశవ్యాప్త నిషేధానికి మార్గం సుగమం!

సుప్రీంకోర్టు ఇచ్చిన ఈ చారిత్రాత్మక తీర్పుతో దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లోనూ ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్‌లను అడ్డుకోవడానికి మార్గం సుగమమైంది. యువతను, సామాన్య ప్రజలను ఆర్థికంగా కుంగదీస్తున్న ఆన్‌లైన్ జూదాల నియంత్రణకు రాష్ట్ర ప్రభుత్వాలు ఇకపై మరిన్ని కఠిన చట్టాలు తెచ్చేందుకు ఈ తీర్పు ఒక మైలురాయిగా మారనుంది.




# కరీంనగర్ |అదిలాబాద్ | నిజామాబాద్ - ఉమ్మడి జిల్లాల వార్తలు

## గ్రామసభలు, వార్డు సభల ద్వారా ప్రభుత్వ సందేశం ప్రతి ఇంటికి చేరాలి : జిల్లా కలెక్టర్

**జూన్ 4, 6, 8, 10 తేదీల్లో నిర్వహించే గ్రామసభలు, వార్డు సభల్లో ప్రజల భాగస్వామ్యం పెంచాలి**

**ఎస్ఐఆర్ కార్యక్రమం, సూపర్ ఎల్‌నినో పరిస్థితులు, ప్రత్యామ్నాయ పంటల ప్రణాళికలపై సమగ్ర అవగాహన కల్పించాలి**

**వడదెబ్బ మరణాల ఎక్స్‌గ్రేషియా, ఎన్ఎఫ్‌బీఎస్ పథకాలపై ప్రజలకు విస్తృత ప్రచారం నిర్వహించాలి**

**ప్రజాపాలన - ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంపై జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించిన కలెక్టర్**

**పెద్దపల్లి, జూన్-03 (ఉదయం ప్రతినిధి)**

జిల్లాలో నిర్వహించనున్న గ్రామసభలు, వార్డు సభల ద్వారా ప్రభుత్వ కార్యక్రమాలు, సంక్షేమ పథకాలపై సందేశం ప్రతి ఇంటికి చేరేలా అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష ఆదేశించారు.బుధవారం ఎన్‌టీపీసీ కాకతీయ ఫంక్షన్ హాల్‌లో అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్ )అరుణశ్రీ తో కలిసి ప్రజాపాలన – ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా జిల్లా స్థాయి అధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, ఎంపీఓలు, వ్యవసాయ,పోలీసు,వైద్య,విద్యుత్,నీటి పారుదల తదితర శాఖల అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ, గ్రామపంచాయతీలు, మున్సిపల్, పట్టణ ప్రాంతాల్లో వడదెబ్బ కారణంగా ఎవరైనా మరణిస్తే రాష్ట్ర ప్రభుత్వం రూ.4 లక్షల ఎక్స్‌గ్రేషియా అందజేస్తుందని తెలిపారు. అయితే ఎక్స్‌గ్రేషియా మంజూరుకు ఎఫ్ఐఆర్, పోస్టుమార్టం నివేదిక, మరణ ధృవీకరణ పత్రం తప్పనిసరిగా ఉండాలని పేర్కొన్నారు. ఈ విషయంపై పంచాయతీ కార్యదర్శులు ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని సూచించారు.జాతీయ కుటుంబ ప్రయోజన పథకం (ఎన్ఎఫ్‌బీఎస్)ను పూర్తి స్థాయిలో వినియోగించుకోవాలని కలెక్టర్ తెలిపారు. కుటుంబంలో మరణం సంభవించిన అర్హులైన కుటుంబాలకు రూ.20 వేల ఆర్థిక సహాయం అందుతుందని, మీ సేవ ద్వారా దరఖాస్తు చేసుకుంటే ఎంపీడీవో లేదా తహసీల్దార్ స్థాయిలోనే మంజూరు ప్రక్రియ పూర్తవుతుందని వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం జూన్ 4, 6, 8, 10 తేదీల్లో నిర్వహించే గ్రామసభలు, వార్డు సభలను విజయవంతం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఎస్ఐఆర్ కార్యక్రమం, సూపర్ ఎల్‌నినో ప్రభావం, తక్కువ వర్షపాతం పరిస్థితులు, ప్రత్యామ్నాయ పంటల సాగు, నీటి నిర్వహణ, విద్యుత్ రంగ అవసరాలపై ప్రజలకు సమగ్ర అవగాహన కల్పించాలని సూచించారు. ఎస్ఐఆర్ కార్యక్రమానికి సంబంధించి ప్రతి ఓటు రక్షణ, కార్యక్రమ షెడ్యూల్, సమర్పించాల్సిన పత్రాలు, దరఖాస్తు విధానం వంటి అంశాలను గ్రామసభల్లో పూర్తిస్థాయిలో వివరించాలని, ప్రజల సందేహాలను అక్కడికక్కడే నివృత్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు.వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు తక్కువ వర్షపాతం పరిస్థితుల్లో అనుసరించాల్సిన ప్రత్యామ్నాయ పంటల ప్రణాళికలపై అవగాహన కల్పించాలని సూచించారు. జూలై 15, జూలై 30, ఆగస్టు 15 నాటికి సాధారణ వర్షాలు నమోదు కాకపోతే ఏ పంటలు సాగు చేయాలనే అంశంపై దశలవారీ కార్యాచరణ ప్రణాళికలను రైతులకు వివరించాలని తెలిపారు.గ్రామసభలు కేవలం ప్రభుత్వ సిబ్బందితో నిర్వహించే కార్యక్రమాలుగా కాకుండా ప్రజల భాగస్వామ్యంతో నిర్వహించాలని కలెక్టర్ పేర్కొన్నారు. సభల నిర్వహణ స్థలం, సమయం, ఉద్దేశ్యాన్ని ముందుగానే ప్రజలకు చేరవేసి భారీ స్థాయిలో ప్రజలను సమీకరించాలని సూచించారు.

తక్కువ వర్షపాతం ఉన్నా ఆకస్మికంగా భారీ వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నందున గ్రామాల్లో బ్యాకప్ ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని, కాలువల పూడికతీత, అవసరమైన అభివృద్ధి పనులు చేపట్టాలని తెలిపారు. ప్రతి శుక్రవారం నిర్వహించే డ్రైడే కార్యక్రమాల్లో ప్రజల భాగస్వామ్యం పెంచాలని, వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది గ్రామసభల్లో పాల్గొని వడదెబ్బ నివారణ, వర్షాకాల వ్యాధుల నివారణ, తాగునీటి భద్రత, వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించాలని సూచించారు.



## "ప్రజాపాలన – ప్రగతి ప్రణాళిక" పర్యావరణ వారోత్సవాలు ఘనంగా నిర్వహించాలి

**ఈ నెల 4, 6, 8, 10 వ తేదీల్లో గ్రామ సభలు నిర్వహించాలి:**

**రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు.**

**నిర్మల్ జిల్లా 3 జూన్ 2026 (ఉదయం ప్రతినిధి)**

ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా పర్యావరణ వారోత్సవాలను ఘనంగా నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సిఎస్) రామకృష్ణారావు అధికారులను ఆదేశించారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక పర్యావరణ వారోత్సవాలు, వర్షాకాలం సన్నద్ధత, గ్రామసభల నిర్వహణ, తదితర అంశాలపై హైదరాబాదు నుంచి సిఎస్ రామకృష్ణ రావు, రాష్ట్ర డిజిపి సి.వి ఆనంద్, ఇతర ఉన్నతాధికారులతో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక పర్యావరణ వారోత్సవాలు విజయవంతంగా నిర్వహించాలన్నారు. అన్ని కార్యక్రమాలను ప్రణాళిక ప్రకారం చేపట్టాలన్నారు. ఈనెల 4, 6, 8, 10 వ తేదీలలో గ్రామ, వార్డు సభలను ఏర్పాటు చేసి వివిధ అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని అన్నారు. ఈ సభలలో ముఖ్యంగా రైతులకు రానున్న వర్షాకాలం, వాతావరణ పరిస్థితులు, పంటల సాగు వంటి అనేక విషయాలను వివరించాలన్నారు. ఎస్ ఐ ఆర్ ప్రక్రియపై ప్రజల్లో అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. గ్రామ సభలలో మండల స్థాయి అధికారులు మొదలుకొని ప్రజా ప్రతినిధులు ప్రజలు మహిళా సంఘాల సభ్యులు పెద్ద ఎత్తున భాగస్వామ్యం అయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. రానున్న వర్షాకాలం, ఆకస్మిక వరదలు, విపత్కర పరిస్థితులపై అధికారులు ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలన్నారు. పోలీసులు, అడ్మినిస్ట్రేటివ్ విభాగాలు పరస్పరం సమన్వయంతో ఉండాలని తెలిపారు. జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరం నుంచి ఈ వీసీలో జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, పర్యావరణ వారోత్సవాలను పకడ్బందీగా నిర్వహిస్తామని తెలిపారు. రాబోయే వర్షాకాలన్ని దృష్టిలో ఉంచుకొని ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఈనెల 4, 6, 8, 10 తేదీలలో గ్రామ వార్డు సభలు ఏర్పాటు చేసి వివిధ అంశాలపై రైతాంగానికి, ప్రజలకు అవగాహన కల్పిస్తామన్నారు. దీంతో పాటుగానే ఎస్ఐఆర్ ప్రక్రియపై కూడా ప్రజలకు అవగాహన కల్పిస్తామని పేర్కొన్నారు. అనంతరం తహసిల్దార్లతో కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గ్రామ సభలను విజయవంతంగా నిర్వహించాలన్నారు. పెండింగ్ భూభారతి, సాదా బైనామా దరఖాస్తులను వెంటవెంటనే పరిష్కరిస్తూ ఉండాలని ఆదేశించారు. ఈ వీసీలో జిల్లా ఎస్పీ జానకి షర్మిల, అదనపు కలెక్టర్లు బి. వెంకటేశ్వర్లు, కిషోర్ కుమార్, డిఆర్ఓ రాథోడ్ రమేష్, ఎస్ డిసిఎల్ఎ నాయక్వాడి జల కుమారి, డిఎస్పీ శ్రీనివాస్ రెడ్డి, డిఆర్డిఓ విజయలక్ష్మి , డిపివో శ్రీనివాస్, సిపివో గంగారెడ్డి, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.




## ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల పురోగతిని పరిశీలించిన జిల్లా కలెక్టర్

**కామారెడ్డి, జూన్ 3 (ఉదయం ప్రతినిధి):**

సదాశివనగర్ మండలం మోడేగాం గ్రామంలో చేపడుతున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ బుధవారం పరిశీలించారు. నిర్మాణాల పురోగతిని క్షుణ్ణంగా పరిశీలించి, పనులు వేగవంతంగా పూర్తి చేసి లబ్ధిదారులకు త్వరగా అందుబాటులోకి తీసుకురావాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా గత ఏడాది కురిసిన భారీ వర్షాలకు ఇల్లు కూలిపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్న లబ్ధిదారురాలు పిల్లి సాయవ్వతో కలెక్టర్ మాట్లాడారు. గతంలో పూరి గుడిసెలో నివసిస్తూ వర్షాలకు తన ఇల్లు కోల్పోయానని, ప్రస్తుతం ప్రభుత్వం అందిస్తున్న ఇందిరమ్మ ఇల్లు ద్వారా సురక్షితమైన నివాసం కలగబోతుందని ఆమె ఆనందం వ్యక్తం చేశారు. ఇళ్ల నిర్మాణ పనులు వేగంగా కొనసాగుతున్నాయని, తమలాంటి పేద కుటుంబాలకు ప్రభుత్వం అండగా నిలుస్తోందని తెలిపారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, అర్హులైన ప్రతి పేద కుటుంబానికి గౌరవప్రదమైన నివాసం కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను నాణ్యతతో, నిర్ణీత గడువులో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. కామారెడ్డి జిల్లాను గుడిసెలు లేని జిల్లాగా తీర్చిదిద్దేందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు, లబ్ధిదారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ కార్యక్రమం ద్వారా పేద కుటుంబాల జీవన ప్రమాణాలు మెరుగుపడతాయని, ప్రతి కుటుంబానికి సురక్షితమైన గృహం అందేలా జిల్లా యంత్రాంగం కృషి చేస్తోందని కలెక్టర్ తెలిపారు.ఈ సందర్భంగా రెండవ విడత ఇందిరమ్మ ఇళ్లలో పూరి గుడిసెలో ఉన్నవారిని గుర్తించి వారికి ఇళ్లు మంజూరు చేయాలని, ఎక్కడా కూడా పూరి గుడిసెలు కనిపించకూడదని, అధికారులు ప్రతీ గ్రామాన్ని పర్యటించి చర్యలు చేపట్టాలన్నారు. గ్రామీణ పేద కుటుంబాల ఆర్థిక సాధికారతకు స్వయం సహాయక సంఘాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని తెలిపారు. ఐకేపీ ఆధ్వర్యంలో రూ.1.59 కోట్లు 45 లక్షల బ్యాంకు రుణాలను 90 మంది లబ్ధిదారులకు మంజూరు చేయించడం జరిగిందని పేర్కొన్నారు. ఈ రుణాలను సద్వినియోగం చేసుకుని స్వయం ఉపాధి అవకాశాలను పెంపొందించుకోవాలని, కుటుంబ ఆర్థికాభివృద్ధికి తోడ్పడే కార్యకలాపాలను చేపట్టాలని లబ్ధిదారులకు సూచించారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాల ద్వారా పేద కుటుంబాల జీవన ప్రమాణాలు మరింత మెరుగుపడేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. కలెక్టర్ వెంట పీడీ హౌసింగ్ విజయపాల్ రెడ్డి, తహసీల్దార్ సత్యనారాయణ, ఎంపీడీవో, ఎంపీవో, పంచాయతీ కార్యదర్శి తదితరులు ఉన్నారు.



## ఆఖరి మజిలికి అండగా ముక్తి ఆశ్రమం

**బాధిత కుటుంబాన్ని పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ శైలజా**

**మంథని జూన్ 3 (ఉదయం ప్రతినిధి)**

మంథని పట్టణంలో పేద, నిరుపేద కుటుంబాలకు ఆఖరి మజిలీలో అండగా నిలుస్తోంది పుట్ట లింగమ్మ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన "ముక్తి ఆశ్రమం". అద్దె ఇళ్లలో నివసించే కుటుంబాల్లో ఎవరైనా మరణిస్తే అంత్యక్రియలు, కర్మకాండలు నిర్వహించేందుకు అనేక ఇబ్బందులు ఎదురవుతున్న నేపథ్యంలో ఈ ఆశ్రమం ఎంతో మందికి ఆసరాగా మారుతోంది.సమాజంలో ఇప్పటికీ అద్దె ఇళ్లలో మరణించిన వారి కార్యక్రమాలు నిర్వహించేందుకు ఇంటి యజమానులు అభ్యంతరం చెప్పే ఘటనలు చోటుచేసుకుంటున్నాయి. దీంతో పేద కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటూ, కొన్నిసార్లు పార్థివ దేహాలను రోడ్డుపైనే ఉంచాల్సిన పరిస్థితులు కూడా ఏర్పడుతున్నాయి. ఇలాంటి సమస్యలకు శాశ్వత పరిష్కారంగా మంథని బస్ డిపో సమీపంలో పుట్ట లింగమ్మ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ముక్తి ఆశ్రమాన్ని నిర్మించారు.ఈ ఆశ్రమంలో అంతిమ సంస్కారాల నిర్వహణతో పాటు కర్మకాండలు పూర్తయ్యే వరకు కుటుంబ సభ్యులు ఉండేందుకు అవసరమైన సదుపాయాలు కల్పించారు. ఇటీవల మంథని పట్టణానికి చెందిన మందుల పల్లి సరోజన మరణించగా, ఆమె నివసిస్తున్న అద్దె ఇంట్లో కార్యక్రమాలు నిర్వహించేందుకు ఇంటి యజమాని అనుమతించకపోవడంతో కుటుంబ సభ్యులు ముక్తి ఆశ్రమాన్ని ఆశ్రయించారు. ప్రస్తుతం అక్కడే అంత్యక్రియలు, తదనంతర కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.ఈ సందర్భంగా బుధవారం మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ ముక్తి ఆశ్రమాన్ని సందర్శించి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. పేద కుటుంబాలు ఆఖరి మజిలీలో ఇబ్బందులు పడకూడదనే ఉద్దేశంతోనే ముక్తి ఆశ్రమాన్ని ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. కష్టకాలంలో పేదలకు అండగా నిలవడం పుట్ట లింగమ్మ చారిటబుల్ ట్రస్ట్ లక్ష్యమని పేర్కొన్నారు.పేద కుటుంబాలకు గౌరవప్రదమైన అంతిమ సంస్కారాలు నిర్వహించే అవకాశం కల్పిస్తూ, మానవతా దృక్పథంతో ముందుకు సాగుతున్న ముక్తి ఆశ్రమం ప్రస్తుతం మంథని ప్రాంత ప్రజలకు ఒక ఆదర్శ సేవా కేంద్రంగా నిలుస్తోంది.



## సైక్లింగ్‌తో ఆరోగ్యం.. పర్యావరణానికి రక్షణ- అదనపు కలెక్టర్ రాజేశ్వర్



**ఆదిలాబాద్, ఉదయం :**

పర్యావరణ పరిరక్షణతో పాటు వ్యక్తిగత ఆరోగ్యానికి సైక్లింగ్ ఎంతో దోహదపడుతుందని అదనపు కలెక్టర్ రాజేశ్వర్, జిల్లా అటవీ అధికారి ప్రశాంత్ బాజీరావు పాటిల్ అన్నారు. ప్రపంచ సైకిల్ దినోత్సవాన్ని పురస్కరించుకుని అటవీ శాఖ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన భారీ సైకిల్ ర్యాలీని వారు జెండా ఊపి ప్రారంభించారు.'ప్రజాపాలన–ప్రగతి ప్రణాళిక' పర్యావరణ వారోత్సవాల్లో భాగంగా "శూన్య ఇంధనం–గరిష్ఠ ఆరోగ్యం" నినాదంతో నిర్వహించిన ఈ ర్యాలీ స్థానిక ఇందిరా ప్రియదర్శిని స్టేడియం నుంచి ప్రారంభమై కలెక్టర్ చౌక్, ఎన్టీఆర్ చౌక్, వినాయక్ చౌక్, నేతాజీ చౌక్ మీదుగా అంబేద్కర్ చౌక్ వరకు సాగింది. యువత, విద్యార్థులు, క్రీడాకారులు పెద్ద సంఖ్యలో పాల్గొని పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ రాజేశ్వర్ మాట్లాడుతూ పెరుగుతున్న కాలుష్యాన్ని అరికట్టడంలో, ఇంధన పొదుపులో సైకిల్ వినియోగం కీలకమని చెప్పారు. ప్రతి ఒక్కరూ రోజువారీ జీవితంలో సైక్లింగ్‌ను భాగం చేసుకోవాలని సూచించారు. సైక్లింగ్ గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరచడంతో పాటు ఒత్తిడిని తగ్గించడంలోనూ ప్రభావవంతంగా పనిచేస్తుందన్నారు.జిల్లా అటవీ అధికారి ప్రశాంత్ బాజీరావు పాటిల్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణపై ప్రజల్లో చైతన్యం కల్పించేందుకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. పర్యావరణ వారోత్సవాల్లో భాగంగా ఈ నెల 7న '5కే రన్' నిర్వహించనున్నట్లు వెల్లడించారు. విజేతలకు రూ.5,000, రూ.3,000, రూ.2,000 నగదు బహుమతులు అందజేస్తామని, యువత అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.అంతకుముందు ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో మానవహారం నిర్వహించి పర్యావరణ పరిరక్షణపై నినాదాలతో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డివైఎస్ఓ శ్రీనివాస్, ఎఫ్డీఓ అరవింద్ కుమార్, ఫారెస్ట్ రేంజ్ అధికారి అవినాష్, అటవీ శాఖ సిబ్బంది, క్రీడాకారులు, యువత, విద్యార్థులు పాల్గొన్నారు.

## రాజన్న ఆలయ విస్తరణ పనుల్లో వేగం పెంచాలి: జిల్లా కలెక్టర్

**వేములవాడ, జూన్ -03**

వీటీఏడీఏ (వేములవాడ టెంపుల్ ఏరియా డెవలప్మెంట్ అథారిటీ) ఆధ్వర్యంలో రాజన్న ఆలయ విస్తరణ, అభివృద్ధి పనులు, నిత్యాన్నదాన సత్రం, బద్ది పోచమ్మ ఆలయం అభివృద్ధి పనులు, ప్రధాన రోడ్డు విస్తరణ పనులనుజిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ బుధవారం క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. పనుల పురోగతిపై ఆర్ అండ్ బీ అధికారులను అడిగి తెలుసుకున్నారు. పనులు వేగంగా పూర్తి చేయడంపై అధికారులకు పలు సూచనలు చేశారు. రాజన్న ప్రధాన ఆలయ విస్తరణ, ఇతర ప్రతి అభివృద్ధి పనికి సంబంధించి ఒక ప్రణాళిక ప్రకారం ముందుకు వెళ్లాలని సూచించారు. పనుల్లో వేగం పెంచాలని, అవసరమైన పనివారి సంఖ్య మరింత పెంచాలని ఆదేశించారు. రాజన్న ఆలయం నుంచి మూల వాగు బ్రిడ్జి వరకు కొనసాగుతున్న ప్రధాన రోడ్డు విస్తరణ పనులను జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ పరిశీలించారు. పనుల పురోగతి, పూర్తి చేయడంపై వేములవాడ మున్సిపల్ అధికారులను ఆరా తీశారు. పనులు వేగంగా పూర్తి చేసి.. వినియోగంలోకి తీసుకురావాలని ఆదేశించారు.



## పవన్ కళ్యాణ్ వ్యాఖ్యలపై పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ ఫైర్

**జైపూర్, జూన్ 3 (ఉదయం విలేకరి)**

తెలంగాణకు న్యాయం చేస్తామని, తెలంగాణ కోసం గొంతెత్తుతామని పవన్ కళ్యాణ్ చేసిన వ్యాఖ్యలు ఆశ్చర్యాన్ని కలిగిస్తున్నాయని పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ అన్నారు.తెలంగాణ రాష్ట్ర సాధన కోసం విద్యార్థులు, యువత, ప్రజలు ప్రాణత్యాగాలు చేసినపుడు, తెలంగాణను అవమానించే వ్యాఖ్యలు వచ్చినప్పుడు, రాష్ట్ర హక్కులను కాల రాసే ప్రయత్నాలు జరిగినపుడు పవన్ కళ్యాణ్ ఎక్కడ ఉన్నారని ఆయన ప్రశ్నించారు. తెలంగాణను అవమానించిన వారితోనే రాజకీయ పొత్తులు పెట్టుకుని, తెలంగాణకు అన్యాయం చేసిన శక్తులతోనే కలిసి నడుస్తూ, ఇప్పుడు తెలంగాణపై ప్రేమ చూపించడం ప్రజలను మోసం చేసే రాజకీయ నాటకమని విమర్శించారు. బీజేపీ ఎంపీ తేజస్వి సూర్య తెలంగాణను పాకిస్తాన్‌తో పోల్చినప్పుడు పవన్ కళ్యాణ్ ఎందుకు స్పందించలేదని ప్రశ్నించారు. తెలంగాణ యువత, తెలంగాణ ఆత్మగౌరవం అవమానించబడిన ప్రతి సందర్భంలో మౌనం పాటించిన వ్యక్తి ఇప్పుడు తెలంగాణకు రక్షకుడిలా మాట్లాడటం ప్రజలు గమనిస్తున్నారని అన్నారు.



## నూతన అంగన్వాడి భవనాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే కవ్వంపల్లి



**కరీంనగర్ జిల్లా జూన్03 (ఉదయం ప్రతినిధి) :**

మానకొండూరు నియోజవర్గంలోని తిమ్మాపూర్ మండలం మన్నెంపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన అంగన్‌వాడీ భవనాన్ని ప్రారంభించిన అనంతరం నిర్వహించిన అక్షరాభ్యాస కార్యక్రమంలో ఎమ్మెల్యే కవ్వంపల్లి పాల్గొన్నారు. ఈ సందర్భంగా పిల్లలచేత అక్షరాలు దిద్దించి వారిని ఆశీర్వదించారు. అనంతరం డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ పిల్లల జీవితంలో అక్షరాభ్యసమే కీలకమన్నారు. ప్రతి చిన్నారి భవిష్యత్తుకు అక్షరాభ్యసమే బలమైన పునాది అని అన్నారు. చిన్నారులు చిన్ననాటి నుంచే చదువుపై ఆసక్తి పెంచుకోవాలని కోరారు. చిన్నారుల ఆరోగ్యం, పోషకాహారం, ప్రాథమిక విద్యాభివృద్ధికి అంగన్ వాడీ కేంద్రాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని అంగన్ వాడీ కేంద్రాలకు సొంత భవనాలు ఉండేలా రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందని తెలిపారు. అందులో భాగంగానే నూతన భవనాల నిర్మాణానికి అవసరమైన నిధులను మంజూరు చేస్తున్నట్లు చెప్పారు. పిల్లలకు మెరుగైన వసతులు, సురక్షితమైన వాతావరణంలో విద్యా, పోషకాహార సేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, విద్య, వైద్యం, మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు వెల్లడించారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణీలు, బాలింతలు, చిన్నారులకు అందుతున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. గ్రామాభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యం ఎంతో అవసరమని, ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రతి అర్హ కుటుంబానికి చేరేలా కృషి చేస్తున్నామని తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా మహిళా సంక్షేమాధికారి ఎం.సరస్వతి, ఐసీడీఎస్ అధికారులు, అంగన్‌వాడీ సిబ్బంది, గ్రామ పెద్దలు, మహిళలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## గోదావరి పుష్కరాల-2027 అభివృద్ధి పనుల బడ్జెట్ ప్రతిపాదనలు సిద్ధం చేయాలి...

**రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్**

**జగిత్యాల జూన్ 03 (ఉదయం ప్రతినిధి)**

గోదావరి పుష్కరాలు–2027 అభివృద్ధి పనుల అదనపు బడ్జెట్ ప్రతిపాదనలు సిద్ధం చేసి వెంటనే ప్రభుత్వానికి సమర్పించాలని రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అధికారులను ఆదేశించారు బుధవారం సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ బి సత్య ప్రసాద్ అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థల) బిరాజ గౌడ్ లతో కలిసి గోదావరి పుష్కరాలు–2027 అభివృద్ధి పనుల అదనపు బడ్జెట్ ప్రతిపాదనల పై సంబంధిత ఆర్ అండ్ బి పిఆర్ ఇంజినీరింగ్ దేవాదాయశాఖల అధికారులతో మంత్రి సమీక్ష సమావేశం నిర్వహించారు ఈ సందర్భంగా వివిధ శాఖల ద్వారా గోదావరి పుష్కరాలకు సంబంధించి చేపట్టాల్సిన పనులు మంజూరైన నిధులు అదనపు ప్రతిపాదనలు టెండర్ల పురోగతిని మంత్రి సమీక్షించారు. ఈ సందర్భంగా రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ గోదావరి పుష్కరాల సందర్భంగా కోటిలింగాల ధర్మపురిక్షేత్రాలకు లక్షలాది మంది భక్తులు తరలివస్తారని వారి రాకపోకలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా రోడ్ల విస్తరణ అవసరమైన వంతెనల నిర్మాణం ట్రాఫిక్ నిర్వహణ చర్యలను ముందస్తుగా పూర్తి చేయాలని ఆదేశించారు పంచాయతీరాజ్ రోడ్లు భవనాల శాఖలకు మంజూరైన నిధులను సమర్థవంతంగా వినియోగించడంతో పాటు అవసరమైతే మున్సిపల్ డీఎంఎఫ్‌టీ నిధులను కూడా వినియోగించాలని సూచించారు. ప్రభుత్వం నుంచి అవసరమైన సవరణలు అనుమతులు తీసుకుని వెంటనే టెండర్లు పిలిచి ప్రాధాన్యత క్రమంలో పనులు ప్రారంభించాలని ఆదేశించారు. గోదావరి నది తీరంలో ఉన్న పుష్కర ఘాట్లను విస్తరించడంతో పాటు అవసరమైన చోట కొత్త ఘాట్ల నిర్మాణం చేపట్టాలని సూచించారు నీటి పారుదల శాఖ ద్వారా మంజూరైన నిధులతో పుష్కర ఘాట్ల అభివృద్ధి విస్తరణ పనులు చేపట్టాలని తెలిపారు. ప్రతి పుష్కర ఘాట్ వద్ద వాటర్ షవర్స్ దుస్తులు మార్చుకునేందుకు తాత్కాలిక షెడ్లు తాగునీటి వసతులు పారిశుద్ధ్య సదుపాయాలు భద్రతా ఏర్పాట్లు పూర్తి స్థాయిలో ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారుధర్మపురి ఆలయం సమీపంలో హెలీప్యాడ్ రహదారులు ఇతర మౌలిక వసతుల ఏర్పాటుకు అవసరమైన నిధుల మంజూరు కోసం ప్రతిపాదనలు సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపాలని సూచించారు. కోటిలింగాల ధర్మపురి దేవాలయాల అభివృద్ధికి మంజూరైన నిధులను సమర్థవంతంగా వినియోగిస్తూ భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గోదావరిలో పుణ్యస్నానాలు ఆచరించిన అనంతరం భక్తులు సులభంగా స్వామి వారి దర్శనం చేసుకునేలా ఏర్పాట్లు చేయాలని పేర్కొన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ బి సత్యప్రసాద్ మాట్లాడుతూ కోటిలింగాల ధర్మపురి క్షేత్రాలలో గోదావరి పుష్కరాల ఏర్పాట్ల కోసం ప్రభుత్వం మొదటి విడతలో 117 కోట్ల రూపాయల నిధులను మంజూరు చేసిందని తెలిపారు. కోటిలింగాల క్షేత్రంలో ఇరిగేషన్ శాఖ ద్వారా 16.10 కోట్ల రూపాయలు పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ శాఖ ద్వారా 8 కోట్ల రూపాయలు ఆలయ అభివృద్ధికి 10 కోట్ల రూపాయలు కలిపి మొత్తం 34.10 కోట్ల రూపాయలతో పనులు చేపడుతున్నట్లు తెలిపారు. అదేవిధంగా ధర్మపురి క్షేత్రంలో ఇరిగేషన్ శాఖకు 22.20 కోట్ల రూపాయలు రోడ్లు భవనాల శాఖకు 25.80 కోట్ల రూపాయలు పంచాయతీ రాజ్ మున్సిపల్ శాఖలకు 25.70 కోట్ల రూపాయలు ఆలయ అభివృద్ధికి 10 కోట్ల రూపాయలు కలిపి మొత్తం 83.70 కోట్ల రూపాయల నిధులు మంజూరైనట్లు వివరించారు.




## ధాన్యం కొనుగోలు వేగవంతం చేయాలి

**జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**

**మంచిర్యాల/జూన్ 3, 2026(ఉదయం ప్రతినిధి)**

రైతు సంక్షేమంలో భాగంగా ప్రభుత్వం చేపట్టిన ధాన్యం కొనుగోలు ప్రక్రియ వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. బుధవారం జిల్లాలోని జైపూర్ మండలంలోని ఓం రైస్ మిల్, బెజ్జాల గ్రామంలోని ధాన్యం కొనుగోలు కేంద్రం, అన్నపూర్ణ రైస్ మిల్, కిష్టాపూర్ గ్రామంలోని ధాన్యం కొనుగోలు కేంద్రం, సుముఖ గోదాం లను మండల తహసిల్దార్ వనజా రెడ్డి తో కలిసి సందర్శించి ధాన్యం కొనుగోలు, దిగుమతి ప్రక్రియలను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం రైతు సంక్షేమంలో భాగంగా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి నిబంధనల ప్రకారం నాణ్యమైన ధాన్యాన్ని కొనుగోలు చేసి రైతుల ఖాతాలలో నగదు జమ చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ సంవత్సరం దాదాపు 1 లక్ష 60 వేల మెట్రిక్ టన్నుల వరకు ధాన్యం కొనుగోలు చేసే అవకాశం ఉందని తెలిపారు. హమాలీల సమస్యను అధిగమించేందుకు స్థానికంగా హమాలీలను తీసుకొని ధాన్యం ఎగుమతి, దిగుమతులను వేగవంతం చేయడం జరిగిందని తెలిపారు. చివరి గింజ వరకు కొనుగోలు చేయడం జరుగుతుందని, రైతులకు ఎలాంటి సమస్యలు లేకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు. పెద్దపల్లి, కరీంనగర్ లలో హమాలీలతో కలిపి 2గోదాములను ఇచ్చారని, అకాల వర్షాల నేపథ్యంలో రైతులకు నష్టం కలుగకుండా ధాన్యం నిల్వ చేయడం జరుగుతుందని తెలిపారు. ఈసారి ధాన్యం తరలించేందుకు ట్రాక్టర్లను సైతం వినియోగించుకునేలా ప్రభుత్వం అవకాశం కల్పించిందని తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం దాదాపు 10 వేల మెట్రిక్ టన్నుల మొక్కజొన్న పంటను కొనుగోలు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. కొనుగోలు కేంద్రాల నుండి రైస్ మిల్లులకు తరలించిన ధాన్యాన్ని త్వరగా దిగుమతి చేసుకోవాలని, నిర్దేశిత సి.ఎం.ఆర్. లక్ష్యాలను నిర్ణీత గడువులోగా పూర్తి చేసే విధంగా అధికారులు సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, కొనుగోలు కేంద్రాలు, రైస్ మిల్లుల నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.



## బాధిత కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే బొజ్జు

**జన్నారం, జూన్ 3(ఉదయం విలేఖరి)**

మండలంలోని తిమ్మాపూర్ గ్రామంలో మంగళవారం ఘోర ప్రమాదం జరిగింది. రేగుంట పోచం(70) అనే వృద్ధుడు తన పొలం పక్కన ఉన్న వరి కొయ్యలకు గుర్తుతెలియని వ్యక్తులు నిప్పు పెట్టగా, మంటలను ఆర్పేందుకు వెళ్లిన క్రమంలో ప్రమాదవశాత్తు మంటల్లో చిక్కుకొని అక్కడికక్కడే కాలి బూడిదయ్యారు. ఈ ఘటన తిమ్మాపూర్ గ్రామంలో తీవ్ర విషాదాన్ని నింపింది. విషయం తెలుసుకున్న స్థానిక ఎమ్మెల్యే బుధవారం మృతుని కుటుంబాన్ని పరామర్శించారు. మృతుని కుటుంబ సభ్యులను ఓదార్చి, ప్రభుత్వం తరఫున అందాల్సిన ఆర్థిక సహాయం అందేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పంట వ్యర్థాలు కాల్చే సమయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, మంటల దగ్గర ఒంటరిగా ఉండవద్దని రైతులకు సూచించారు. పంట అవశేషాలు కాల్చడం వల్ల ప్రాణనష్టంతో పాటు నేల సారం కూడా దెబ్బతింటుందని అన్నారు. పరామర్శించిన వారిలో మార్కెట్ కమిటీ చైర్మన్ దుర్గం లక్ష్మీనారాయణ, వైస్ చైర్మన్ పసివుల్లా, మండల అధ్యక్షుడు నందు నాయక్, సీనియర్ నాయకులు ఇసాక్, కాంగ్రెస్ కార్యకర్తలు తదితరులు ఉన్నారు.



# చక్కని ఆరోగ్యం

## మండే ఎండల్లోనూ... ఫ్రెష్‌గా ఉండాలంటే..!



చర్మంపై ఎండ ప్రభావం పడటం వల్ల ముఖం, కళ్లు జీవం కోల్పోతాయి. కంటి చుట్టూ నల్లటి వలయాలు, ముఖంలో తాజాదనం లేకపోవడం వంటి సమస్యలు ఎదురవుతాయి. ఇలాంటి వాటినుంచి ఉపశమనం పొందడానికి కొన్ని చిట్కాలు మేలు చేస్తాయంటున్నారు నిపుణులు. గ్రీన్ టీలో యాంటీ ఆక్సిడెంట్లే కాదు.. కెఫీన్ కూడా ఉంటుంది. సాధారణంగా కళ్లు అలసినప్పుడు ఆ టీ బ్యాగుల్ని కళ్లపై పెట్టుకోవడం తెలిసిందే. అయితే వాటి కన్నా, గ్రీన్ టీని ఐసుముక్కల్లా చేసుకొని వాడితే త్వరగా ఫలితం ఉంటుంది అంటున్నారు నిపుణులు.

ఇందుకోసం ముందుగా గ్రీన్ టీని తయారు చేసుకోవాలి. దీన్ని ఐస్ ట్రేలో వేసి ఫ్రీజర్‌లో ఉంచాలి. ఐసు ముక్కల్లా తయారయ్యాక కళ్లపై పెట్టుకుంటే చాలు. లేదంటే ముఖానికి రాసుకొని కాసేపయ్యాక కడిగేసినా కళ తగ్గిన ముఖంలో ఎంతో మార్పు కనిపిస్తుందట. మేకప్ వేసుకోవడానికి చాలా సందర్భాల్లో సమయం ఉండకపోవచ్చు. అలాగని మేకప్ లేకుండా కొన్నిసార్లు బయటికి వెళ్లలేకపోవచ్చు. ఇలాంటప్పుడు ఒకటి లేదా రెండు ఐసు ముక్కల్ని తీసుకొని ముఖంపై రుద్దుకోవాలి. ఫలితంగా ముఖంలో రక్తప్రసరణ పెరిగి తాజాగా మారుతుందట. అలాగే ఎండ వల్ల కమిలిన చర్మానికి సాంత్వన కూడా చేకూరుతుందంటున్నారు నిపుణులు. కీరా దోస గుజ్జులో కొద్దిగా నిమ్మరసం, తేనె కలపాలి. తర్వాత ఐస్‌ట్రేలో వేసి ఫ్రీజర్‌లో ఉంచేయాలి. ఈ మిశ్రమం ఐస్ముక్కల్లా అయ్యాక ముఖం, మెడకు రాసుకోవాలి. ఐదు నిమిషాల తర్వాత కడిగేసుకుంటే చర్మం కాంతివంతమవుతుందట. కలబంద గుజ్జును ఐస్‌ట్రేలో వేసి ఫ్రీజర్‌లో ఉంచేయాలి. కాసేపటి తర్వాత ముఖానికి రాసుకొని నెమ్మదిగా మర్దన చేయాలి. ఇలా చేయడం వల్ల ఎండ కారణంగా కమిలిన చర్మం తాజాగా మారుతుంది. చర్మంపై వేడి ప్రభావం కూడా తగ్గుతుందట.

నీటిని గోరువెచ్చగా చేసి అందులో కీరా దోస రసం కలపాలి. ఈ మిశ్రమాన్ని ఐస్‌ట్రేలో వేసుకొని ఫ్రీజర్‌లో ఉంచాలి. తర్వాత ఆ ఐసు ముక్కలను కళ్లపై పెట్టుకోవాలి. ఇలా తరచూ చేయడం వల్ల ఉబ్బిన కళ్లకు సాంత్వన చేకూరుతుందంటున్నారు నిపుణులు.


## చక్కగా నిద్ర పట్టాలంటే..!



ఈ ఆధునిక జీవనశైలిలో ఒత్తిడితో పాటు, మొబైల్ ఫోన్ వంటి గ్యాడ్జెట్లను విరివిగా వినియోగించడం వల్ల చాలామంది ప్రశాంతమైన నిద్రకు దూరమవుతున్నారు. ఫలితంగా శారీరకంగా, మానసికంగా పలు అనారోగ్యాల పాలవుతున్నారు. అయితే మన రోజువారీ అలవాట్లలో కొన్ని మార్పులు చేర్పులు చేసుకోవడం వల్ల సుఖ నిద్రను సొంతం చేసుకోవచ్చంటున్నారు నిపుణులు. చాలామంది కెరీర్ బిజీలో పడిపోయి వేళకు నిద్రపోవడం మర్చిపోతున్నారు. అయితే సుఖ నిద్ర కోసం రోజూ ఒక సమయం పెట్టుకుని ఆ సమయానికే నిద్రపోవడం, నిద్ర లేచే విషయంలోనూ సమయపాలన పాటించడం మంచిదంటున్నారు నిపుణులు. తద్వారా చక్కటి ఆరోగ్యాన్ని సొంతం చేసుకోవడంతో పాటు వయసునూ దాచేయచ్చంటున్నారు. చాలామంది పడుకునే ముందు గోరువెచ్చటి నీళ్లతో స్నానం చేస్తుంటారు. అయితే ఆ నీళ్లలో కొన్ని వేపాకులు వేసుకోవడం వల్ల ప్రశాంతంగా నిద్ర పడుతుందంటున్నారు నిపుణులు. వేపాకులు ఇన్ఫెక్షన్ల నుంచి రక్షణ కల్పించడంతో పాటు రోగనిరోధక శక్తినీ మెరుగుపరుస్తాయి.

అలాగే స్నానం చేసే నీటిలో కొన్ని ఎసెన్షియల్ ఆయిల్స్‌ను కలుపుకొంటే తాజాదనం సొంతమవుతుంది అంటున్నారు నిపుణులు. కొంతమంది గ్యాస్, పొట్ట ఉబ్బరం.. వంటి సమస్యలతో ఇబ్బందిపడుతుంటారు. దీనివల్ల వారు రాత్రి పూట సరిగా నిద్రపోలేరు. ఇలాంటి వారు అరికాళ్లకు నెయ్యితో మర్దన చేసుకుంటే ఫలితం ఉంటుంది. ఇలా చేయడం వల్ల నిద్రలేమి సమస్యను చాలావరకు తగ్గించుకోవచ్చని చెబుతున్నారు నిపుణులు. అలాగే అలసటగా, ఆందోళనగా ఉన్నప్పుడు కూడా ఈ పద్ధతి ద్వారా త్వరితగతిన ఉపశమనం పొందచ్చంటున్నారు. సుఖనిద్ర కోసం ఈ అలవాట్లతో పాటు కొన్ని జాగ్రత్తలు కూడా పాటించాలని సూచిస్తున్నారు నిపుణులు. రాత్రి భోజనానికి, నిద్ర పోవడానికి మధ్య కనీసం రెండు, మూడు గంటల సమయం ఉండేలా చూసుకోవాలి. నిద్ర పోవడానికి 60 నిమిషాల ముందు నుంచే గ్యాడ్జెట్లను పక్కన పెట్టేయాలి. నిద్రపోయే గదిలో సరైన వెంటిలేషన్ ఉండడంతో పాటు చీకటిగా ఉండేలా చూసుకోవాలి. అలా ఇష్టపడని వారు తక్కువ వెలుతురు వచ్చే లైట్ ఏర్పాటుచేసుకోవచ్చు. పడుకునే ముందు ధ్యానం చేయడమూ మంచిదే!

## కడుపుబ్బరం.. తగ్గాలంటే..!



కొన్ని రకాల పదార్థాలు తీసుకున్నప్పుడు కడుపుబ్బరంగా అనిపిస్తుంది. చాలా అసౌకర్యంగా ఉంటుంది. మలబద్ధకం, గ్యాస్ట్రిక్ సంబంధిత సమస్యలతో బాధపడుతున్నప్పుడు, కొన్నిసార్లు నెలసరి సమయంలో కూడా ఇలా అనిపించడం సహజం. అయితే కొన్ని జాగ్రత్తలు పాటించడం ద్వారా ఈ సమస్య నుంచి ఉపశమనం పొందచ్చంటున్నారు నిపుణులు. తక్కువ ఆహారం ఎక్కువసార్లు తినడం వల్ల కడుపుబ్బరం రాకుండా జాగ్రత్తపడచ్చంటున్నారు నిపుణులు. శరీరంలో సోడియం స్థాయిలు పెరిగినా, డీహైడ్రేషన్‌కి గురైనా, టీ–కాఫీలు ఎక్కువగా తాగినా కడుపుబ్బరం బారిన పడే అవకాశాలెక్కువట.

కాబట్టి తగినన్ని నీళ్లు తాగడం (గోరువెచ్చటి నీళ్లైతే మరీ మంచిది), వంటకాల్లో ఉప్పు తగ్గించడం మంచిదంటున్నారు నిపుణులు. కొన్ని రకాల శీతల పానీయాలు తాగినప్పుడు కూడా కడుపు ఉబ్బరానికి గురవుతుంది. కాబట్టి వీటికి ఎంత దూరంగా ఉంటే అంత మంచిది. ఒకవేళ తాగాలనిపిస్తే మితంగా తీసుకోవాలంటున్నారు. కొంతమంది పాస్తా, వైట్ బ్రెడ్ వంటివి తీసుకున్నప్పుడు కూడా కడుపుబ్బరానికి గురవుతుంటారు. కాబట్టి ఈ పదార్థాల్ని మితంగా తీసుకోవడం మంచిది అని సూచిస్తున్నారు నిపుణులు. స్మూతీస్, పండ్ల రసాలు తాగేటప్పుడు స్ట్రా ఉపయోగించకుండా.. నేరుగా గ్లాస్‌తోనే తాగడం మంచిదంటున్నారు నిపుణులు. తద్వారా గాలి కడుపులోకి చేరదు.. ఫలితంగా ఉబ్బరం రాకుండా జాగ్రత్తపడచ్చంటున్నారు. కడుపుబ్బరం నుంచి ఉపశమనం పొందడానికి ఈ చిట్కాలు కొంతవరకు ఉపయోగిస్తాయి. అయితే ఈ సమస్య ఎప్పుడో ఒకసారి కాకుండా పదే పదే తలెత్తితే మాత్రం అశ్రద్ధ చేయకుండా డాక్టర్‌ని సంప్రదించడం మంచిదని నిపుణులు చెబుతున్నారు. తద్వారా ఇతర అనారోగ్యాల బారిన పడే ప్రమాదం తప్పుతుందంటున్నారు.

## చల్లదనాన్ని అందిస్తాయి!



ఒత్తిడిని దూరం చేసుకోవడానికి చాలామంది కాఫీ, టీలను ఆశ్రయిస్తుంటారు. అయితే ఈ వేసవిలో వేడిమిని తరిమికొట్టి చల్లదనాన్ని అందించే టీలు కూడా కొన్నున్నాయంటున్నారు నిపుణులు. ముందుగా మరిగించి పెట్టుకున్న గ్రీన్ టీ మిశ్రమంలో స్ట్రాబెర్రీ ముక్కలు, తులసి ఆకులు వేసుకోవాలి.



ఈ నీళ్లు చల్లారాక వడకట్టుకొని గ్లాసుల్లోకి తీసుకొని రుచికి సరిపడా తేనె లేదా చక్కెర, ఐస్ ముక్కలు వేసి సర్వ్ చేసుకోవచ్చు. ఈ టీ మన శరీరానికి తక్షణ శక్తిని అందిస్తుందని చెబుతున్నారు నిపుణులు. ముందుగా మరిగించుకున్న నీటిలో గ్రీన్ టీ బ్యాగులు, పుదీనా ఆకులు వేసి చల్లారనివ్వాలి. ఆపై దీన్ని వడకట్టుకొని గ్లాసుల్లోకి తీసుకొని.. తేనె, నిమ్మరసం, ఐస్ ముక్కలు వేసి సర్వ్ చేసుకోవాలి. ఈ టీ చల్లదనాన్ని, మెదడుకు నూతనోత్సాహాన్ని అందిస్తుందంటున్నారు నిపుణులు.

## గంజి... ఆరోగ్య సంజీవని!

ఉడుకుతున్న బియ్యాన్ని వార్చగా వచ్చే గంజి అమృతం అంటే అతిశయం కాదు. గంజిలో చిటికెడు ఉప్పు వేసి తాగుతారు లేదా అన్నంలో కలిపి తింటారు. కానీ కుక్కర్లు వచ్చాక ఆ అలవాటు బాగా తగ్గిపోయింది. కానీ ఇది ఎంత మేలు చేస్తుందో తెలుసుకుంటే.. ఇక మీదట అన్నం వండివారుస్తారు. విటమిన్లు, ఖనిజాలతో గంజి పోషకాల గని. ఇది అనేక అనారోగ్యాలకు సంజీవని. అల్సర్లు, ఎసిడిటీతో బాధపడేవారికి ఉపశమనం కలిగిస్తుంది. నీళ్ల విరేచనాలు, కడుపునొప్పి, మలబద్ధకాలకు చక్కటి పరిష్కారం. గంజిలోని పిండిపదార్థం బైండింగ్ ఏజెంట్‌గా పనిచేస్తుంది.


శరీరం డీహైడ్రేట్ అవకుండా కాపాడుతుంది. అలసటను నివారిస్తుంది. చలవ చేస్తుంది. బరువు తగ్గాలనుకునే వారికి ఇది అద్భుతమైన ఎంపిక. గంజి తాగటం వల్ల శరీరానికి కావాల్సిన శక్తి లభిస్తుంది. ఇంకా తినాలనే తపన ఉండదు. క్యాలరీలు తక్కువగా ఉండటం వల్ల శరీరంలో కొవ్వు పెరగదు. వ్యాయామం చేసిన తర్వాత గంజి తీసుకోవడం మంచిది. మెదడు పనితీరు మెరుగుపడుతుంది. జ్ఞాపకశక్తి పెరుగుతుంది. రక్తపోటు అదుపులో ఉంటుంది. గుండె జబ్బులు వచ్చే అవకాశం తగ్గుతుంది. రోగనిరోధక శక్తి పెరుగుతుంది. ఇందులోని యాంటీ బ్యాక్టీరియల్ గుణాలు అనేక రకాల ఇన్ఫెక్షన్లు రాకుండా నివారిస్తాయి. శరీరంలోని వ్యర్థాలను బయటకు పంపడంలో తోడ్పడుతుంది. ప్రోబయాటిక్‌గా పనిచేస్తుంది. సాధారణ జ్వరాలను తగ్గించడంలో సాయపడుతుంది. చర్మాన్ని మృదువుగా ఆరోగ్యంగా ఉంచడంలో గంజిది కీలకపాత్ర. దీన్ని ఫేస్ మాస్క్‌గా వేసుకుంటే.. ముఖానికి నిగారింపు వస్తుంది. మొటిమల్ని నిరోధిస్తుంది.

చర్మం ముడతలు పడకుండా చేస్తుంది కాబట్టి వయసు మీదపడినట్లు అనిపించదు. నల్ల మచ్చలు దూరమవుతాయి. చర్మవ్యాధులు రావు.

ఒంట్లో వేడి తగ్గుతుంది. జుట్టు రాలడాన్ని అరికడుతుంది. గంజిని జుట్టుకు పట్టించడం వల్ల కుదుళ్లు బలపడతాయి. కురులు పొడుగ్గా, ఆరోగ్యంగా ఉండి పట్టులా మెరుస్తాయి. ఆకలి తగ్గినప్పుడు, అనారోగ్యంగా ఉన్నప్పుడు, కోలుకునే సమయంలో గంజి సహజ వైద్యంగా పనిచేస్తుంది. సులభంగా జీర్ణమవుతుంది. మన అమ్మమ్మల కాలంలో ఇది సాధారణ ఆహారం. ఆధునిక భోజన పద్ధతుల మధ్య గంజి తాగే అలవాటు బాగా తగ్గింది. దీన్ని మళ్లీ రోజువారీ ఆహారంలోకి తీసుకురావడం ఎంతో అవసరం. గంజితో పాటు నానబెట్టిన పెసలు, చిరుధాన్యాలు తింటే మరింత ఆరోగ్యదాయకం. అదనపు పోషకాలు తోడవుతాయి. రాత్రిపూట పెరుగు వేసి పులియబెడితే మంచి బ్యాక్టీరియా వృద్ధి చెందుతుంది. ఆ గంజిని ఉదయం తాగితే పేగు ఆరోగ్యానికి మేలు.



## మీరూ జెఫింగ్ చేస్తారా?




బరువు తగ్గాలని నిర్ణయించుకున్నప్పుడు చాలామందికి వచ్చే మొదటి ఆలోచన 'రన్నింగ్'. అయితే, గంటల తరబడి పరుగెత్తడం అందరికీ సాధ్యం కాకపోవచ్చు. అలసట, మోకాళ్ల నొప్పులు లేదా ఊపిరి అందకపోవడం వంటి సమస్యలు ఎదురవుతాయి. ఇలాంటి వారికి 'జెఫింగ్' చక్కటి మార్గం. ఒలింపిక్ రన్నర్ జెఫ్ గలోవే ప్రాచుర్యంలోకి తెచ్చిన ఈ పద్ధతి, ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా మహిళల ఫేవరెట్ ఫిట్‌నెస్ మంత్రంగా మారింది. ఏంటీ జెఫింగ్... రన్నింగ్–వాకింగ్‌ల సమ్మేళనమే ఈ జెఫింగ్. ఒకే వేగంతో పరుగెత్తకుండా, నిర్ణీత సమయం పాటు జాగింగ్ చేస్తూ, ఆ తర్వాత అలసట రాకముందే కాసేపు బ్రిస్క్ వాకింగ్ (వేగంగా నడవడం) చేయడాన్ని జెఫింగ్ అంటారు. ఉదాహరణకు... 2 నిమిషాలు పరుగెత్తడం, 1 నిమిషం నడవడం. ఇలా మళ్లీ మళ్లీ చేయడం వల్ల శరీరంపై ఒత్తిడి తగ్గుతుంది. ప్రయోజనాలెన్నో... జెఫింగ్‌లో మధ్యలో వచ్చే 'వాకింగ్ బ్రేక్స్' కీళ్లకు ఉపశమనాన్ని ఇస్తాయి. పైగా సాధారణ నడకతో పోలిస్తే, జెఫింగ్ వల్ల గుండె స్పందన రేటు పెరుగుతుంది. దీనివల్ల తక్కువ సమయంలోనే ఎక్కువ కెలొరీలు ఖర్చవుతాయి, ఫలితంగా బరువు వేగంగా తగ్గుతారు. ఒక్కసారిగా కిలోమీటర్ల కొద్దీ పరుగెత్తలేము. కానీ జెఫింగ్ ద్వారా మెల్లమెల్లగా మీ ఊపిరితిత్తుల సామర్థ్యాన్ని, శరీర సత్తువను పెంచుకోవచ్చు. నడకకు రన్నింగ్ తోడవ్వడం వల్ల 'ఎండార్ఫిన్లు' విడుదలై మానసిక ఒత్తిడి తగ్గుతుంది.

## నోరు ఆరోగ్యంగా ఉండాలంటే..!



ఆయిల్ పుల్లింగ్ ప్రక్రియ ద్వారా బోలెడన్ని ప్రయోజనాలు చేకూరతాయంటున్నారు నిపుణులు. ఈ క్రమంలో మన వంటింట్లో ఉండే కొన్ని రకాల నూనెలతో నోటిని పుక్కిలించడం వల్ల నోరు శుభ్రపడడమే కాదు.. ఇతర ఆరోగ్య ప్రయోజనాలూ చేకూరతాయని వారు సూచిస్తున్నారు. మన నోట్లో వందల సంఖ్యలో సూక్ష్మక్రిములు ఉంటాయట. అందులో కొన్ని హానికరమైనవి కూడా ఉంటాయి. అవి పంటి నొప్పి, చిగుళ్లకు సంబంధించిన వ్యాధులు, నోటి దుర్వాసనకు కారణమవుతాయి. అయితే ఆయిల్ పుల్లింగ్ ప్రక్రియ ఇలాంటి బ్యాక్టీరియాను తొలగించగలదని కొన్ని అధ్యయనాల్లో వెల్లడైంది. నోటిని చక్కగా శుభ్రపరచుకోకపోవడం, నోటి ఇన్ఫెక్షన్లు, చిగుళ్లలో సమస్యల వల్ల నోటి దుర్వాసన రావడం కామన్. అయితే ఈ సమస్య నుంచి బయటపడాలంటే మన వంటింట్లో ఉండే కొన్ని నూనెలు సమర్థంగా పని చేస్తాయంటున్నారు నిపుణులు. చక్కెర, చక్కెర సంబంధిత పదార్థాలు అధికంగా తీసుకోవడం, దంతాల మధ్య చిక్కుకున్న పదార్థాల అవశేషాలను తొలగించుకోకపోవడం వల్ల పళ్లు పుచ్చిపోవడం మనం గమనిస్తూనే ఉంటాం. ఇలాంటి సమస్య రాకుండా ఉండేందుకు ఆయిల్ పుల్లింగ్ మంచి చిట్కా అంటున్నారు నిపుణులు. రోజూ ఉదయాన్నే బ్రష్ చేసుకున్న తర్వాత ఆయిల్ పుల్లింగ్ చేయడం వల్ల చెడు బ్యాక్టీరియా నశించే అవకాశం ఉంటుందట. ఈ ప్రక్రియ ద్వారా దవడ, మెడ కండరాలకు చక్కటి వ్యాయామం కూడా అందుతుందంటున్నారు నిపుణులు. నోటి ఆరోగ్యానికి దోహదం చేసే ఆయిల్ పుల్లింగ్ ప్రక్రియను పాటించడానికీ ఓ పద్ధతుందంటున్నారు దంత వైద్య నిపుణులు. ఈక్రమంలో ముచ్చటగా ఈ మూడు చిట్కాల్ని పాటించాలని సూచిస్తున్నారు. ఆయిల్ పుల్లింగ్‌కి కొబ్బరి / ఆలివ్ / నువ్వుల నూనెలు చక్కటి ఎంపిక. వీటిలో ఏదో ఒక దాన్ని ఎంచుకొని టేబుల్‌స్పూన్ నూనెను నోట్లోకి తీసుకోవాలి. ఆపై 15 నుంచి ఇరవై నిమిషాల పాటు ఆ నూనె నోట్లోని మూలమూలలకు వెళ్లేలా పుక్కిలిస్తూ ఉండాలి. ఈ క్రమంలో దీన్ని మింగకుండా జాగ్రత్తపడాలి. పని పూర్తయ్యాక ఉమ్మివేయాలి. ఇక ఏదైనా తినేముందు లేదా తాగే ముందు నోటిని శుభ్రపరచుకొని ఆ తర్వాత ఆహారం తీసుకోవడం మంచిది. అలాగే ఆహారం తీసుకున్న తర్వాత సైతం నోటిని శుభ్రపరచుకోవాలి అని సూచిస్తున్నారు నిపుణులు.

## చాట్‌జీపీటీకి మూడేళ్లలోనే 1 బిలియన్ మంత్లీ యూజర్లు




ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సంచలనం ఓపెన్ ఏఐకు చెందిన చాట్‌జీపీటీ యాప్ అరుదైన మైలురాయిని చేరుకుంది. మే నెల నాటికి 1 బిలియన్ నెలవారీయూజర్ల మార్కును దాటినట్లు మార్కెట్ ఇంటెలిజెన్స్ కంపెనీ సెన్సార్ టవర్ వెల్లడించింది. యాప్ లాంచ్ చేసిన మూడేళ్లలోనే ఈ ఘనత సాధించిన ప్రపంచంలోనే తొలి ఏఐయాప్‌గా చాట్‌జీపీటీ అవతరించింది. 1బిలియన్ నెలవారీ యూజర్ల మార్క్ దాటడానికి సోషల్ మీడియా ప్లాట్‌ఫాం టిక్‌టాక్‌కు 5ఏళ్లు, ఇన్‌స్టాగ్రామ్‌కు దాదాపు 8ఏళ్లు పట్టింది.

# బిజినెస్

## 'బంగారాన్ని ఆర్‌బీఐ విక్రయించలేదు'.. నివేదికను ఖండించిన కేంద్రం



రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (RBI) పెద్దఎత్తున బంగారం విక్రయించినట్లు వచ్చిన వార్తలను కేంద్ర ప్రభుత్వం ఖండించింది. ఫారెక్స్ నిల్వలు కాపాడుకోవడానికి ఆర్‌బీఐ పసిడిని విక్రయించిందంటూ వచ్చిన బ్లూమ్‌బర్గ్ కథనాన్ని తోసిపుచ్చింది. పసిడి విక్రయం గురించి వచ్చిన వార్తలు పూర్తి అవాస్తవమని పేర్కొంది. ఈ మేరకు పీఐబీ ఫ్యాక్ట్‌చెక్ విభాగం ఎక్స్ వేదికగా ఓ పోస్ట్ పెట్టింది. పశ్చిమాసియా సంక్షోభం వల్ల మన ఇంధన దిగుమతుల బిల్లు భారీగా పెరిగింది. మన ఈక్విటీలను విదేశీ మదుపర్లు విక్రయించి, పెట్టుబడులు పట్టుకెళ్లిపోతున్నారు. ఈ కారణాల వల్ల అమెరికా డాలర్‌కు గిరాకీ బాగా పెరిగింది. ఫలితంగా రూపాయి విలువ తగ్గిపోతోంది. దీంతో మన విదేశీ మారకపు ద్రవ్యం (ఫారెక్స్) నిల్వలు పడిపోతున్నాయి. ఈ నేపథ్యంలో దీన్ని కాపాడుకునేందుకు ఆర్‌బీఐ 12 బిలియన్ డాలర్ల విలువైన పసిడిని విక్రయించినట్లు వార్తాసంస్థ బ్లూమ్‌బెర్గ్ తెలిపింది. ఈ వార్తను కేంద్ర ప్రభుత్వం ఖండించింది. ఆర్‌బీఐ వద్ద ఉన్న ఫారెక్స్ నిల్వల్లో బంగారం వాటా 2025లో 13.92 శాతంగా ఉండగా.. 2026 మార్చి 31 నాటికి 16.70 శాతానికి పెరిగినట్లు వెల్లడించింది. మే 22 నాటికి ఆ మొత్తం 16.85 శాతానికి పెరిగిందని ఆర్‌బీఐ గణాంకాలను ఉదహరించింది. ఆర్‌బీఐ తన వద్ద ఫిజికల్ గోల్డ్ వివరాలను ఎప్పటికప్పుడు నెలవారీ బులెటిన్‌లో వెల్లడిస్తోందని పేర్కొంది. ఈ తేదీ వరకు అందులో ఎలాంటి మార్పు లేదని స్పష్టం చేసింది. కాబట్టి తప్పుడు సమాచారం నమ్మొద్దని సూచించింది. అధికారిక సమాచారం కోసం ఆర్‌బీఐ అధికారిక వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించింది.

## ఏటీఎఫ్ రేట్ల పై కేంద్రం కీలక నిర్ణయం

పశ్చిమాసియా సంక్షోభం కారణంగా అంతర్జాతీయంగా పెరిగిన చమురు ధరలతో తీవ్ర సమస్యలు ఎదుర్కొంటున్న విమానయాన సంస్థలకు రక్షణ కల్పించేందుకు కేంద్రం కీలక నిర్ణయం తీసుకుంది. విమాన ఇంధన ధరల స్థిరీకరణ నిధికి రూ.10,000 కోట్ల నిధులను కేంద్ర క్యాబినెట్ కేటాయించినట్లు కేంద్రమంత్రి అశ్వినీ వైష్ణవ్ వెల్లడించారు. దీంతో విమానయాన సంస్థలపై భారం తగ్గే అవకాశం ఉందన్నారు. పశ్చిమాసియా సంఘర్షణ కారణంగా విమాన టర్బైన్ ఇంధన (ATF) ధరలు 2.5 రెట్లు పెరిగాయని పేర్కొన్నారు. మార్చి 2026లో లీటరుకు రూ. 60.5గా ఉన్న ఇంధన ధర మే 2026 నాటికి లీటరుకు రూ.142కు చేరిందన్నారు. ధరల పెరుగుదలతో విమానయాన సంస్థలు, ఆయిల్ సంస్థలపై తీవ్ర ప్రభావం పడిందని పేర్కొన్నారు. దేశీయ కార్యకలాపాల కోసం విమాన టర్బైన్ ఇంధనం ధరను కేంద్రం లీటరుకు రూ.75.6గా స్థిరీకరించినట్లు అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. ఏటీఎఫ్ ధరల స్థిరీకరణతో విమాన కార్యకలాపాలకు అంతరాయం ఉండదన్నారు. కేంద్రం తీసుకున్న ఈ నిర్ణయం ఏవియేషన్ ఎకో సిస్టమ్‌పై ఆధారపడిన 77లక్షల ఉద్యోగులకు రక్షణ కల్పిస్తుందని పేర్కొన్నారు. పెరిగిన ఛార్జీల నుంచి విమాన ప్రయాణికులకు ఉపశమనం కలిగిస్తుందన్నారు. దేశ రాజధాని దిల్లీలోని పాత ట్రక్కులు, బస్సులు తీసివేయాలని కేంద్ర క్యాబినెట్ నిర్ణయం తీసుకుంది. పాత బస్సుల స్థానంలో బీఎస్-6, ఈవీ వాహనాలను తీసుకురావడానికి చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొంది. కొత్త వాహనాల కోసం రూ.5,041 కోట్ల నిధుల విడుదలకు ఆమోదం తెలిపింది.



## నష్టాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్..



దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు నేడు నష్టాల్లో ముగిశాయి. అమెరికా– ఇరాన్ మధ్య శాంతి ఒప్పందంపై అనిశ్చితి, ఎఫ్ఐఐల వరుస విక్రయాలు మదుపర్ల సెంటిమెంట్‌ను దెబ్బతీశాయి. ముఖ్యంగా ఐటీ స్టాక్స్‌లో అమ్మకాల ఒత్తిడి సూచీలను పడేసింది. టీసీఎస్ దాదాపు 9 శాతం మేర నష్టపోయింది. సెన్సెక్స్ ఉదయం 74,507.73 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 74,649.84) నష్టాల్లో ప్రారంభమైంది. ఇంట్రాడేలో 73,492.60 పాయింట్ల వద్ద కనిష్ఠాన్ని తాకిన సూచీ.. చివరికి 303.67 పాయింట్ల నష్టంతో 74,346.17 వద్ద ముగిసింది. నిఫ్టీ సైతం 77.95 పాయింట్ల నష్టంతో 23,405.60 వద్ద స్థిరపడింది. డాలరుతో రూపాయి మారకం విలువ 95.71గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో టీసీఎస్, టెక్ మహీంద్రా, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, ఇన్ఫోసిస్, ఐటీసీ షేర్లు ప్రధానంగా నష్టపోయాయి. ఇండిగో, ఎస్‌బీఐ, ఐసీఐసీఐ బ్యాంక్, ట్రెంట్, పవర్‌గ్రిడ్ కార్పొరేషన్ షేర్లు లాభపడ్డాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 98 డాలర్ల వద్ద కొనాగుతుండగా.. బంగారం ఔన్సు 4,461 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. ఐటీ దిగ్గజం టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ షేర్లు నేటి ట్రేడింగ్ సెషన్‌లో భారీగా పతనమయ్యాయి. కొవిడ్ మహమ్మారి తర్వాత టీసీఎస్‌కు ఇదే అత్యంత భారీ నష్టం.

## విప్రో ఛైర్మన్ కంటే.. సీఈఓకే ఎక్కువ ఆదాయం




ప్రముఖ టెక్ సంస్థ విప్రో సీఈఓ, మేనేజింగ్ డైరెక్టర్ శ్రీనివాస్ పల్లియా.. 2025-26 ఆర్థిక సంవత్సరానికి గానూ రూ.49.6 కోట్ల వేతన రెమ్యునరేషన్‌ను అందుకున్నారు. ఈ మేరకు కంపెనీ వార్షిక నివేదిక వెల్లడించింది. గత ఆర్థిక సంవత్సరంలో ఆయన రూ.53.6కోట్లప్యాకేజీని అందుకోగా ఈ ఏడాది ఆ మొత్తం కాస్త తగ్గింది. పనితీరు ఆధారిత పరిహారంలో కోత విధించడం వల్లే ఈ రెమ్యునరేషన్ తగ్గినట్లు విప్రో వెల్లడించింది. అయినప్పటికీ విప్రోలో అత్యధిక వేతనం పొందిన ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ శ్రీనివాస్ పల్లియానే అని కంపెనీ పేర్కొంది. సంస్థ ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్ రిషద్ ప్రేమ్‌జీతో పోలిస్తే.. సీఈఓ ఆదాయం దాదాపు 7రెట్లు ఎక్కువ ఉండడం విశేషం. 2025-26 ఆర్థిక సంవత్సరానికి గానూ.. రిషద్ ప్రేమ్‌జీ రూ.7.3 కోట్ల వేతన ప్యాకేజీని అందుకున్నారు. అంతకుముందు ఆర్థిక సంవత్సరంలో ఆయన వేతనం రూ.13.8 కోట్లుగా ఉండటం గమనార్హం.

## ఓఎస్ యుగం ముగిసింది.. : సత్య నాదెళ్ల




ప్రపంచమంతా ఏఐ నామస్మరణ వినిపిస్తున్న నేపథ్యంలో మైక్రోసాఫ్ట్ సీఈఓ సత్యనాదెళ్ల కీలక వ్యాఖ్యలు చేశారు. ఇక ఆపరేటింగ్ సిస్టమ్స్, యాప్స్ యుగం ముగిసిందని అన్నారు. ఈ సరికొత్త కంప్యూటింగ్ విప్లవంలో 'ఏజెంట్స్' సమయం మొదలైందని వ్యాఖ్యానించారు. ప్రజలకు, కంప్యూటర్లకు మధ్య ఏఐ ఏజెంట్లు ప్రైమరీ ఇంటర్‌ఫేస్‌గా మారే ప్రపంచం వైపు మైక్రోసాఫ్ట్ పయనిస్తోందని పేర్కొన్నారు. కంపెనీ నిర్వహించిన బిల్డ్ 2026 డెవలపర్ కాన్ఫరెన్స్‌లో నాదెళ్ల ఈ మేరకు మాట్లాడారు. మైక్రోసాఫ్ట్, క్వాల్‌కామ్ భాగస్వామ్యంలో న్యూ చిప్ టు క్లౌడ్ ప్లాట్‌ఫామ్ అయిన ప్రాజెక్ట్ సొలారాను ఆవిష్కరించిన సమయంలో నాదెళ్ల మాట్లాడారు. యాప్‌లో పొందుపరిచిన అసిస్టెంట్ల స్థాయిని దాటి ఏఐ ఏజెంట్లు అభివృద్ధి చెందుతున్నాయని, భవిష్యత్ కంప్యూటర్ల నిర్మాణం, వినియోగాన్ని కొత్తగా నిర్వచిస్తాయని మైక్రోసాఫ్ట్ చెప్తోంది. ప్రజలు సాంకేతికతతో అనుసంధానమయ్యే విషయంలో ఏఐ ఏజెంట్లు కీలకంగా మారతాయని ఈ సంస్థ విశ్వసిస్తోంది. దాని ఆధారంగానే ప్రాజెక్ట్ సొలారాను తీర్చిదిద్దుతున్నారు. ప్రస్తుతం యూజర్లు ఒక్కొక్క యాప్ తెరిచి, స్వయంగా ఆపరేట్ చేసుకోవాలి. ఇక నుంచి వారి తరఫున ఏఐ ఏజెంట్లే ఆ పని చేసిపెడతాయని ప్రాజెక్ట్ రూపకర్తలు చెప్తున్నారు. అంతేకాదు, భవిష్యత్తు కేవలం ఒక ఏఐ అసిస్టెంట్‌కే పరిమితం కాదని మైక్రోసాఫ్ట్ చెప్తోంది. అందుకే ఒక ఓపెన్, మల్టీ ఏజెంట్ ప్రపంచం కోసం సొలారాను నిర్మిస్తోంది. ఒక నిర్దిష్టమైన పనిని ఏ ఏజెంట్ నిర్వహించాలో నిర్ణయించేందుకు, అలా ప్రత్యేకించిన ఏజెంట్లను సమన్వయం చేసేందుకు ఈ సంస్థ ఏజెంట్ డిస్పాచర్, ఏజెంట్ టాస్క్ మేనేజర్ వంటి సాంకేతికతలను అభివృద్ధి చేస్తోంది. మొత్తంగా ఈ సొలారా ఏఐ ప్లాట్‌ఫామ్.. ఏఐ ఏజెంట్లతో నేరుగా పనిచేయించుకునేందుకు తయారవుతున్న ప్రత్యేకమైన ఆపరేటింగ్ సిస్టమ్.

# క్రీడలు

## టీమ్ఇండియా స్పిన్ కోచ్‌గా బహుతులె



టీమ్ఇండియా మాజీ లెగ్ స్పిన్నర్ సాయిరాజ్ బహుతులె భారత క్రికెట్ జట్టుకు స్పిన్ కోచ్‌గా నియమితుడయ్యాడు. గతంలో అండర్-19, ఇండియా-ఎ జట్లతో కలిసి పనిచేసిన అతడికి బీసీసీఐ.. సీనియర్ జట్టు బాధ్యతలు అప్పగించింది. 53 ఏళ్ల బహుతులె ఫస్ట్‌క్లాస్ క్రికెట్లో 630 వికెట్లు పడగొట్టాడు. 6176 పరుగులు కూడా చేశాడు. బహుతులె రెండు టెస్టుల్లో, 8 వన్డేల్లో భారత జట్టుకు ప్రాతినిధ్యం వహించాడు. క్రికెట్‌కు వీడ్కోలు పలికిన తర్వాత అతడు విదర్భ, కేరళ, గుజరాత్ జట్లకు ప్రధాన కోచ్‌గా.. ఐపీఎల్‌లో రాజస్థాన్ రాయల్స్, పంజాబ్ కింగ్స్‌కు స్పిన్ సలహాదారుగా వ్యవహరించాడు. 2021 నుంచి 2024 వరకు బీసీసీఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో విధులు నిర్వర్తించాడు.

## ముంబయి టీ20 లీగ్.. బ్యాటింగ్‌లో సూర్యకుమార్, శ్రేయస్ విఫలం

కొంతకాలంగా పరుగులు చేయడంలో ఇబ్బందిపడుతున్న టీమ్ఇండియా టీ20 జట్టు కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ ఫామ్‌లేమి కష్టాలు ఇంకా కొనసాగుతున్నాయి. ముంబయి టీ20 లీగ్‌లో ట్రియంఫ్స్ నైట్స్ ఎంఎన్‌ఈ తరపున బరిలోకి దిగిన సూర్యకుమార్ యాదవ్.. నార్త్ ముంబయి పాంథర్స్‌తో మంగళవారం జరిగిన మ్యాచ్‌లో సూర్య బ్యాటింగ్‌లో విఫలమయ్యాడు. తనకు లభించిన చక్కటి ఆరంభాన్ని భారీ స్కోర్‌గా మలచలేకపోయాడు. సూర్య 11 బంతుల్లో నాలుగు ఫోర్లతో 19 పరుగులు చేసి పెవిలియన్‌కు చేరాడు. అతడు రాహుల్ సావంత్ బౌలింగ్‌లో వైభవ్ మాలి చేతికి చిక్కాడు. ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్‌కు దిగిన నార్త్ ముంబయి పాంథర్స్ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 209 పరుగులు చేసింది. అనంతరం ఛేదనలో ట్రియంఫ్స్ నైట్స్ ఎంఎన్‌ఈ 20 ఓవర్లకు 8 వికెట్లు నష్టపోయి 188 పరుగులు మాత్రమే చేసింది. దీంతో నార్త్ ముంబయి జట్టు 21 పరుగుల తేడాతో విజయం సాధించింది. ఈ టోర్నీలో భాగంగా.. ముంబయి ఫాల్కన్స్‌కు కెప్టెన్‌గా వ్యవహరిస్తున్న శ్రేయస్ అయ్యర్ ఏఆర్‌సీఎస్ అంధేరీతో జరిగిన మ్యాచ్‌లో కేవలం అయిదు పరుగులు మాత్రమే చేశాడు. అతడి వికెట్‌ను అంధేరీ కెప్టెన్ శివమ్ దూబె తన ఖాతాలో వేసుకున్నాడు. ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్‌కు దిగిన ముంబయి ఫాల్కన్స్ జట్టు 18.2 ఓవర్లలో 126 పరుగులకు ఆలౌటైంది. అనంతరం ఛేదనలో అంధేరీ జట్టు కేవలం 14 ఓవర్లలోనే 5 వికెట్లు నష్టపోయి లక్ష్యాన్ని ఛేదించింది.



## ఇండోనేసియా ఓపెన్ బ్యాడ్మింటన్.. సింధు శుభారంభం



ఇండోనేసియా ఓపెన్ సూపర్ 1000 బ్యాడ్మింటన్ టోర్నమెంట్లో భారత స్టార్ పి.వి.సింధు శుభారంభం చేసింది. మంగళవారం మహిళల సింగిల్స్ తొలి రౌండ్లో ఆమె 25-23, 21-16తో బుసానన్ (థాయ్‌లాండ్)ను ఓడించింది. తొలి గేమ్‌లో ప్రత్యర్థి నుంచి సింధుకు గట్టిపోటీ ఎదురైంది. ఒక దశలో 23-23తో స్కోర్లు సమమయ్యాయి. కానీ కీలక సమయంలో ఒత్తిడికి నిలుస్తూ రెండు పాయింట్లు దక్కించుకున్న సింధు తొలి గేమ్‌ను గెలుచుకుంది. రెండో గేమ్‌లో సింధు దూకుడుగా ఆడింది. తేలిగ్గా గేమ్‌తో పాటు మ్యాచ్‌ను సొంతం చేసుకుంది. రెండో రౌండ్లో ఆన్ సియాంగ్ (కొరియా)తో సింధు తలపడనుంది. గత తొమ్మిది మ్యాచ్‌ల్లో సియాంగ్‌పై భారత షట్లర్ గెలవలేదు. మరో మ్యాచ్‌లో మాళవిక బన్సోద్ 12-21, 10-21తో పోర్న్‌పావి (థాయ్‌లాండ్) చేతిలో ఓడింది. పురుషుల సింగిల్స్‌లో లక్ష్యసేన్, కిదాంబి శ్రీకాంత్ కథ తొలి రౌండ్లోనే ముగిసింది. లక్ష్యసేన్ 19-21, 16-21తో ఫర్హాన్ (ఇండోనేషియా) చేతిలో ఓడగా.. శ్రీకాంత్ 19-21, 15-21తో యుషి తనాక (జపాన్)కు తలొంచాడు. పురుషుల డబుల్స్‌లో హరిహరన్-ఎంఆర్ అర్జున్ జంట రెండో రౌండ్ చేరింది. తొలి రౌండ్లో ఈ జోడీ 21-18, 21-10తో నూర్ మహ్మద్-టాన్ వీ (మలేసియా) జంటను ఓడించింది. మహిళల డబుల్స్ తొలి రౌండ్లో పుల్లెల గాయత్రి-ట్రీసా జంట 14-21, 12-21తో కుసుమ-త్రియాస్ (ఇండోనేసియా) జోడీ చేతిలో ఓడింది. మిక్స్‌డ్ డబుల్స్‌లో ధ్రువ్ కపిల-తనీషా క్రాస్టో ద్వయం 11-21, 10-21తో చెన్-గువో గ్జిన్ (చైనా)కు తలొంచింది.

## వైభవ్ కావాలా..రెండు కోట్లివ్వాలి

ఈ ఐపీఎల్‌లో వైభవ్ సూర్య వంశీ విధ్వంసక బ్యాటింగ్ విన్యాసాల గురించి ఎంత చెప్పినా తక్కువే. మహా మహా బ్యాటర్లను వెనక్కి నెట్టి అత్యధిక పరుగుల వీరుడిగా నిలిచాడీ 15 ఏళ్ల కుర్రాడు. ఇప్పుడ తను ఐపీఎల్ వేలంలోకి వస్తే రూ.20 కోట్లకు తక్కువ రేటు పలకదనే అంచనాలున్నాయి. ఒక్క ఐపీఎల్ సీజన్‌తో భారత క్రికెట్ సూపర్‌స్టార్‌గా ఎదిగిన వైభవ్‌తో తమ బ్రాండ్లను ప్రచారం చేయించుకోవడాకి కంపెనీలు కూడా బాగానే ఉత్సాహం చూపుతున్నట్లు సమాచారం. అయితే అతడితో ఒక ఒప్పందం చేసుకోవాలంటే రూ.2 కోట్ల దాకా చెల్లించాల్సిందేనట. గత ఐపీఎల్‌లో మెరుపు సెంచరీకి తోడు అండర్-19 జట్టు తరపునా కొన్ని విధ్వంసక ఇన్నింగ్స్‌లు ఆడడంతో గత ఏడాదే కొన్ని సంస్థలతో అతడికి ఒప్పందాలు జరిగాయి. కాంప్లాన్, రెడ్‌బుల్ లాంటి బ్రాండ్ల ప్రచారం కోసం అతను కోటి చొప్పున పారితోషికం తీసుకున్నాడు. ఇప్పుడు అతను ఒక్కో బ్రాండు కోసం రూ.1.5-2 కోట్ల మధ్య డిమాండ్ చేస్తున్నట్లు సమాచారం. ప్రస్తుతానికి వైభవ్ తండ్రే తన వాణిజ్య వ్యవహారాలు చూస్తున్నాడు. అతడికి వైభవ్ ఐపీఎల్‌లో ప్రాతినిధ్యం వహించే రాజస్థాన్ రాయల్స్ సిబ్బంది సహకారం అందిస్తున్నారు. వచ్చే ఐపీఎల్ సమయానికి అతను సొంతంగా మేనేజ్మెంట్ టీమ్‌ను ఏర్పాటు చేసుకునే అవకాశాలున్నాయి.



## ఆ మ్యాచ్‌కే కాకుండా టోర్నీ మొత్తానికి హైప్ తీసుకురండి: మంధాన



మహిళల టీ20 ప్రపంచ కప్ జూన్ 12 నుంచి మొదలుకానుంది. జూన్ 14న బర్మింగ్‌హామ్‌లో భారత్, పాకిస్థాన్ తలపడనున్నాయి. ఈ మ్యాచ్‌పై క్రికెట్ ఫ్యాన్స్‌లో ఆసక్తి నెలకొంది. ఈనేపథ్యంలో భారత జట్టు వైస్ కెప్టెన్ స్మృతి మంధాన అభిమానులు, మీడియాకు ఓ విజ్ఞప్తి చేసింది. కేవలం భారత్, పాక్ మ్యాచ్‌కే హైప్ క్రియేట్ చేయొద్దని, టోర్నీ మొత్తానికి ఆదరణ వచ్చేలా ప్రచారం చేయాలని కోరింది. "2022 కామన్వెల్త్ గేమ్స్‌లో బర్మింగ్‌హామ్‌లో భారత్, పాక్ తలపడ్డాయి. ఆ మ్యాచ్ టిక్కెట్లన్నీ అమ్ముడయ్యాయి. కేవలం భారత్-పాకిస్థాన్ మ్యాచ్ గురించే కాకుండా మనం టీ20 ప్రపంచ కప్‌నకు కూడా మరింత ప్రచారం కల్పించాలని ఆశిస్తున్నాను. కేవలం ఒక మ్యాచ్‌కే మనం ప్రచారం కల్పించాల్సిన అవసరం లేదు. దానికి ఇప్పటికే చాలా ప్రచారం జరిగింది. అభిమానులు మద్దతు ఇస్తారని ఆశిస్తున్నా. వారి కోసం మేం మంచి ప్రదర్శన ఇవ్వగలమనే నమ్మకం ఉంది" అని మంధాన పేర్కొంది. టీ20 వరల్డ్ కప్‌లో గ్రూప్-ఎలో ఉన్న భారత్ లీగ్ దశలో తొలి మ్యాచ్ పాకిస్థాన్‌తో (జూన్ 14న) ఆడనుంది. 17న నెదర్లాండ్స్, 21న సౌతాఫ్రికా, 25న బంగ్లాదేశ్, 28న ఆస్ట్రేలియాతో టీమ్ఇండియా తలపడనుంది. ఇక, భారత జట్టు విషయానికొస్తే.. ఇటీవల ఇంగ్లాండ్‌తో జరిగిన మూడు టీ20ల సిరీస్‌లో తొలిమ్యాచ్‌లో టీమ్ఇండియా నెగ్గింది. తర్వాత రెండు మ్యాచ్‌ల్లో ఓటమిపాలై సిరీస్‌ను చేజార్చుకుంది.

# వుదయం సినిమా

MOVIE TIME!

## రైట్ ఇన్ టైమ్.. 'పెద్ది' బాక్సాఫీస్ బ్యాటింగ్ స్టార్ట్!



**వుదయం సినిమా** మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ కథానాయకుడిగా నటించిన మోస్ట్ అవేటెడ్ మూవీ 'పెద్ది' ప్రపంచవ్యాప్తంగా గురువారం (జూన్ 4) గ్రాండ్‌గా విడుదల కానుంది. ఈ నేపథ్యంలో బుధవారం రాత్రి నుంచే ఓవర్సీస్, పలు ప్రాంతాల్లో ప్రీమియర్ షోలతో థియేటర్ల వద్ద హడావుడి మొదలైంది. థియేటర్లకు భారీగా తరలివస్తున్న అభిమానుల కోలాహలంతో పండగ వాతావరణం నెలకొంది. మరోవైపు, ఈ ప్రతిష్ఠాత్మక చిత్రంపై చిత్ర పరిశ్రమలోనూ భారీ అంచనాలు నెలకొన్నాయి. 'పెద్ది' చిత్రం ఘనవిజయం సాధించాలని ఆకాంక్షిస్తూ పలువురు సినీ ప్రముఖులు, దర్శకులు, నటీనటులు సోషల్ మీడియా వేదికగా చిత్రబృందానికి శుభాకాంక్షలు తెలుపుతున్నారు. సినిమా రికార్డుల వేట సాగించడం ఖాయమంటూ పరిశ్రమ వర్గాలు అంచనా వేస్తున్నాయి.




## 'ఇరుముడి' నుంచి 'ది హార్ట్ ఆఫ్ ఇరుముడి' గ్లింప్స్ రిలీజ్

**వుదయం సినిమా:** మాస్ మహారాజా రవితేజ 'ఇరుముడి' చిత్రంతో ప్రేక్షకులని ఆశ్చర్యపరచడానికి సిద్ధంగా ఉన్నారు. శివ నిర్వాణ దర్శకత్వంలో మైత్రి మూవీ మేకర్స్ నిర్మిస్తున్న 'ఇరుముడి' చిత్రం ఇప్పటికే ప్రేక్షకుల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది. కమర్షియల్ యాక్షన్‌కు భావోద్వేగాలను జోడిస్తూ రూపొందుతున్న ఈ చిత్రానికి సంబంధించిన 'ది హార్ట్ ఆఫ్ ఇరుముడి' గ్లింప్స్‌ను తాజాగా విడుదల చేశారు.'ది హార్ట్ ఆఫ్ ఇరుముడి' గ్లింప్స్‌లో ఒక కామన్ మ్యాన్ ప్రపంచాన్ని ఆకట్టుకునేలా చూపించారు. తన కూతురే అతని ప్రపంచం. ఆమె ఆనందం కోసం తీసుకునే నిర్ణయాలే అతని జీవితాన్ని నడిపిస్తాయి. తండ్రీ–కూతుళ్ల మధ్య ఉన్న అనుబంధాన్ని ఎంతో సహజంగా, హృదయానికి హత్తుకునేలా ఈ గ్లింప్స్‌లో ఆవిష్కరించారు.ఈ గ్లింప్స్‌లో మరో ప్రత్యేక ఆకర్షణ రవితేజ పాత్రలో కనిపించే ట్రాన్స్ఫర్మేషన్. అయ్యప్ప దీక్ష స్వీకరించిన తర్వాత ఆయన పాత్రలో చోటుచేసుకునే మార్పు ఎంతో హృద్యంగా చూపించారు. అది కేవలం ఒక త్యాగంలా కాకుండా, తన కూతురిపై ప్రేమతో, భక్తితో తీసుకున్న నిర్ణయంగా కనిపిస్తుంది. చివర్లో కనిపించే ఇరుముడి విజువల్స్ భావోద్వేగాన్ని మరింత పెంచి ప్రేక్షకుల మనసులను తాకాయి.శివ నిర్వాణ మరోసారి తన బలమైన ఎమోషనల్ స్టోరీటెల్లింగ్‌తో ఆకట్టుకున్నారు. సహజమైన భావోద్వేగాలతో తండ్రీ–కూతుళ్ల బంధాన్ని కథకు ప్రధాన బలంగా మలిచారు.



## 19న గ్రాండ్‌గా రిలీజ్ కాబోతోన్న 'వంద దేవుళ్ళు'

**వుదయం సినిమా:** విజయ్ ఆంటోని చిత్రాలకు తెలుగులో ఉండే క్రేజ్ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదు. ఎప్పుడూ డిఫరెంట్ కంటెంట్, భిన్న ప్రాజెక్టులతో ప్రేక్షకుల్ని మెప్పిస్తూనే ఉంటారు. 'బిచ్చగాడు'తో హీరోగా విజయ్ ఆంటోని, దర్శకుడిగా శశికి వచ్చిన ఫాలోయింగ్ అందరికీ తెలిసిందే. మళ్లీ ఇన్నేళ్ల గ్యాప్ తరువాత విజయ్ ఆంటోని హీరోగా, శశి దర్శకత్వంలో 'వంద దేవుళ్ళు' అనే చిత్రం రాబోతోంది. ఇప్పటి వరకు ఈ సినిమా నుంచి వచ్చిన పోస్టర్లు, గ్లింప్స్, పాటలు ఆడియెన్స్‌లో బజ్‌ను పెంచేశాయి. ఇక తాజాగా ఈ మూవీకి సంబంధించిన రిలీజ్ డేట్‌ను ప్రకటించారు.విజయ్ ఆంటోని ఫిల్మ్ కార్పోరేషన్, ఫాతిమా విజయ్ ఆంటోనీ సమర్పణలో.. సర్వంత్ రామ్ క్రియేషన్స్ బ్యానర్ మీద రామంజనేయులు జవ్వాజి నిర్మించిన ఈ మూవీని జూన్ 19న విడుదల చేయబోతోన్నట్టుగా ప్రకటించారు. ఈ సినిమాలో విజయ్ ఆంటోని, స్వాసిక, అజయ్, కావ్య, శక్తి, పదిని, కర్నాస్, బాలాజీ శక్తివేల్, దివాకర్, అరుళ్ దాస్, బక్స్, వినోదిని, మునిష్ కాంత్, కొడంగి వడివేలు తదితరులు ముఖ్య పాత్రల్ని పోషించారు.రిలీజ్ డేట్ ప్రకటిస్తూ వదిలిన పోస్టర్ ఎంతో ఇంప్రెస్సివ్‌గా ఉంది. ఈ పోస్టర్‌లో హీరో, హీరోయిన్ కనిపిస్తున్న తీరు, సైకిల్ మీద సింపుల్‌గా వెళ్తున్న తీరు చూస్తుంటే ఇదొక పీరియాడిక్ డ్రామా అని అర్థం అవుతోంది.



## 'సింగ్ గీతం'లో చాలా యూనిక్ క్యారెక్టర్ చేశా: హీరోయిన్ అహల్యా బమ్రూ

**వుదయం సినిమా:** లెజెండరీ డైరెక్టర్ సింగీతం శ్రీనివాసరావు తన అత్యంత ప్రతిష్ఠాత్మకమైన ప్రాజెక్ట్ 'సింగ్ గీతం' తో ముందుకు వస్తున్నారు. ప్రతిష్ఠాత్మక బ్యానర్లు వైజయంతి మూవీస్, స్వప్న సినిమా పై నాగ్ అశ్విన్ ఈ చిత్రాన్ని నిర్మించారు. ఆయాన్, అహల్యా బమ్రూ, శాలిని కొండెపుడి ఈ చిత్రంలో కీలక పాత్రలు పోషించారు. రాక్ స్టార్ దేవిశ్రీ ప్రసాద్ మ్యూజిక్ అందించారు. ఇప్పటికే విడుదలైన 'సింగ్ గీతం' టీజర్, పాటలకు మంచి రెస్పాన్స్ వచ్చింది. 'సింగ్ గీతం' జూన్ 11న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది. ఈ సందర్భంగా హీరోయిన్ అహల్యా బమ్రూ విలేకరుల సమావేశంలో సినిమా విశేషాలు పంచుకున్నారు.



**మీ నేపథ్యం గురించి చెప్పండి?**

మాది పుదుచ్చేరి. ఇంగ్లీష్, ఫ్రెంచ్, బెంగాలీ వంటి భాషలు మాట్లాడే ఒక ఇంటర్నేషనల్ కమ్యూనిటీలో పెరిగాను. నేను ఎప్పుడూ యాక్టర్ అవ్వాలని అనుకోలేదు. ఇన్‌స్టాగ్రామ్‌లో కంటెంట్ క్రియేట్ చేస్తుంటాను. నాగ్ అశ్విన్ గారు నా కంటెంట్ చూసి ఈ సినిమా గురించి చెప్పారు. నా ఆడిషన్ కూడా ఇన్‌స్టాగ్రామ్ ద్వారానే ఇచ్చాను (నవ్వుతూ).

**సింగీతం శ్రీనివాసరావుతో పని చేయడం ఎలా అనిపించింది?**

ఆయన అద్భుతమైన దర్శకుడు. ఆయన ఎన్నో గొప్ప సినిమాలు తీశారు. ఆయన సెన్స్ ఆఫ్ హ్యూమర్ కూడా చాలా బాగుంటుంది. ఆయన దర్శకత్వంలో పని చేయడం ఒక అదృష్టంగా భావిస్తున్నాను.

**సినిమా మొదటి రోజు సెట్స్‌కి వచ్చినప్పుడు ఎలా అనిపించింది?**

చాలా భయపడ్డాను. ఎందుకంటే నాకు తెలుగు రాదు. అయితే ఈ సినిమా యూనిట్ అంతా కుటుంబంలా కలిసిపోయింది.

**ఇందులో మీ పాత్ర ఎలా ఉంటుంది?**

సింగీతం పాత్రలను ఎంత అద్భుతంగా రాస్తారో అందరికీ తెలుసు. ఆయన సినిమాల్లో మహిళా పాత్రలు చాలా బలంగా, స్వతంత్రంగా ఉంటాయి. ఇందులో నా పాత్ర కూడా చాలా కొత్తగా ఉంటుంది. ఇది సాధారణ క్లాసికల్ హీరోయిన్ పాత్ర కాదు.

## పవన్ కళ్యాణ్ పై రాజకీయ కక్షతో సినీ పరిశ్రమను అవమానించొద్దు

పాశం యాదగిరికి నిర్మాత రాంకీ స్ట్రాంగ్ కౌంటర్"



**వుదయం సినిమా:** రాజకీయాల్లో విమర్శలు చేయడం వేరు.. ఆ నెపంతో ఒక పరిశ్రమ మొత్తాన్ని, దాన్ని నమ్ముకున్న వేలాది కుటుంబాలను అవమానించడం వేరు. పవన్ కల్యాణ్‌పై వ్యక్తిగత కక్షో, రాజకీయ కంచో పెట్టుకుని.. దానికి సినీ ఇండస్ట్రీని ముడిపెడుతూ సీనియర్ జర్నలిస్ట్ పాశం యాదగిరి చేసిన వ్యాఖ్యలు కచ్చితంగా అభ్యంతరకరం, దారుణం అని కౌంటర్ ఇస్తున్నారు సినీ నిర్మాత రాంకీ. మేధావి ముసుగులో ఇండస్ట్రీపై ఆయన వెళ్లగక్కిన విషానికి, సినీ నిర్మాత రాంకీ తనదైన శైలిలో చురకలు అంటించారు. పాశం యాదగిరి బ్యాక్‌గ్రౌండ్ చూసి, ఆయన జర్నలిజం అనుభవం చూసి ఇన్నాళ్లూ మేధావి అనుకున్నారు. తెలంగాణ ఉద్యమ కాలంలో ఆ కలం, ఆ గళం చూసి ఒక గౌరవం ఉండేది. పాశం కళ్ల ముందే ఎంతో మంది ముఖ్యమంత్రులు మారారు, వందల మంది రాజకీయ నేతలను ఆయన చూశారు. కానీ, ఇంత చదువు చదివి, ఇన్నేళ్ల సీనియారిటీ పెట్టుకుని.. ఈ రోజు ఒక పవన్ కల్యాణ్ లాంటి ఒక రాజకీయ నాయకుడిని రాజకీయంగా ఎదుర్కొనే దమ్ము లేక, మధ్యలోకి సినీ ఇండస్ట్రీని లాగి తన సంకుచిత బుద్ధిని బయట పెట్టుకున్నారు పాశం.

## "సర్కారు బాయి' ఫస్ట్ లుక్ పోస్టర్ విడుదల



**వుదయం సినిమా:** తెలంగాణ సామాజిక నేపథ్యంలో నీటి సమస్యలు, కుల వివక్ష, అణగారిన వర్గాల జీవిత పోరాటాలను ప్రతిబింబించే కథాంశంతో తెరకెక్కుతున్న 'సర్కారు బాయి' సినిమా ఫస్ట్ లుక్ పోస్టర్‌ను హైదరాబాద్ ఫిలిం ఛాంబర్‌లో ఘనంగా విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ దర్శక నిర్మాత తమ్మారెడ్డి భరద్వాజ, తెలుగు దర్శకుల సంఘం అధ్యక్షుడు వీఎన్ ఆదిత్య ముఖ్య అతిథులుగా పాల్గొని పోస్టర్‌ను ఆవిష్కరించి చిత్ర బృందానికి శుభాకాంక్షలు తెలిపారు.శ్రీరామ్ నిమ్మల, వర్షిక జంటగా నటిస్తున్న ఈ చిత్రానికి లారా దర్శకత్వం వహిస్తుండగా, తుమ్మల ప్రఫుల్ రాంరెడ్డి నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. తెలంగాణలో 80 దశకం లో జరిగిన వాస్తవ సంఘటనల ఆధారంగా ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నారు. ఈ సందర్భంగాతమ్మారెడ్డి భరద్వాజ మాట్లాడుతూ "నీటి సమస్య అనేది కేవలం ఒక ప్రాంతానికే పరిమి తం కాదు. ఇప్పటికీ అనేక ప్రాంతాల్లో ప్రజలు నీటి కోసం ఇబ్బందులు పడుతున్నారు. అలాం టి కీలకమైన అంశాన్ని కథాంశంగా తీసుకుని సినిమా రూపొందించడం ఆనందంగా ఉంది. ప్రస్తుతం తెలుగు చిత్ర పరిశ్రమలో తెలుగు అమ్మాయిలకు మంచి అవకాశాలు లభిస్తున్నా యి. ఈ సినిమాలో నటించిన హీరోయిన్‌కు మంచి భవిష్యత్తు ఉంటుందని నమ్ముతున్నాను. చిత్ర యూనిట్‌కు నా హృదయపూర్వక అభినందనలు" అని అన్నారు. తెలుగు దర్శకుల సంఘం అధ్యక్షుడు వీఎన్ ఆదిత్య మాట్లాడుతూ, "సర్కారు బాయి" కథాంశం చాలా ఆసక్తికరంగా ఉంది. ప్రస్తుతం ప్రేక్షకులు కంటెంట్‌కు ప్రాధాన్యత ఇస్తున్నారు.

## తిరుమల శ్రీవారి సేవలో 'పెద్ది' దర్శకుడు బుచ్చిబాబు

**వుదయం సినిమా:** తిరుమల శ్రీవారిని 'పెద్ది' చిత్ర దర్శకుడు బుచ్చిబాబు దర్శించుకున్నారు. బుధవారం సాయంత్రం కుటుంబసభ్యులతో కలసి స్వామివారి సేవలో పాల్గొన్నారు. దర్శనం అనంతరం ఆలయ అధికారులు స్వామివారి తీర్థప్రసాదాలను వారికి అందజేశారు. ఆలయం వెలుపల మీడియాతో బుచ్చిబాబు మాట్లాడారు. 'పెద్ది' కోసం హీరో రామ్‌చరణ్‌తో పాటు చిత్ర యూనిట్ అంతా చాలా కష్టపడ్డామని చెప్పారు. శ్రీవారి ఆశీస్సులతో 'పెద్ది' ఘనవిజయం సాధించాలని ఆకాంక్షించారు.



## 19 నుంచి CSSB2 ప్రారంభం

**వుదయం సినిమా:** ఎర్రచీర చిత్రంతో ప్రేక్షకుల దృష్టిని ఆకర్షించిన క్రియేటివ్ స్టార్ సుమన్ బాబు, ఇప్పుడు మరో యాక్షన్ ఫ్యామిలీ డ్రామాతో ప్రేక్షకుల ముందుకు రానున్నారు. శ్రీ సుమన్ వెంకటాద్రి ప్రొడక్షన్స్ బ్యానర్‌పై తెరకెక్కనున్న CSSB2 చిత్రం జూన్ 19వ తేదీ నుంచి అధికారికంగా ప్రారంభం కానుంది.పూర్తి స్థాయి మాస్ యాక్షన్, ఫ్యామిలీ సెంటిమెంట్ అంశాలతో రూపొందుతున్న ఈ చిత్రం రాయలసీమ బ్యాక్ డ్రాప్ కథతో రూపొందిస్తున్నట్లు చిత్ర యూనిట్ వెల్లడించింది. ముఖ్యంగా తండ్రి–కొడుకు అనుబంధాన్ని హృద్యంగా ఆవిష్కరించే ఈ చిత్రం ప్రతి కుటుంబానికి దగ్గరయ్యేలా ఉంటుందని సుమన్ బాబు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "ఎర్రచీర చిత్రాన్ని ఆదరించిన తెలుగు ప్రేక్షకులందరికీ హృదయపూర్వక కృతజ్ఞతలు. ఆ చిత్రం 294 స్క్రీన్లలో విడుదలై మంచి స్పందనను అందుకుంది. త్వరలోనే ఎర్రచీర ఓటీటీ విడుదలకు సంబంధించిన ప్రకటన కూడా చేయనున్నాం. ప్రస్తుతం ప్రారంభించబోతున్న CSSB2 కూడా ప్రతి ప్రేక్షకుడి హృదయాన్ని తాకేలా ఉంటుంది. ప్రతి తండ్రి తన కుమారుడిని ఎలా తీర్చిదిద్దాలనే సందేశాన్ని బలమైన యాక్షన్, భావోద్వేగాలతో చూపించబోతున్నాం" అని అన్నారు.ఈ చిత్రానికి స్క్రీన్ ప్లే, డైరెక్షన్ సి హెచ్ సుమన్ బాబు కాగా, కథ, మాటలు కె. బాలకిషోర్, ఛాయాగ్రహణం కమిలి శివ, సంగీతం రాప్‌రాక్ షకీల్, ఎడిటింగ్ డి. వెంకట ప్రభు అందిస్తున్నారు. చిత్రంలోని నటీనటులు మరియు ఇతర సాంకేతిక నిపుణుల వివరాలను త్వరలో ప్రకటించనున్నారు.



Printed, Published & Owned by SIRIKONDA MARIA, Printed at ASHISH PUBLICATIONS H.No. 1-7-25/5, Risalagadda, RTC X Roads, Hyderabad - 500020 and Published from H. No. 1-7-25/5, Risalagadda,RTC X Roads, Hyderabad - 500020, Telangana.
Editor : SIRIKONDA AUGUSTIN. RNI No.: TELTEL/2000/00272. E-mail : voodayam2007@gmail.com, Cell : 9247698676. Telefax: 040-27678676.